సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

శుక్రవారం 19-7-2019

సంపుటి: 12

సంచిక: 118

'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'



టైటిల్ వేటలో టైటాన్స్

ప్రొ కబడ్డీ లీగ్-7లో తెలుగు టైటాన్స్ గెలుపు అవకాశాలపై కథనం - స్పోర్ట్స్‌లో

భారత వృద్ధిపై ప్రతికూలం

2019-20 భారత ఆర్థిక స్థితిపై అంతర్జాతీయ ప్రభావం: ఏడీబీ -బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

నిలబెట్టుకోలేక నిందలా!

రాజ్యాంగం ప్రకారమే టీఆర్ఎస్‌లో కాంగ్రెస్ శాసనసభాపక్ష విలీనం: కేసీఆర్

- మీకు ఆకర్షణ ఉంటే ఎవరైనా పార్టీ ఎందుకు వీడతారు..
- మూడింట రెండో వంతు మంది పార్టీ చీలి వస్తే చేర్చుకోరా?
- కాంగ్రెస్ విలీనంపై శాసనసభలో ముఖ్యమంత్రి ఘాటు సమాధానం
- విలీనంపై కాంగ్రెస్ నిరసన.. సభలో అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని భట్టి విక్రమార్క ధ్వజం.. వాకౌట్
- ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నిరసనకు దూరం

సాక్షి, హైదరాబాద్

టీఆర్ఎస్ పార్టీలో కాంగ్రెస్ శాసనసభాపక్షం విలీనంపై కాంగ్రెస్ పార్టీ వారే సమాధానపర్చుకోవాలని, వారికి వారే జవాబు చెప్పుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. ఆ విలీనం రాజ్యాంగ నిబంధనలకు లోబడే జరిగిందని స్పష్టంచేశారు. ఈ మధ్యే మూడింట రెండో వంతు టీడీపీ రాజ్యసభ సభ్యులు బీజేపీలో విలీనమయ్యారని, వారు ప్రధానిని సైతం కలిశారని కేసీఆర్ గుర్తు చేశారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ వారే బీజేపీలో విలీనమైపోయారని పేర్కొన్నారు. ''దేశవ్యాప్తంగా మీ పార్టీవారి మీద మీ ఆకర్షణ తగ్గిపోయి, మిమ్మల్ని వదిలిపెట్టి బయటకు వెళ్తే మమ్మల్ని నిందిస్తే ఎలా? మీకు మీరు కంట్రోల్ చేసుకోవాలి తప్ప ఇతరుల మీద పడి ఏడ్వడం కరెక్ట్ కాదు. మీరే కాపాడుకోవాలి. మీకు ఆకర్షణ ఉంటే, మీకు నాయకత్వ పటిమ ఉంటే ఎవరెందుకు పార్టీని వీడతారు''అని ప్రశ్నించారు. ఏదో క్రైం జరిగినట్టు.. ఏదో రాజ్యాంగ వ్యతిరేక చర్య జరిగినట్టు కాంగ్రెస్ పార్టీ గోల చేస్తోందని దుయ్యబట్టారు. టీఆర్ఎస్‌లో కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క గురువారం శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రయత్నించగా.. సీఎం కేసీఆర్ ఘాటుగా బదులిచ్చారు. భట్టి విక్రమార్క

మిగతా 2వ పేజీలో ▶

గురువారం శాసనసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

7 కొత్త కార్పొరేషన్లు

రాష్ట్రంలో 6 కార్పొరేషన్లు ఉండగా, కొత్త మున్సిపల్ చట్టం ద్వారా మరో 7 కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తున్నాం. కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో జనాభా పెరగడంతో చట్టాలకు సవరణ చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది.

హెరిటేజ్ కట్టడాలు ఓ జోక్‌లా మారింది..

రాష్ట్రం ఏర్పడ్డాక చరిత్రాత్మకమైన కట్టడాలు, కోటల పరిరక్షణ కోసం సమగ్రమైన వారసత్వ సంపద చట్టాన్ని తీసుకొచ్చాం. ఇది జీవో కాదు.. ఒక చట్టం. ఈ చట్టంపై నిపుణుల సిఫారసుల ప్రకారం నిర్ణయాలు తీసుకుంటాం.

15 వేల కోట్లయినా కడతాం..

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ కోసం ఏటా రూ.10 వేల కోట్ల విద్యుత్ బిల్లులను చెల్లించడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రైతులను కాపాడుకోవడానికి అవసరమైతే రూ.15 వేల కోట్లయినా చెల్లిస్తాం. - శాసనసభలో కేసీఆర్

అలహాబాద్ బ్యాంకులో

మరో మోసం

రూ. 688 కోట్లు కొల్లగొట్టిన ఎస్ఈఎల్ఎం!

ప్రభుత్వ రంగ అలహాబాద్ బ్యాంక్ కార్యకలాపాల తీరుపై సందేహాలు రేకెత్తించేలా తాజాగా మరో మోసం బైటపడింది. ఎస్ఈఎల్ మాన్యుఫాక్చరింగ్ (ఎస్ఈఎల్ఎం) రూ. 688.27 కోట్ల మేర మోసానికి పాల్పడినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు అలహాబాద్ బ్యాంకు వెల్లడించింది.

- బిజినెస్‌లో

'శరవణ' రాజగోపాల్

కన్నుమూత

చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

దక్షిణ భారత ఆహారాన్ని అందించడంలో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన శరవణ భవన్ హోటళ్ల గ్రూప్ అధినేత పి.రాజగోపాల్ కోర్టు విధించిన యావజ్జీవ జైలు శిక్షను అనుభవించడానికి ముందే కన్నుమూశారు.

- వివరాలు 13లో

కర్నాటకం.. క్లైమాక్స్ నేడే

మధ్యాహ్నం 1.30 గంటల్లోగా మెజారిటీ నిరూపించుకోవాలని ముఖ్యమంత్రి కుమారస్వామికి గవర్నర్ ఆదేశం

- హైడ్రామా మధ్య విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సీఎం
- జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరిన బీజేపీ
- గురువారంలోగా విశ్వాసపరీక్ష పూర్తిచేయాలన్న గవర్నర్ సూచనను పట్టించుకోని స్పీకర్.. విప్‌ల జారీ తేల్చాకే బలపరీక్షన్న సిద్ధరామయ్య
- అసెంబ్లీలో కాంగ్రెస్-బీజేపీ నినాదాలు.. పలుమార్లు సభ వాయిదా
- 17 మంది కాంగ్రెస్-జేడీఎస్ ఎమ్మెల్యేల డుమ్మా
- సభను శుక్రవారానికి వాయిదా వేసిన డిప్యూటీ స్పీకర్ కృష్ణారెడ్డి

13 లో



అసెంబ్లీలో విచార వదనంతో కూర్చున్న ముఖ్యమంత్రి కుమారస్వామి

జవాబు'దారి'లో భారీ మార్పులు

భారీ సంస్కరణలతో సభ ముందుకు కొత్త మున్సిపల్ చట్టం

- కొత్త మున్సిపల్ చట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా తెరపైకి తెచ్చింది. పారదర్శకత, జవాబుదారీతనంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధుల ఉమ్మడి భాగస్వామ్యంతో మున్సిపల్ పాలనను పరుగులు పెట్టించేలా ఈ చట్టాన్ని రూపొందించింది. ఓవైపు బాధ్యతలను గుర్తుచేస్తూనే మరోవైపు సంస్కరణలను ప్రవేశపెడుతూ రూపొందించిన ఈ చట్టంలో జిల్లా కలెక్టర్లను సూపర్‌బాస్‌లను చేసింది. ప్రజాప్రతినిధుల పనితీరుపై ఓ కన్నేసి ఉంచేలా నిబంధనలను తీసుకొచ్చింది.

- వివరాలు 5లో

మాయా సోదరుడి 400 కోట్ల స్థలం అటాచ్

- బీఎస్‌పీ అధినేత్రి మాయావతి సోదరుడికి చెందిన రూ.400 కోట్ల విలువైన ప్లాట్‌ను ఆదాయపన్ను శాఖ(ఐటీ) అటాచ్ చేసింది.

- వివరాలు 13లో

స్టూడియోకు నిప్పు

- జపాన్‌లో 33 మంది మృతి
- మరో 35 మందికి తీవ్రగాయాలు
- క్యోటో నగరంలో ఘటన
- పోలీసుల అదుపులో నిందితుడు

- వివరాలు 13లో

చదువుల తల్లులకు కేటీఆర్ భరోసా

- నేనున్నానని చేరదీసిన కేటీఆర్
- సీబీఐటీలో సీటు సాధించిన అనాథకు ఆర్థికసాయం
- ఐఐటీలో సీటు సాధించిన పేద విద్యార్థినికి సాయం

సాక్షి, హైదరాబాద్: వారు మట్టిలో పుట్టిన మాణిక్యాలు. పేదరికంలో వికసించిన విద్యా కుసుమాలు. వారే రుద్ర రచన, మేకల అంజలి. రచనకు చదువులతల్లి తప్ప అమ్మానాన్న లేరు. అంజలికి సరస్వతీ దీవెనలున్నా లక్ష్మీకటాక్షం లేదు. అయితేనేం... సోషల్ మీడియా ఉందిగ దా..! సామాజిక మాధ్యమ వేదికలపై చురుగ్గా ఉండే టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారి పరిస్థితి తెలుసుకుని వారిని చేరదీశారు. నేనున్నా.. అని భరోసా ఇచ్చారు. గురువారం తన నివాసానికి పిలిపించుకుని ఆర్థికసాయం చేశారు. కేటీఆర్‌కు నిండుమనసుతో కృతజ్ఞత లు చెప్పుకొని కొత్త చరిత్ర రచిస్తానని రచన, చదువులతల్లికి అక్షరాంజలి ఘటిస్తానని అంజలి ముందుకుసాగారు.

సీబీఐటీకి రచన

రచనది జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తాండ్రియాల. చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. జగిత్యాల బాలసదనంలో ఉంటూ పదో తరగతి వరకు చదివింది. ఆ తర్వాత హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని స్టేట్‌హోమ్‌లో ఉంటూ పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసింది. ఇటీవల జరిగిన ఈసెట్ పరీక్షలో మంచిర్యాంకు సాధించింది. కౌన్సెలింగ్‌లో చైత న్యభారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో(సీ బీఐటీ) కంప్యూటర్ సైన్స్‌లో సీటు సాధించిం ది. కేటీఆర్ తన నివాసానికి రచనను పిలిపిం చుకున్నారు. విద్యాభ్యాసానికి అవసరమైన ఫీజుల్ని, అవసరమైన ఇతర ఖర్చులను భరిస్తా నని, విద్యపైనే పూర్తి శ్రద్ధ పెట్టాలని రచనకు సూచించారు.

ఇండోర్ ఐఐటీకి అంజలి

అంజలిది వరంగల్ జిల్లా హసన్‌పర్తి. ఐఐటీ ఇండోర్‌లో సీటు సాధించింది. అంజలి తండ్రి రమేశ్ ఆటోడ్రైవర్. అంజలి సోదరి గత ఏడాది 'నీట్'లో మంచిర్యాంకు సాధించి ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో చేరింది. పెద్ద కూతురు చదువు కోసం రమేశ్ తనకున్న భూమిని అమ్మి ఫీజులు చెల్లించాడు. రెండో కూతురు అంజలి ఇండోర్ ఐఐటీలో సీటు సాధించినా ఆర్థిక స్తోమత లేక దిక్కుతోచనిస్థి తిలో ఉన్నాడు. తన తండ్రి పడుతున్న ఇబ్బం దిని అంజలి గమనించి ట్విట్టర్ ద్వారా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లింది. అంజలిని తన నివాసానికి పిలిపించిన కేటీఆర్.. ఐఐటీ ఫీజులకు అవస రమైన ఆర్థికసాయాన్ని అందజేశారు. భవిష్య త్తులో తాను సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాస్తానని అంజలి తన ఆకాంక్ష వ్యక్తం చేసింది. ఆర్థికసాయం అందించిన కేటీఆర్‌కి అంజలి తండ్రి ధన్యవాదాలు తెలిపాడు.



గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో అంజలి, రచనలకు చెక్కులను అందజేస్తున్న కేటీఆర్

అనాథలందరికీ ఆసరా కావాలి

తనలాగే అనేకమంది విద్యావంతులైన అనా థలు రాష్ట్రంలో ఎందరో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక రిజర్వేషన్ కేటగిరీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని కేటీఆర్‌కు రచన విజ్ఞప్తి చేసింది. రచన సామాజిక స్పృహను అభినం దించిన కేటీఆర్, ఈ విషయాన్ని సీఎం కేసీ ఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. రచన బాగోగులు చూస్తున్న ఆమె అక్కబావ కు అవసరమైన ఆర్థికసాయం లేదా ఉపాధికి సంబంధించిన ఇతర సహాయాన్ని అందిం చేలా చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ శరత్‌కు ఫోన్‌లో సూచించారు.

ప్రాజెక్టుల రూపకల్పనకు పెద్ద మనసుండాలి

ఆర్థిక బిల్లుపై చర్చలో టీఆర్ఎస్

రంజిత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజా సంక్షేమం కోసం ప్రాజెక్టుల రూపకల్పన చేసేందుకు పెద్ద మనసు ఉండాలని కేంద్రానికి టీఆర్ఎస్ సూచించింది. గురువారం లోక్‌స భలో ఆర్థిక బిల్లుపై జరిగిన చర్చలో టీఆర్ఎస్ తర పున ఎంపీ రంజిత్‌రెడ్డి ప్రసంగించారు. కేంద్ర ప్రభు త్వం బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా ఫించన్లకు రూ.10 వేల కోట్లు కేటాయిస్తే... తెలంగాణ సీఎం కేసీఆర్ మాత్రం పెద్ద మనసుతో రూ. 11 వేల కోట్లు కేటాయించారన్నారు. ఇక కేంద్రం గుర్తించిన 256 జిల్లాలో ఇంటిం టికీ మంచినీటి సరఫరాకు ప్రవేశపెట్టిన 'హర్ ఘర్ జల్'పథకానికి రూ. 10 వేల కోట్లు మాత్రమే కేటాయిస్తే.. కేసీఆర్ రూ. 40 వేల కోట్లతో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి మంచినీటి సరఫరా చేస్తున్నారని వివరించారు. అలాగే పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న ఉద్దేశంతో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణా నికి శ్రీకారం చుట్టారన్నారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ ప్రాజెక్టులను నీతి ఆయోగ్ ప్రశంసించి, రూ. 24 వేల కోట్లు మంజూరు చేయాల్సిందిగా కేంద్రానికి సిఫార్సు చేసిందన్నారు. అయితే కేంద్రం మాత్రం బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు లకు జాతీయ హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్‌లో హైదరాబాద్ ఐఐటీకి రూ. 280 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్ ఫేజ్-2కు రూ. 120 కోట్లు, గిరిజన వర్సిటీకి రూ. 8 కోట్ల నిధులు మాత్రమే కేటాయించిందన్నారు. చిన్న రాష్ట్రంగా తెలంగాణలో బడ్జెట్ పరిమితులు ఉన్న నేపథ్యంలో రాష్ట్రానికి సాయం చేయ డంలో కేంద్రం తక్కువ చేయకూడదన్నారు.

కరీంనగర్ ప్రజల రైల్వే డిమాండ్లు తీర్చండి

కేంద్ర మంత్రిని కోరిన బీజేపీ ఎంపీ బండి సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నో ఏళ్లుగా అమలుకు నోచుకోని కరీంనగర్ ప్రాంత ప్రజల రైల్వే డిమాండ్లను తీర్చాల్సిం దిగా బీజేపీ ఎంపీ బండి సంజయ్ కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌ను కోరారు. ఈ మేరకు పలు ప్రతిపా దనలతో గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలసి విన తిపత్రాన్ని అందజేశారు. ఇందులో ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ప్రజలకు సౌలభ్యంగా ఉండేలా కరీంనగర్-తిరుపతి బై వీక్లీ ఎక్స్ ప్రెస్‌ను ప్రతిరోజూ నడపాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ నుంచి హైదరాబా ద్‌కు నేరుగా రైలు నడపాలని కోరారు. ప్రస్తుతం కేటాయించిన ఒక ప్యాసింజర్ రైలు నిజామాబాద్ మీదుగా వెళ్తుండటంతో కరీంనగర్ నుంచి ప్రతిరోజు జీవ నోపాధికి హైదరాబాద్ వెళ్లే ప్రజలు సకాలంలో గమ్యస్థానానికి చేరుకోలేకపో తున్నారని వివరించారు. అలాగే ప్రస్తుతం నడుస్తున్న ముంబై ఎల్‌టీటీ రైలు ఫ్రీక్వెన్సీని పెంచాల్సిందిగా కోరారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన షిరిడీకి వీక్లీ రైలు నడపాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కరీంనగర్‌లో లెవెల్ క్రాసింగ్-18(టీ) వద్ద ఆర్వోబీ నిర్మించాలని కోరారు.

భద్రాద్రికి రైల్వే సౌకర్యం కల్పించండి: కవిత

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రా చల ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం పాండురంగ పురం నుంచి సారపాక వరకు 13.5 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మించాల్సిందిగా కేంద్ర రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను టీఆర్ఎస్ ఎంపీ మాలోత్ కవిత కోరారు. ఈమేరకు గురువారం ఆమె వినతిపత్రం సమర్పించారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌ను ఏ క్లాస్ స్టేషన్‌గా ఆధునీకరించాలని కోరారు. మహబూబాబాద్‌లోని స్థానిక శ్రీనివాస థియేటర్ నుంచి మదర్ థెరిస్సా విగ్రహం వరకు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మించాలని, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

కొత్తగా రెండు రెవెన్యూ డివిజన్లు

కొల్లాపూర్, కోరుట్లలో ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా మరో రెండు రెవెన్యూ డివిజన్లను ప్రభు త్వం ఏర్పాటు చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్, జగిత్యాల జిల్లా లోని కోరుట్లను నూతన రెవెన్యూ డివిజన్‌లుగా చేస్తూ రెవెన్యూ ప్రత్యేక ప్రధా న కార్యదర్శి రాజేశ్వర్ తివారీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వు లతో కొల్లాపూర్ డివిజన్ పరిధిలో కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, కోడూరు, పెంట్లవెళ్లి మండలాలు.. కోరుట్ల రెవెన్యూ డివిజన్‌లో కోరుట్ల, మేడిపల్లి, కత్లా పూర్ మండలాలు రానున్నాయి.

కేటీఆర్‌తో ఫ్రెంచి రాయబారి భేటీ

సాక్షి, హైదరాబాద్: ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ ఫ్రాంకోయిస్ గైషర్ గురువారం టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో క్యాంపు కార్యాలయంలో భేటీ అయ్యారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ఆయన కేటీఆర్‌తో మర్యాదపూ ర్వకంగా భేటీ అయినట్లు టీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. ఈ భేటీలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, ఎమ్మెల్యే బాల్క సుమన్ కూడా పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులను సరిచేయండి

- 'సాక్షి'కథనంపై వివరణ ఇచ్చిన ఎస్ఈసీ

సాక్షి, హైదరాబాద్/ షాద్‌నగర్ టౌన్: రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్ మున్సి పాలిటీ ఓటర్ల జాబితాలో దొర్లిన తప్పులు వెంటనే సరిచేయాలని రాష్ట్ర ఎన్ని కల కమిషన్ (ఎస్ఈసీ) సంబంధిత అధికారులను ఆదేశించింది. తాజా అసెం బ్లీ ఓటర్ల జాబితా ఆధారంగానే అధికారులు మున్సిపాలిటీల ఓటర్ల జాబితా లను సిద్ధం చేయాల్సి ఉంటుందని, తమకు తాముగా సవరణలుగానీ, మార్పులు చేర్పులు గానీ చేయకూడదని ఎస్ఈసీ స్పష్టం చేసింది. షాద్‌నగర్ మున్సిపాలిటీ ఓటర్ల జాబితాపై బుధవారం 'సాక్షి'పత్రికలో 'పేరు డ..డ-తండ్రిపేరు హ..హ'శీర్షికతో వచ్చిన కథనానికి ఎస్ఈసీ గురువారం వివరణ ఇచ్చింది. ఈ అంశంపై సీఈవో తెలంగాణ వెబ్‌సైట్‌ను పరిశీలించగా మున్సి పల్ ఓటర్ల జాబితా ప్రచురించిన విధంగానే ఉందని ఎస్ఈసీ కార్యదర్శి ఎం.అశోక్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగులో ప్రచురించిన అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లితే అవే తప్పులు మున్సిపల్ ఓటర్ల జాబితాలోనూ వచ్చాయన్నారు. అయినప్పటికీ (షాద్‌నగర్ మున్సిపా లిటీ జాబితా) ఏవైనా వ్యత్యాసాలుంటే ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి దృష్టికి తీసుకువచ్చి అసెంబ్లీ జాబితాలో సవరించి, వాటిని మున్సిపల్ ఓటర్ల జాబి తాలో పొందుపరచాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, అధి కారులను ఆదేశించినట్టు తెలిపారు.

పోలీస్ వాహనంపై టిక్‌టాక్

- హోంమంత్రి మనవడి వీడియో వైరల్

సాక్షి, హైదరాబాద్: సోషల్ మీడియా, సైబర్ అనర్థాలపై అప్రమత్తంగా ఉండా లంటూ డీజీపీ తన ట్విట్టర్‌లో రోజూ పౌరులను హెచ్చరిస్తూ ఉంటారు. విచి త్రంగా ఆయన పేరిట రిజిస్ట్రర్ అయిన ఓ వాహనంపై ఏకంగా హోంమంత్రి మహమూద్ అలీ మనవడు, అతడి స్నేహితుడు కలసి డిపార్ట్‌మెంట్‌కు వ్యతిరే కంగా చేసిన టిక్‌టాక్ వీడియో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ వీడి యోలో ఐజీ స్థాయి అధికారిని నోరు అదుపులో పెట్టుకోవాలని లేదంటే పీక కోస్తా అంటూ బెదిరిస్తూ చెప్పే ఓ సినిమా డైలాగ్ ఉండటంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సదరు వీడియోపై డీజీ కార్యాలయంలోనూ గురువారమంతా చర్చ జరిగింది. విషయం డీజీపీ, ఏడీజీ దృష్టికి కూడా వెళ్లి నట్లు తెలిసింది. డీజీపీ కార్యాలయం సమాచారం ప్రకారం.. ఆ వీడియో చాలా పాతదని, అక్కడ కారుపై కూర్చున్న యువకుడు హోంమంత్రి మనవడు కాగా, డైలాగులు చెప్పిన యువకుడు అతడి స్నేహితుడని తెలిపారు. ఇక ఆ వాహనం హోంమంత్రి మహమూద్ అలీ భద్రత కోసం కేటాయించిన కారులో అది కూడా ఒకటని తెలిపారు. తెలంగాణలో ఉన్న ప్రతీ పోలీసు వాహనం డీజీపీ పేరుతో రిజిస్టర్ అయి ఉంటుందని వివరణ ఇచ్చారు.

సేవా కార్యక్రమాల్లో బిగ్ సీ ఉద్యోగులు

హైదరాబాద్: ప్రముఖ మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ సీ ఉద్యోగులు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. సంస్థ వ్యవస్థాపక, సీఎండీ ఎమ్. బాలూ చౌదరి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బిగ్ సీ షోరూమ్‌లున్న 78 పట్టణాలు, నగరాల్లో మొక్కలు నాటడం, రక్తదానం చేయడం, అనాథలకు ఆహారం అం దించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. వ్యాపార సంస్థ అంటే లాభాపేక్ష మాత్రమే కాక విలువలు కలిగి ఉండాలన్నది తమ ఆశయమని, ఇందులో భా గంగానే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కంపెనీ వర్గాలు తెలిపాయి.

నిలబెట్టుకోలేక నిందలా!

గురువారం అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

తన ఆక్రోశం చెప్పుకుంటున్నారని, దానికి తాము బాధ్యులం కామని పేర్కొన్నారు. రాజ్యాంగ నిబంధనలకు లోబడి, షెడ్యూల్ 10 ప్రకారం కాంగ్రెస్ శాసనసభాపక్షం విలీనమైం దని స్పష్టంచేశారు.

మేం ఎవరినీ చేర్చుకోలేదు

అధికారంలోకి వచ్చిన తర్వాత కొంత మంది ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరతామని వచ్చినా చేర్చుకోలేదని సీఎం తెలిపారు. ఏ పార్టీ సభ్యుడూ తమ పార్టీలో చేరలేదని వివరిం చారు. తామే 88 మంది గెలిచామని, ఇద్దరు స్వతంత్రులు వచ్చి చేరారని, నాలుగింట మూడో వంతుకు మించిన మెజార్టీ తమకు అవ సరం లేదని, ఆ విషయమే ఆ ఎమ్మెల్యేలకు చెప్పామని వెల్లడించారు. రాజ్యాంగ నిబంధ నల ప్రకారం కాంగ్రెస్ పార్టీలో చీలిక వస్తే తానేం చేయగలనని ప్రశ్నించారు. ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉందని, అయినా కాం గ్రెస్‌వారు పదేపదే ప్రస్తావిస్తున్నారు కాబట్టి వివరణ ఇవ్వాల్సిన బాధ్యత తనకు ఉన్నందున స్పందించానని చెప్పారు. ''మీకు అన్యాయం జరిగిన మాట వాస్తవమండి.. మేమేం చేయా లి? కాపాడుకునే శక్తి లేకపోతే.. మీ సభ్యులే విక ర్షణకు గురైతే దానికి మేమేం చేయాలి''అని ప్రశ్నించారు. ఈ దేశంలో ఎవరైనా మూడింట రెండో వంతు పార్టీ చీలిపోయి వస్తే చేర్చు కోరా? విలీనం చేసుకోరా? దాని ప్రకారమే తమరు ఉత్తర్వులిచ్చారు.. బులెటిన్ జారీ చేశారు అని స్పీకర్‌ను ఉద్దేశించి సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. దీనికి తమ మీద పడి ఏడ్వడం ఎందుకుని కాంగ్రెస్ పార్టీని నిలదీశారు. దేశా నికి తెలంగాణ రోల్ మోడల్‌గా ఉం టుందని, ఇందులో ఎవరికీ సం దేహం అవసరంలేదని వ్యా ఖ్యానించారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ దేశానికి రోల్ మోడల్ గా ఉండాలని, పార్టీ ఫిరాయింపులు సరికా దని భట్టి విక్రమార్క పేర్కొనగా సీఎం ఈ మేరకు బదులిచ్చారు.

బ్యాలెట్‌తో కూడా మేమే గెలిచాం..

''శాసనసభ ఎన్నికలకు ముందు వీళ్లు ఎన్ని చెప్పాలో అన్ని చెప్పారు.. ఇదే శాసనసభలో మాట్లాడారు.. సస్పెండ్ చేయించుకున్నారు.. బాయ్‌కాట్ చేయించుకున్నారు.. గవర్నర్ గారి మీద దాడులు జరిగినయి.. ప్రజల ముందుకు వెళ్లి 3/4 మెజారిటీతో గెలిచి వచ్చినం. ఆ తర్వాత నెల రోజులు ఈవీఎంల గోల్‌మాల్ అని గోలపెట్టారు. బ్యాలెట్‌తో సర్పంచులను గెలిచినం. 32 జిల్లా పరిషత్‌లను బ్యాలెట్‌తో గెలుచుకున్నం. దానికి ఏం చెబుతారు''అని కాంగ్రెస్ పార్టీని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. 83 శాతం గ్రామ పంచాయతీలు, 92 శాతం మండలాలను గెలిచామని గుర్తుచేశారు.

కాంగ్రెస్ తలోదారి..

టీఆర్ఎస్‌లో 12 మంది కాంగ్రెస్ శాసనసభ్యుల విలీనానికి నిరసనగా కాంగ్రెస్ చేప ట్టిన కార్యక్రమంలో ఆ పార్టీ నేతల అనైక్యత బయటపడింది. అందరూ ఏకతా టిపై ఉండకుండా తలోతీరుగా వ్యవ హరించారు. సీఎల్పీ నేత భట్టి విక్ర మార్క, పార్టీ సభ్యులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొడెం వీరయ్య నల్ల కండు వాలు ధరించి సభకు హాజరయ్యారు. సభలో చర్చ జరుగుతున్న సమయంలో సేవ్ డెమోక్రసీ అని రాసిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిలబడి నిరసన తెలిపారు. వీరితో కలిసే సభలో ప్రవేశించిన మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చివరి వరుసలో ఒంటరిగా కూర్చొని నిరసన కార్యక్రమాలకు దూరంగా ఉండిపో యారు. వివిధ బిల్లులపై చర్చ జరుగుతున్న సందర్భంగా టీఆర్ఎస్‌లో కాంగ్రెస్ శాసనస భాపక్షం విలీనంపై మాట్లాడేందుకు భట్టి విక్ర మార్క విఫలయత్నం చేశారు. టీఆర్ఎస్‌లో కాంగ్రెస్ శాసనసభా పక్షం విలీనం అంశం కోర్టు పరిధిలో ఉండడంతో సభలో చర్చించడం సరికాద ని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బదులి చ్చారు. సభా నిబంధ నల ప్రకారం ఎజెం డాలోని అంశాలపై మాత్రమే మాట్లాడా లని పేర్కొంటూ.. భట్టి మాట్లాడేందుకు ప్రయ త్నించిన ప్రతిసారీ మైక్ కట్ చేశారు. ఎవరు ఏ పార్టీలో గెలిచినా చివరకు టీఆర్ఎస్‌లోనే చేర తారని ఈ సందర్భంగా భట్టి విమర్శలు చేశారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా, సీఎల్పీ లీడ ర్‌గా తాము లేవనెత్తిన అంశాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా, మైక్ ఇవ్వకుండా అణగదొక్కే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. న్యాయస్థానం పరిధిలో అంశం ఉందని పేర్కొన్న స్పీకరే విలీనం ఉత్తర్వులు ఎలా జారీ చేశారని ప్రశ్నించారు. సభలో తాము గుడ్డిగా కూర్చోలేమన్నారు. సభలో మాట్లాడేందుకు అవకాశం కల్పించడం లేదని, అప్రజాస్వా మ్యంగా వ్యవహరిస్తున్నారని, సభను మీరే నడుపుకోవాలని పేర్కొంటూ ముగ్గురు సహ చరులతో కలిసి భట్టి వాకౌట్ చేశారు. ఆ సమ యంలో సభలోనే ఉన్న మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాత్రం వాకౌట్ చేయకుండా అక్కడే ఉండిపోయారు.

కొత్త మున్సిపల్ చట్టాల బిల్లును ప్రవేశపెట్టిన కేసీఆర్

కొత్త మున్సిపల్ చట్టాల బిల్లును ముఖ్య మంత్రి కేసీఆర్ గురువారం శాసనసభ ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు లక్ష్యాలు, ఉద్దేశాల గురించి ఆయన శుక్రవారం శాసన సభ, శాసనమండలిలో ప్రసంగించ నున్నారు. అనంతరం చర్చ నిర్వహించి బిల్లుకు ఆమోదముద్ర వేయ నున్నారు.

ఉన్నోళ్లను కాపాడుకోండి: ఎర్రబెల్లి

''ఉన్నోళ్లు కూడా పోయేటట్టున్నరు. ఒకరు బయట ఉన్నరు.. ఇంకొకరు దూరంగా కూర్చు న్నరు. ఆ ఆరుగురినైనా కాపాడుకొండ్రి''అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయా కర్‌రావు కాంగ్రెస్ పార్టీని ఎద్దేవా చేశారు. సభలో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం రెండో సవరణ బిల్లును ప్రవేశపెట్టి మాట్లాడు తున్నప్పుడు కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలుపు తుండడంతో ఎర్రబెల్లిపై ఈవిధంగా స్పందిం చారు. కాగా, మండల పరిషత్, జిల్లా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికలకు అడ్డుగా ఉన్న నిబంధనలను మారుస్తూ పంచాయతీ రాజ్ చట్టానికి సవరించడానికి జారీ చేసిన ఆర్డి నెన్స్‌కు సంబంధించిన బిల్లుకు ఈ సంద ర్భంగా సభ ఆమోదం తెలిపింది.

హెరిటేజ్ ఓ జోక్‌లా మారింది!

- నగరంలోని ప్రైవేటు వ్యక్తుల ఇళ్లను సైతం ఈ జాబితాలో చేర్చారు
- దిల్‌కుషా గెస్ట్ హౌజ్ కూడా వారసత్వ సంపదా?
- వారసత్వ సంపదను గౌరవిస్తూనే అధునాతన సమాజ నిర్మాణం జరగాలి
- శాసనసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టీకరణ
- వైద్య బోధనాసిబ్బంది పదవీ విరమణ వయస్సు పెంపు బిల్లుకు ఆమోదం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో హెరిటేజ్ (వారస త్వం) ఓ జోక్‌గా తయారైందని సీఎం కేసీఆర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. గతంలో ఏది పడితే దాన్ని వారసత్వ సంపద జాబితాలో చేర్చారని తప్పుబట్టారు. కేవలం హైదరాబాద్ నగరంలోని కొందరు ప్రైవేటు వ్యక్తుల ఇళ్లు, దిల్‌కుషా గెస్ట్ హౌజ్‌తో సహా ప్రైవేటు గెస్ట్ హౌజ్‌లు, వారసత్వ సంపద జాబితాలో చేర్చారన్నారు. దిల్‌కుషా గెస్ట్‌హౌజ్ వారసత్వ సంపదా? అని సీఎం ప్రశ్నించారు. నగరం బయట ఉన్న ఎన్నో అద్భుతమైన కోటలను విస్మరించారన్నారు. చివరకు గాండ్ల బాల య్యతో సహా నలుగురు ప్రైవేటు వ్యక్తుల ఇండ్లను వారసత్వ సంపద జాబితాలో చేర్చా రని, గాండ్ల బాలయ్య పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. వైద్య కళాశాలల బోధన సిబ్బంది పదవీవిరమణ వయసును 58 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ బిల్లుపై గురు వారం శాసనసభలో చర్చ సందర్భంగా వార సత్వ కట్టడాలపై వచ్చిన ప్రస్థావనకు సీఎం కేసీ ఆర్ సమాధానమిచ్చారు. మన వారసత్వ సంపద, సంస్కృతిని గౌరవిస్తూనే అధునాతన సమాజ నిర్మాణానికి కూడా కొన్ని పనులు జరగాలన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలోని చరిత్రాత్మకమైన కట్టడాలు, కోటల పరిరక్షణ కోసం సమగ్రమైన వారసత్వ సంపద చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. అది జీవో కాద ని, ఒక చట్టమని స్పష్టతనిచ్చారు. జీవో అనుకొని కోర్టుల్లో కొందరు వాదనలు చేస్తున్నా రన్నారు. ఈ చట్టంపై నిపుణుల కమిటీ వేశా మన్నారు. కమిటీ సిఫారసుల మేరకు ఏ కట్ట డాలు జాబితాలో ఉండాలి, వేటిని తొలగించా లనేది నిర్ణయిస్తామన్నారు. అప్రాధాన్య కట్టడా లను జాబితాలోనుంచి తీసేస్తామన్నారు.

హైకోర్టు పరిశీలనలతో ఉస్మానియా

ఉస్మానియా ఆస్పత్రికి ఘనమైన చరిత్ర ఉంద ని, వారసత్వ సంపద అన్నారు. అదే స్థానంలో కొత్త ఆస్పత్రి నిర్మించాలని డిమాండ్ ఉంద న్నారు. అయితే వారసత్వ సంపద నిబంధనలు అడ్డువస్తున్నాయన్నారు. ఈ అంశం హైకోర్టు పరిశీలనలో ఉందన్నారు. సరైన నిర్వహణ లేక చారిత్రాత్మక ఉస్మానియా ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరిందని ఎంఐఎం పక్షనేత అక్బ రుద్దీన్ ఆందోళన వ్యక్తం చేయగా సీఎం కేసీఆర్ ఈ మేరకు బదులిచ్చారు. నగర వారసత్వ సంపదను పరిరక్షించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఇదేం కొత్త కాదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఉస్మానియా ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరిందని, కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నా చోద్యం చూస్తున్నారన్నారు. ఉస్మానియా ఆస్పత్రి ప్రాంగణం నుంచి ఒక్కో వైద్య విభా గాన్ని నగరంలోని ఇతర ప్రభుత్వ ఆస్పత్రులకు తరలిస్తున్నారని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఉస్మానియా ఆస్పత్రి ఘన చరిత్రను, సౌందర్యాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉస్మానియాను పరిరక్షించ డానికి రూ.25 కోట్లను కేటాయించామని సీఎం కేసీఆర్ బదులిచ్చారు.

తక్షణమే వైద్య బోధన సిబ్బంది నియామకాలు

రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 1,379 బోధన సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ పోస్టులన్నింటినీ నేరుగా భర్తీ చేసేందుకు ఆస్కారం లేదని సీఎం పేర్కొన్నారు. సీనియర్ బోధన సిబ్బందిని రెడీమేడ్‌గా అప్పటికప్పుడు తయారు చేసుకోలేమన్నారు. వైద్య కళాశాలల బోధన సిబ్బంది పోస్టులను సీనియారిటీ ప్రకారం పదోన్నతులతో భర్తీ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో భర్తీ చేయాల్సిన 801 బోధన సిబ్బంది పోస్టులను సత్వరంగా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, దంత వైద్య కళాశాలల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల పదవీవి రమణ వయసును 58 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ తీసుకొచ్చిన చట్ట సవరణ బిల్లును గురువారం శాసనసభలో కేసీఆర్ ప్రవేశ పెట్టారు. పదవీ విరమణ వయస్సు పెంచినా యువ వైద్య బోధన సిబ్బందికి పదోన్నతుల్లో నష్టం కలగకుండా చర్యలు తీసుకుం టామన్నారు. సీనియారిటీ ప్రకారం ఎవరికి లభించాల్సిన పదోన్నతులను వారికి లభిం చేలా కేరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీంను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో బోధన సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. ఈ సమస

పైసలిస్తేనే పని!

- అవినీతిమయంగా డీఐఎంఎస్
- ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసులో చేయి తడిపితేనే పని
- ఔషధాలు మొదలు మెడికల్ రీయింబర్స్‌మెంట్ వరకు ఒక్కో రేటు
- అంతా బహిరంగమే.. ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

సాక్షి, హైదరాబాద్: బీమా వైద్య సేవల సంచాలకుల (డీఐఎంఎస్) కార్యాలయంలో అవినీతి బాగోతం క్రమంగా బయటపడుతోంది. ఆ శాఖలో మందులు, మెడికల్ కిట్ల కొనుగోళ్ల వ్యవహారంలో జరిగిన అక్రమాల గుట్టును విజిలెన్స్ విభాగం రట్టు చేయడంతో కార్యాలయంలో జరిగే అవినీతి తంతు క్రమంగా వెలుగుచూస్తోంది. బీమా వైద్య సేవలందించడంలో కార్యాలయ సిబ్బంది చేసే అవినీతిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆ విభాగం ద్వారా అందించే సేవలను లబ్ధిదారులు లంచాలు సమర్పించుకుని పొందాల్సిన పరిస్థితిపై వరుసగా ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో అసలు ఆ కార్యాలయంలో ఏం జరుగుతుందనే దానిపై అధికారులు నిఘా పెట్టారు. ఈఎస్ఐ పరిధిలోకి వచ్చే ఉద్యోగులకు అందించే ప్రతి సేవలోనూ భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్న తీరును చూసి వారు నివ్వెరపోతున్నారు.

కనీసం రూ.5 వేలు ఇస్తేనే..

డీఐఎంఎస్‌లో కార్మికులకు సంబంధించి కీలకమైన కార్యక్రమం మెడికల్ రీయింబర్స్‌మెంట్. ఈఎస్ఐ పరిధిలోకి వచ్చే ఉద్యోగి లేదా అతని కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందితే దీనికి సంబంధించిన మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను డీఐఎంఎస్ అధికారులు మంజూరు చేస్తారు. అదేవిధంగా హృద్రోగాలు, ఇతర ప్రమాదకర వ్యాధుల బారిన పడిన వారు ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో కాకుండా ప్రైవేటుగా మందులు కొనుగోలు చేస్తే వాటికి సంబంధించిన బిల్లులను కూడా డీఐఎంఎస్ ద్వారా మంజూరు చేస్తారు. ఈ క్రమంలో మెడికల్ బిల్లులను పలు దశల్లో పరిశీలించి ప్రభుత్వ నిబంధనలకు తగిన విధంగా అర్హతను బట్టి బిల్లును ఇవ్వాల్సి ఉంటుంది. ఈ తంతులో అవినీతి వేళ్లూనుకుంది. బిల్లును పరిశీలించే స్థాయిలో పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారు. బిల్లు స్థాయిని బట్టి వసూళ్లు చేస్తారు. రూ.లక్ష మెడికల్ బిల్లును ఆమోదించాలంటే కనీసం రూ.10 వేలు చెల్లించాల్సిందేనని బాధితులు చెబుతున్నారు. కనీసం రూ.5 వేలు ఇవ్వనిదే అసలు ఫైలు ముట్టుకోరనేది బహిరంగ రహస్యం. బాధితుడు చేసిన వాస్తవ ఖర్చును, నిబంధనలను పట్టించుకోని అధికారులు.. కేవలం కాసులిచ్చిన వారికే బిల్లులు క్లియర్ చేస్తున్నారనే ఫిర్యాదులు ప్రభుత్వానికి పెద్ద సంఖ్యలో వచ్చాయి. ఎలాంటి పైరవీలు చేయకుండా, కాసులు సమర్పించకుండా సాధారణ పద్ధతిలో బిల్లుల మంజూరు ఇక్కడ అసాధ్యమే. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు సైతం ఇప్పటికీ పరిష్కారం కాకపోవడమే ఇందుకు నిదర్శనం. మెడికల్ రీయింబర్స్‌మెంట్ కోటా కింద కేంద్ర ప్రభుత్వం ద్వారా డీఐఎంఎస్‌కు నిధులు వచ్చినా.. వాటిని పంపిణీ చేయడంలో తీవ్ర జాప్యం నెలకొంది.

పెండింగ్‌లో లక్షకుపైగా బిల్లులు..

ప్రస్తుతం డీఐఎంఎస్‌లో మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. గత ఐదేళ్లుగా వీటిని క్లియర్ చేయడంలో డీఐఎంఎస్ ఉదాసీనంగా వ్యవహరించింది. కేంద్రం నుంచి నిధులు రావడం లేదన్న సాకును చూపుతూ బిల్లులు క్లియర్ చేయకుండా అట్టిపెట్టుకుంది. ఇలా దాదాపు ఒక లక్షకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి విలువ దాదాపు రూ.178 కోట్లు ఉంటుందని అంచనా. మరోవైపు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఈఎస్ఐ కార్పొరేషన్ ద్వారా ప్రతి మూడు నెలలకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ కోటా నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి విడుదలవుతున్నాయి. గత త్రైమాసికం మినహా అంతకు ముందు వరకు పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేసినట్లు ఈఎస్ఐసీ వర్గాలు స్పష్టం చేయడం గమనార్హం.

డీఐఎంఎస్ అధికారులపై వేటు!

సాక్షి, హైదరాబాద్: బీమా వైద్య సేవల సంచాలక కార్యాలయంలో (డీఐఎంఎస్) అక్రమాలపై ప్రభుత్వం చర్యలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే విజిలెన్స్ విభాగం అక్రమాలపై విచారణ జరిపి నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఆర్థికపరమైన అంశాలను లోతుగా పరిశీలించేందుకు ప్రభుత్వం ఏసీబీని ప్రత్యేక పరిశీలనకు ఆదేశించింది. ఈ క్రమంలో ఏసీబీ సైతం దాదాపు పరిశీలన పూర్తి చేసింది. ఒకట్రెండు రోజుల్లో ఏసీబీ పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు సమాచారం. ఇదిలా వుండగా, ఈఎంఎస్‌లో మందులు, పరికరాల కొనుగోళ్లలో బాధ్యులపై చర్యలకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఏసీబీ నివేదిక కంటే ముందే ప్రధాన సూత్రదారులపై వేటు వేయాలని నిర్ణయించింది. ఈ మేర కు కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నివేదించినట్లు తెలిసింది. డీఐఎంఎస్‌లో అవినీతిపై విజిలెన్స్ నివేదికవచ్చిన వెంటనే మల్లారెడ్డి కేసీఆర్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. తాజాగా కేసీఆర్‌ను ఆయన ప్రత్యేకంగా కలిసి పరిస్థితిని వివరించారు. విజిలెన్స్ నివేదికలో పొందుపర్చిన అంశాలతో పాటు అంతర్గతంగా జరిగిన వ్యవహారాలు, మంత్రికి సైతం సమాచారం ఇవ్వకుండా జరిగిన అవకతవకలు, పలు అంశాలను దాచిపెట్టేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలను మంత్రి సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ అక్రమాల వ్యవహారంపై సీఎం కేసీఆర్ తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది.

ఎంతటివారైనా చర్యలు తప్పవు..

అవినీతిని ఉపేక్షించేది లేదని, ఎంతటివారైనా చర్యలు తీసుకోవాల్సిందేనని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో ప్రధాన సూత్రదారులైన ఇరువురిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సీఎంకు వివరించినట్లు తెలిసింది. డీఐఎంఎస్‌లో ఉన్నతాధికారి, మరో సహాయక అధికారిపైన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. అదేవిధంగా డీఐఎంఎస్ వ్యవహారాల్లో ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిపైనా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆయనపై కూడా వేటు పడే అవకాశం ఉందని తెలుస్తోంది. వారాంతంలోగా చర్యలకు సంబంధించిన ఆదేశాలు వచ్చే అవకాశం ఉందని సీఎం కార్యాలయ వర్గాల ద్వారా తెలిసింది.



ఎంబీబీఎస్ మేనేజ్‌మెంట్ కోటా

సీట్ల భర్తీకి నోటిఫికేషన్

ఈ నెల 25 నుంచి 28 వరకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్

ఫైల్

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 25 నుంచి 28 వరకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. యూనివర్సిటీ గుర్తింపు పొందిన ప్రైవేటు, మైనార్టీ, నాన్‌మైనార్టీ మెడికల్ కళాశాలలు, ప్రైవేటు, ఆర్మీ డెంటల్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ చేపట్టనున్నట్లు పేర్కొంది. ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలోని ప్రొఫెసర్ రాంరెడ్డి దూరవిద్యా కేంద్రం (పీజీఆర్ఆర్‌సీడీఈ) విభాగంలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ధ్రువపత్రాల పరిశీలన, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ నెల 12న యూనివర్సిటీ విడుదల చేసిన మేనేజ్‌మెంట్ కోటా మెరిట్ జాబితాలోని అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపింది. మరిన్ని వివరాల కోసం www.knruhs.in, www.knruhs.telangana.gov.in వెబ్‌సైట్‌లను సంప్రదించాలని సూచించింది.

అగ్రి వర్సిటీలో కోర్సులకు దరఖాస్తులు

రాజేంద్రనగర్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిషికేషన్ జారీ చేసింది. ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణులై.. తెలంగాణ ఎంసెట్ 2019లో ర్యాంకు సాధించిన విద్యార్థులు ఈ కోర్సులు అభ్యసించేందుకు ఈ నెల 27లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ ఎస్.సుధీర్‌కుమార్ తెలిపారు. బీఎస్సీ(హెచ్) అగ్రికల్చర్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ, బీఎస్సీ(హెచ్) హార్టికల్చర్ తదితర బైపీసీ స్ట్రీమ్ కోర్సులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, కోర్సులు, ఇతర వివరాలను www.pjtrau.edu.inlZ పొందుపరిచినట్లు పేర్కొన్నారు. వర్సిటీకి ఎలాంటి అనుబంధ, ప్రైవేటు కళాశాలలు లేవని తెలిపారు. రాజేంద్రనగర్, అశ్వారావుపేట, జగిత్యాల, పాలెం, వరంగల్, సిరిసిల్లలోని కళాశాలలు వర్సిటీలో అంతర్భాగమని వివరించారు. టీ-ఎంసెట్ 2019 ర్యాంకుల ప్రాతిపదికన రిజర్వేషన్ రూల్స్ మేరకు కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ గుర్తింపులేని కొన్ని వ్యవసాయ కళాశాలలు అడ్మిషన్లకు ప్రకటనలు జారీ చేస్తున్నాయని, సదరు సంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా సంస్థల్లో అడ్మిషన్ పొందితే అగ్రి వర్సిటీ ఎలాంటి బాధ్యతా వహించబోదని స్పష్టం చేశారు.

వెబ్‌సైట్‌లో డిపార్ట్‌మెంటల్ 'టెస్టు' షీట్లు

సాక్షి, హైదరాబాద్: డిపార్ట్‌మెంటల్ పరీక్షల రెస్పాన్స్ షీట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు టీఎస్‌పీఎస్సీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. గతనెల 6వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన పరీక్షల రెస్పాన్స్ షీట్లను శుక్రవారం (19వ తేదీ) నుంచి టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని పేర్కొంది.

23న బీఆర్క్ ప్రవేశాలకు నోటిఫికేషన్

- 24 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు
- షెడ్యూల్ ఖరారు చేసిన ప్రవేశాల కమిటీ..

సాక్షి, హైదరాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ) లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) కోర్సులో ప్రవేశాల కోసం ఈ నెల 23న నోటిఫికేషన్ జారీ కానుంది. ఈ మేరకు గురువారం ప్రవేశాల కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకుంది. నాటా/జేఈఈ మెయిన్ పేపర్-2లో అర్హత సాధించిన వారు ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అర్హులని ప్రవేశాల కన్వీనర్ ఎస్.కుమార్ తెలిపారు. ఎక్కువ మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకుంటే వచ్చే నెల 3న కూడా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఇదీ షెడ్యూల్..

- ఈనెల 24 నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు
- ఆగస్టు 1, 2 తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- 13న రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థుల జాబితా ప్రకటన. ఈ-మెయిల్ ద్వారా అభ్యంతరాల స్వీకరణ
- 14న రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థుల ఫైనల్ జాబితా విడుదల
- 16న ర్యాంకుల కేటాయింపు
- 17, 18 తేదీల్లో వెబ్ ఆప్షన్లు
- 20న సీట్లు కేటాయింపు
- 21, 22 తేదీల్లో ట్యూషన్ ఫీజు చెల్లింపు, సీట్లు పొందిన కాలేజీల్లో రిపోర్టింగ్
- 23న వెబ్‌సైట్‌లో మిగులు ఖాళీల ప్రకటన
- 24, 25 తేదీల్లో చివరి దశ వెబ్ ఆప్షన్లు
- 27న చివరి దశ సీట్ల కేటాయింపు
- 28, 29 తేదీల్లో ఫీజు చెల్లింపు, కాలేజీల్లో రిపోర్టింగ్
- 31న స్పాట్ అడ్మిషన్లు
- సెప్టెంబర్ 3వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం

అసెంబ్లీ బీట్...

మీతో ఛాయ్‌కా?.. వద్దు బాబూ!

అసెంబ్లీ లాబీలో శ్రీధర్‌బాబు, కేటీఆర్ సరదా చర్చ

సాక్షి, హైదరాబాద్: గురువారం అసెంబ్లీ లాబీల్లో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయానికి సభ వాయిదా పడ్డాక లాబీల్లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పద్మ దేవేందర్‌రెడ్డి, బాల్కసుమన్‌లకు కాంగ్రెస్ ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు ఎదురుపడ్డారు. దీంతో 'ఛాయ్ తాగుదాం రండి' అంటూ శ్రీధర్‌బాబును కేటీఆర్ ఆహ్వానించారు. 'మీతో ఛాయ్‌పై చర్చనా? ఇంకేమైనా ఉందా? వద్దు బాబూ'అంటూ శ్రీధర్ సమాధానం ఇవ్వడంతో అక్కడ నవ్వులు విరిశాయి. అనంతరం పక్కనే ఉన్న ఎమ్మెల్యే బాల్కసుమన్‌ను ఉద్దేశించి 'ఏదో వనభోజనాలు పెట్టించినట్టున్నావు'అంటూ శ్రీధర్ పలకరించారు. ఇటీవల కాళేశ్వరం జలజాతర పేరిట సుమన్ నిర్వహించిన కార్యక్రమం గురించి ప్రస్తావించడంతో.. తానే కాదు మంథని నియోజకవర్గంలో కూడా గతంలో భోజనాలు పెట్టించారు అని బాల్క సుమన్ సమాధానమిచ్చారు.

నాపై దుష్ప్రచారం: వనమా

అటవీ భూమిని ఆక్రమించుకున్నానంటూ తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు వాపోయారు. గురువారం అసెంబ్లీ లాబీల్లో కొందరు విలేకరులు ఎదురుపడిన పుడు ఒక్క ఎకరమైనా కబ్జా చేసినట్టు నిరూపించాలంటూ సవాల్ చేశారు. మరి మీపై ఆరోపణలు ఎందుకు చేస్తున్నారు.. వాటిలో నిజం లేదంటారా? అని ప్రశ్నించిన ఒక విలేకరిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. తమది తాత, ముత్తాతల నుంచి స్థితిమంతుల కుటుంబమని, జర్నలిస్టులతోసహా అన్ని వర్గాల వారికి సహాయం చేస్తున్నామని, అయినా తనపై మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ వనమా అక్కడి నుంచి కదిలారు.

రేపు మా వంతు: జీవన్‌రెడ్డి

మున్సిపల్ చట్టంపై అసెంబ్లీలో ఏమి జరిగిందో రేపు కౌన్సిల్‌లోనూ అదే జరుగుతుందని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం ఎమ్మెల్సీలుగా తమ వంతు వస్తుందని చెప్పారు. అసెంబ్లీ ఆవరణలో ఎదురుపడిన కొందరు విలేకరులతో ఆయన మాట్లాడుతూ 'మున్సిపల్ చట్టంలో కొత్తదనం ఏం లేదని, పెద్దగా మార్పులేమీ లేకపోయినా కొత్త చట్టమంటూ తీసుకొస్తున్నారు'అని విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరుగురు ఆరు మార్గాల్లో వెళుతున్నట్టున్నారని ఒక విలేకరి ప్రశ్నించగా తమ వారంతా వ్యక్తిత్వమున్న వారని, అందుకు తగ్గట్టుగానే వ్యవహరిస్తుంటారని జీవన్‌రెడ్డి సమాధానమిచ్చారు.

బీజేపీలోకి ఎప్పుడు చేరేది త్వరలోనే చెబుతా: రాజగోపాల్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సాంకేతిక సమస్యలు అడ్డంకిగా ఉన్న కారణంగానే బీజేపీలోకి చేరకుండా ఆగుతున్నానని, ఆ పార్టీలోకి ఎప్పుడు చేరేదీ త్వరలోనే చెబుతానని కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటే తనకు ఎప్పటికీ అభిమానమేనని అందుకే తనకు జారీ చేసిన షోకాజ్‌కు సమాధానం ఇచ్చానన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ప్రజలు 19 మందిని గెలిపించినా కేవలం నాయకత్వ లోపం వల్లే 12 మంది పార్టీని వీడారని ఆరోపించారు. టీపీసీసీ నాయకత్వ లోపాలను తాను మీడియా ముందు ఎత్తిచూపినందుకు, పార్టీకి భవిష్యత్తులో ఎదురయ్యే ముప్పును ప్రస్తావించినందుకు తనకు షోకాజ్ నోటీసులు వచ్చాయన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు పార్టీ అంతర్గత సమావేశాల్లో చెప్పినా.. తన మాటను ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బీజేపీని, మోదీ పాలనను పొగిడిన విషయం వాస్తవమేనన్నారు. తనకు బీజేపీలో తలుపులు మూసుకుపోలేదన్నారు. తనకు కాంగ్రెస్‌లో పదవులు ముఖ్యం కాదని, రాష్ట్రంలో ప్రశ్నించే గొంతును నొక్కేస్తున్న టీఆర్ఎస్‌కు బీజేపీ ఒక్కటే ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు.

మాతో రండి..

- రాజగోపాల్‌రెడ్డికి శ్రీధర్‌బాబు ఆహ్వానం
- వస్తున్నా... మీరెళ్లండంటూ దాటవేసిన రాజగోపాల్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిల మధ్య అసెంబ్లీ మీడియా పాయింట్‌లో గురువారం ఆసక్తికర సన్నివేశం జరిగింది. సభ ముగిసిన తర్వాత మీడియా పాయింట్‌లో రాజగోపాల్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతున్న సమయంలోనే కాంగ్రెస్ సభ్యులు భట్టి, శ్రీధర్‌బాబు, సీతక్క, పోదెం వీరయ్యలు అక్కడకు చేరుకున్నారు. రాజగోపాల్ మాట్లాడేంత వరకు వేచి చూసిన తర్వాత 'కాంగ్రెస్ తరపున విలేకరులతో మాట్లాడేందుకు వెళ్తున్నాం.. నువ్వు కూడా కాంగ్రెస్ సభ్యుడివే కదా మాతోపాటు రండి'అంటూ శ్రీధర్‌బాబు ఆయనను ఆహ్వానించారు. అందుకు రాజగోపాల్‌రెడ్డి స్పందిస్తూ..'రావాల్నా.. సరే వస్తున్నా మీరు వెళ్లండి'అంటూ వారికి బదులిచ్చారు. ఆ తర్వాత కొద్దిసేపు అక్కడే విలేకరులతో మాట్లాడిన రాజగోపాల్ కాంగ్రెస్ సభ్యుల వద్దకు వెళ్లకుండానే నిష్క్రమించారు.

ఏం మాట్లాడుకుంటున్నారబ్బా..!

అసెంబ్లీ ప్రాంగణంలో భట్టి, బాల్క సుమన్ మంతనాలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ప్రాంగణంలో కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేత భట్టి విక్రమార్క, టీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌లు ఏకాంతంగా మాట్లాడుకోవడం చర్చనీయాంశమైంది. సభ ముగిసిన అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన భట్టి ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో బాల్క సుమన్ కనిపించడంతో ఒకరినొకరు పలకరించుకున్న ఇరువురు సీఎల్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న లాన్ సమీపంలో కాసేపు మాట్లాడారు. ఆ సమయంలో మీడియా ప్రతినిధులు వీడియోలు, ఫొటోలు తీసేందుకు ప్రయత్నించగా వద్దని వారించారు. అయితే ఇద్దరి మధ్య రాజకీయ చర్చలు ఏమీ జరగలేదని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ గురించి మాట్లాడుకున్నారని తెలిసింది.

సభ సంకేతాలతో నడుస్తోం: భట్టి, శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజా సమస్యలను ప్రభుత్వం గాలికొదిలేసిందని.. అసెంబ్లీలో ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మండిపడ్డారు. సభలో మాట్లాడే అవకాశం ఇవ్వనందుకు నిరసనగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేసిన అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. భట్టి మాట్లాడుతూ.. సభ ఆసాంతం సంకేతాలతో నడుస్తోందని, తమకు మైక్ ఇవ్వకుండా ఇష్టమైన పలుకులకే అవకాశం ఇస్తున్నారని మండిపడ్డారు. తమ పార్టీ నుంచి ప్రజలు గెలిపించిన 12 మంది ఎమ్మెల్యేలను అప్రజాస్వామిక రీతిలో టీఆర్ఎస్‌లో విలీనం చేయడం దారుణమన్నారు. సీఎం కేసీఆర్ నియంత పోకడలను అనుసరిస్తున్నారని.. ఇలాంటి పోకడలు ప్రజాస్వామ్యానికి చేటు చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తుంటే.. ప్రజా సమస్యలు పక్కనబెట్టి పురపాలక ఎన్నికల కోసం ప్రభుత్వం తహతహలాడుతోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై తమకు మాట్లాడే అవకాశమివ్వాలని సభ అనంతరం తాము స్పీకర్‌ను కోరామన్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. అధికార పార్టీ సభను సిగ్నల్స్‌తో నియంత్రిస్తోందని ఆరోపించారు. ఇంతవరకూ పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకపోవడమేంటని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించాల్సిన అవసరముందని, సమావేశాల గడువునుపొడిగించి కష్టాల్లో ఉన్న రాష్ట్ర ప్రజలకు తామున్నామన్న భరోసా కల్పించాలని కోరారు.

మాజీ శాసనసభ్యుల మృతి పట్ల సంతాపం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రెండో శాసనసభ ప్రత్యేక సమావేశాలు గురువారం ప్రారంభమైన సందర్భంగా ఇటీవలి కాలంలో మరణించిన మాజీ శాసనసభ్యులకు నివాళి అర్పిస్తూ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సభాపతి స్థానం నుంచి సంతాపం ప్రకటించారు. కరీంనగర్ జిల్లా ఇందుర్తి మాజీ శాసనసభ్యుడు బొమ్మ వెంకటేశ్వర్, ఆంగ్లో ఇండియన్ కోటాలో గతంలో శాసనసభకు నామినేట్ అయిన మాజీ ఎమ్మెల్యే డెల్లా గాడ్ ఫ్రే , రంగారెడ్డి జిల్లా మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే సి.కనకారెడ్డి, వరంగల్ రూరల్ జిల్లా పరకాల మాజీ ఎమ్మెల్యే బండారు శారారాణి, జోగులాంబ గద్వాల జిల్లా మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఎ.కృష్ణమూర్తి మృతి పట్ల సభ సంతాపం ప్రకటిస్తోందన్నారు. వారి కుటుంబ సభ్యులకు సభ తరపున ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కాంగ్రెస్‌లో 'కంగాళీ'

- ఆరుగురు సభ్యుల్లోనూ కనిపించని ఏకాభిప్రాయం
- ఫిరాయింపులకు నిరసనగా నల్ల కండువాలతో సభకు భట్టి, శ్రీధర్‌బాబు, సీతక్క, వీరయ్య
- నిరసనకు అంగీకరించని జగ్గారెడ్డి.. కలిసిరాని రాజగోపాల్‌రెడ్డి
- మళ్లీ చర్చనీయాంశమయిన రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు
- కాంగ్రెస్ సభ్యుడినంటూనే బీజేపీ బలపడుతుందన్న మునుగోడు ఎమ్మెల్యే

ఫిరాయింపులకు నిరసనగా గురువారం నల్ల కండువాలతో అసెంబ్లీకి వస్తున్న సీతక్క, భట్టి విక్రమార్క, వీరయ్య, శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: శాసనసభా సమావేశాల తొలిరోజు కాంగ్రెస్‌సభ్యుల్లో గందరగోళం కనిపించింది. మొత్తం ఆరుగురు సభ్యులే ఉన్నా, వారిలోనూ ఏకాభిప్రాయం లేదు. అధికార టీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతోందంటూ చేపట్టిన నిరసనలో కేవలం నలుగురే పాల్గొన్నారు. జగ్గారెడ్డి దూరంగా ఉన్నట్టు వ్యవహరించారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కలిసిరాలేదు. రాజగోపాల్‌రెడ్డి మళ్లీ తనదైన శైలిలో వ్యాఖ్యలు చేసి కాంగ్రెస్ పార్టీని ఇరుకునపెట్టే ప్రయత్నం చేయడం గమనార్హం.

ముందుగా సీఎల్పీ

తొలిరోజు గురువారం శాసనసభ ప్రారంభానికి ముందే సీఎల్పీ నేత భట్టి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశానికి శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, సీతక్క, వీరయ్య హాజరు కాగా, రాజగోపాల్‌రెడ్డి డుమ్మా కొట్టారు. నల్లకండువాలతో సభకు వెళ్లి అధికార టీఆర్ఎస్ ఫిరాయింపులకు నిరసన తెలపాలని సమావేశంలో నిర్ణయించారు. అయితే, జగ్గారెడ్డి నల్లకండువా లేకుండానే సభలోకి వెళ్లారు. మిగిలిన నలుగురు నల్లకండువాలతో వెళ్లి సభలో నినాదాలు చేశారు. అప్పుడు కూడా జగ్గారెడ్డి వారితో కలవకుండా అసెంబ్లీ సమావేశ మందిరం నుంచి బయటకు వచ్చేశారు.

రాజగోపాల్... మళ్లీ హల్‌చల్

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి హల్‌చల్ చేశారు. అసెంబ్లీ సమావేశాలకు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర సభ్యులతో కలిసిరాలేదు. తాను కాంగ్రెస్‌లో ఉన్నానని, తనకు పార్టీ అంటే అభిమానమని అంటూనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు లేదని, బీజేపీనే టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయమన్న తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటానని చెప్పారు. బీజేపీలో చేరతారా అని ప్రశ్నించగా.. తనను బీజేపీ నేతలు పిలవడం లేదని, తాను వెళ్లడం లేదని ఓసారి, సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటానని మరోసారి, అసలు తాను బీజేపీలో చేరతానని చెప్పనేలేదని ఇంకోసారి ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో గందరగోళం కలిగించాయి. సీఎల్పీ సమావేశానికి ఎందుకు రాలేదని ప్రశ్నిస్తే అసలు సీఎల్పీ ఎక్కడిదని ఆయన తిరిగి ప్రశ్నించడం గమనార్హం. రాజగోపాల్‌రెడ్డి తాను గందరగోళ స్థితిలో ఉన్నారా.. కాంగ్రెస్ పార్టీని గందరగోళంలో పడేశారా అన్నది అర్థం కాకుండా వ్యవహరించారు.

మాకు ప్రతిపక్ష హోదా కల్పించండి

- స్పీకర్‌ను కోరిన ఎంఐఎం సభ్యులు
- పదిశాతం సభ్యులు లేనందున సాధ్యం కాకపోవచ్చంటున్న అసెంబ్లీ వర్గాలు
- అయితే చర్చల్లో, ప్రసంగాల్లో కాంగ్రెస్ కంటే తొలి అవకాశం ఎంఐఎంకే

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో తమ పార్టీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించి విపక్ష హోదాను కల్పించాలని శాసనసభాపతికి మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) విజ్ఞప్తి చేసింది. ఈ అంశంపై స్పీకర్‌కు ఎంఐఎం శాసనసభాపక్షం ఒక లేఖను ఇటీవల అందజేసింది. కాంగ్రెస్ శాసనసభాపక్షానికి చెందిన 12 మంది ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో విలీనమైన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.సభలోని మొత్తం సభ్యుల్లో కనీసం 10 శాతం బలం లేకపోతే నిబంధనల మేరకు ఆ పార్టీకి ప్రతిపక్షంగా గుర్తింపు, అలాగే దాని నేతకు విపక్షనేత హోదాను ఇవ్వడం సాధ్యం కాదని శాసనసభా వర్గాలు స్పష్టంచేశాయి. 1994లో కాంగ్రెస్‌పార్టీ నుంచి 26 మంది ఎమ్మెల్యేలు గెలవడంతో అప్పుడు కూడా పి.జనార్దనరెడ్డికి ప్రతిపక్షనేత హోదా ఇవ్వలేదని, సీఎల్పీనేతగానే ఆయన వ్యవహరించారని ఉటంకిస్తున్నాయి. శాసనసభలో వివిధ అంశాలపై చర్చ, ప్రసంగాలకు అవకాశమిచ్చే సందర్భంలో మాత్రం సంఖ్యాబలం దృష్ట్యా ఎంఐఎంకే తొలి అవకాశం లభిస్తుందని తెలిపాయి. అందుకు తగ్గట్టుగానే గురువారం అసెంబ్లీలో పలు బిల్లులపై చర్చ సందర్భంగా ఎంఐఎంకే అవకాశం దక్కిన విషయం తెలిసిందే. ఇప్పటికైతే ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బట్టి ఎంఐఎం, కాంగ్రెస్‌పార్టీల నేతలను ఫ్లోర్ లీడర్లుగానే పరిగణిస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకవేళ ఎంఐఎంకు ప్రధాన ప్రతిపక్ష హోదా కట్టబెట్టేందుకు అధికార పక్షం నిర్ణయిస్తే ఆ మేరకు మార్పు ఉండవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. స్పీకర్ కూడా దీనిపై నిర్ణయం తీసుకోవచ్చునని చెబుతున్నారు.ఢిల్లీ అసెంబ్లీలో బీజేపీకి ముగ్గురు సభ్యులే ఉన్నా అక్కడి స్పీకర్ ప్రధాన ప్రతిపక్ష హోదాను కట్టబెట్టిన విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు.

స్పీకర్‌తో కాంగ్రెస్ ఎమ్మెల్యేల భేటీ...

గురువారం మధ్యాహ్నం శాసనసభ వాయిదా పడ్డాక స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భట్టి విక్రమార్క, డి. శ్రీధర్‌బాబు, పోడం వీరయ్య, సీతక్క కలుసుకున్నారు. సభలో చర్చ సందర్భంగా తమ సభ్యులకు తగిన సమయం ఇవ్వకపోవడం, మధ్యలోనే మైక్ తొలగించడం వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చినట్టు తెలుస్తోంది. టీఆర్ఎస్ శాసనసభాపక్షంలో కాంగ్రెస్ సభ్యుల విలీన అంశం ప్రస్తావించినప్పుడు అది కోర్టు పరిధిలో ఉన్నందున దానిపై సభలో ఏమీ చెప్పలేమని, చర్చించలేమని స్పీకర్ స్పష్టంచేసినట్టు తెలిసింది. అసెంబ్లీలో చర్చకు, ప్రస్తావనకు వచ్చే అంశాలు కాకుండా సంబంధం లేనివి ప్రస్తావిస్తే అవకాశం ఇవ్వలేమనే పేర్కొన్నట్టు తెలుస్తోంది. సభలో చర్చిస్తున్న అంశానికి పరిమితమై మాట్లాడితే మామూలు కంటే 10,15 నిముషాల సమయం అధికంగా ఇచ్చేందుకు తమకు అభ్యంతరం లేదని కాంగ్రెస్ సభ్యులకు స్పీకర్ స్పష్టీకరించినట్లు తెలిసింది.

మంత్రి జగదీశ్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న కేటీఆర్. చిత్రంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పద్మా దేవేందర్‌రెడ్డి, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

స్పీకర్ ఛాంబర్‌లో మంత్రి జగదీశ్‌రెడ్డి బర్త్‌డే

శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఛాంబర్‌లో గురువారం విద్యాశాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి జన్మదిన వేడుక నిర్వహించారు. తన ఛాంబర్‌కు వచ్చిన జగదీశ్‌రెడ్డికి స్పీకర్ పోచారం పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ శాసనసభ్యులు తెచ్చిన కేక్‌ను జగదీశ్‌రెడ్డి కట్ చేశారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జగదీశ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీఆర్ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలోనూ జగదీశ్‌రెడ్డి జన్మదిన వేడుక నిర్వహించారు. మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పలువురు ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకు మందు శాసనసభ ప్రత్యేక సమావేశాలు ప్రారంభమైన వెంటనే సభాపతి స్థానం నుంచి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సీఎం కేసీఆర్, ఇతర శాసనసభ్యులు మంత్రి జగదీశ్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌కు అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు స్వాగతం పలికారు.

సాక్షులు దేశం దాటితే..?

- ఎంసెట్ లీకేజీ కేసులో సీఐడీలో సాక్షులుగా ఉన్న విద్యార్థులు
- ఉన్నత విద్య కోసం ఇతర దేశాలకు వెళ్లేందుకు ప్రణాళికలు
- రోజుకో మలుపు తిరుగుతూ పోలీసులకు సవాల్‌గా మారుతున్న వైనం

సాక్షి, హైదరాబాద్: ఎనిమిది రాష్ట్రాలు.. 93 మంది నిందితులు.. 400 మంది సాక్షులు.. వందల సంఖ్యలో సాంకేతిక ఆధారాలు.. వీటన్నింటిని వివరించే 3,500 పేజీల చార్జిషీటు.. ఇదీ ఎంసెట్ (మెడికల్) లీకేజీ వ్యవహారం. అప్పట్లో సంచలనంగా మారిన ఈ కేసు వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ కేసు దర్యాప్తు చేసి, చార్జిషీట్‌కే మూడేళ్లకు పైగా సమయం పట్టింది. ఇక ఈ కేసును కోర్టులో నిరూపించడంలో అనేక అవాంతరాలు ఎదురయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ కేసులో అత్యంత కీలకమైన సాక్షులు.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు. వీరిలో చాలా మంది దేశంలోని వివిధ ప్రాంతాల్లో మెడిసిన్ చదువుతున్నారు. దాదాపుగా అందరి చదువులు వచ్చే ఏడాది మే నాటికి పూర్తికానున్నాయి. వీరిలో మెజారిటీ విద్యార్థులు ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లేందుకు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు. ఈ స్కాంలో పరీక్షలు రాసిన విద్యార్థుల్లో అధికశాతం మంది ఆర్థికంగా స్థితిమంతులే. ఏజెంట్లు సీట్లు ఇప్పిస్తామని చెప్పి వీరితో ప్రశ్నపత్రం బట్టీ పట్టించి పరీక్ష రాయించారు. దీంతో పోలీసులు మానవతా కోణంలో ఆలోచించి వీరందరినీ సాక్షులుగా చూపించారు. తీరా కేసు కోర్టు వరకు వెళ్లాక.. ఈ విద్యార్థులంతా విదేశాలకు వెళితే.. అప్పుడు సాక్ష్యం చెప్పాల్సిన వారు గైర్హాజరులో ఉంటారు. ఒకవేళ వారు అక్కడే స్థిరపడితే.. ఇక అంతే సంగతులు. వీరంతా సాక్ష్యం చెప్పేందుకు తిరిగి వస్తారా? అంటే అనుమానమే.. ఈ పరిస్థితుల్లో వీరిని వెనక్కి రప్పించడం పోలీసులకు తలకు మించిన భారం అవుతుంది.

సాక్షులు, సాంకేతిక ఆధారాలే కీలకం..

ఏ కేసులోనైనా ప్రత్యక్ష సాక్షులు తర్వాత సాంకేతిక ఆధారాలపై పోలీసులు ప్రధానంగా ఆధారపడతారు. ఈ కేసులో ప్రత్యక్షంగా సంబంధమున్న నిందితులు, సాక్షులు కలిపి మొత్తం దాదాపుగా 500 మంది వరకు ఉన్నారు. వీరంతా విచారణ సమయంలో న్యాయస్థానానికి వస్తారా? వచ్చినా పోలీసులు దాఖలు చేసిన వాంగ్మూలాన్నే తిరిగి యథాతథంగా చెబుతారా? ఎంతమంది కోర్టు విచారణకు అందుబాటులో ఉంటారన్న సందేహాలను న్యాయ నిపుణులు లేవనెత్తుతున్నారు. ఇక సాంకేతిక ఆధారాల విషయానికి వస్తే.. ఈ కేసులో ఎస్బీ సింగ్ నకిలీ చిరునామాలతో సేకరించిన సిమ్ కార్డులు, విద్యార్థులతో వారు సంభాషించిన టవర్ లొకేషన్లు, కాల్ డేటా రికార్డుల వివరాలు, హోటల్ బిల్లులు, విమాన, రైలు టికెట్లు ఇవి ఎంతో కీలకం కానున్నాయి. నిందితులు దేశంలోని పలు ప్రాంతాల్లో శిక్షణ ఇప్పించారని నిరూపించడానికి ప్రత్యక్ష సాక్షులకు తోడు ఈ సాంకేతిక ఆధారాలు ఎంతో అవసరం. అందుకే, వీటిని భద్రపరిచారు.

7 కొత్త కార్పొరేషన్లు

- కొత్త పుర చట్టంతో ఏర్పాటు.. సీఎం కేసీఆర్ ప్రకటన
- 13కు చేరనున్న మున్సిపల్ కార్పొరేషన్ల సంఖ్య
- మున్సిపల్ చట్టాల సవరణ ఆర్డినెన్స్ బిల్లుకు సభ ఆమోదం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పటి వరకు ఆరు మున్సిపల్ కార్పొరేషన్‌లు ఉండగా, కొత్త మున్సిపల్ చట్టం ద్వారా మరో ఏడు కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తున్నామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో రాష్ట్రంలోని కార్పొరేషన్ల సంఖ్య 13కు చేరనుంది. కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో శివారు గ్రామాలు చేరడంతో జనాభా పెరిగిందని, ఆ మేరకు వార్డుల సంఖ్య సైతం పెంచి మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ఆ చట్టాలకు సవరణ చేపట్టాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. దీంతో ఆర్డినెన్స్ రూపంలో మున్సిపల్ చట్టాలకు సవరణ చేసి వార్డుల సంఖ్యను పెంచామని, రిజర్వేషన్లు సైతం ఖరారు కావడంతో ఈ ఆర్డినెన్స్ అమలు ఇప్పటికే జరిగిపోయిందన్నారు. మున్సిపల్ చట్టాల సవరణ ఆర్డినెన్స్ బిల్లును ఆయన గురువారం శాసనసభలో ప్రవేశపెట్టి మాట్లాడారు. రాష్ట్రంలో అనేక పాలన సంస్కరణలు తీసుకొచ్చామని, ప్రజల సౌకర్యం, సౌలభ్యం, సంక్షేమం కాంక్షించి చాలా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. ఒక వార్డు, గ్రామ పంచాయతీ, మండలం, జిల్లా పరిషత్, మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలన్నా, మున్సిపాలిటీల్లో వార్డుల సంఖ్య పెంచాలన్నా.. తగ్గించాలన్నా.. గతంలో పాలన ఉత్తర్వులు (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్)తో చేసేవారని, దీనిని సమూలంగా మార్చామన్నారు. ఇలాంటి మార్పులపై శాసన సభ్యులకు మాట్లాడే అవకాశం కల్పించాలని చట్టసభలో ఇది జరపాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. దేశంలోనే ఇది అరుదైన ఘటన అన్నారు. ఇలా చేస్తే చీటికి మాటికి కోర్టు స్టేలు రావన్నారు. కొన్ని ప్రగతి నిరోధక శక్తులు ఇలాంటి నిర్ణయాలపై కూడా కేసులు వేసి అడ్డుకునేందుకు ప్రయత్నించాయన్నారు. శాసనసభ ద్వారా చట్ట రూపంలో తీసుకొచ్చామని, వీటిని అడ్డుకోవడానికి వీలు లేదని తాము చెప్పగా కోర్టులు సైతం గౌరవించాయన్నారు. మున్సిపాలిటీల్లో, హైదరాబాద్ నగర శివార్లలో అక్రమ లే అవుట్లు ఎలా పుట్టుకొస్తున్నాయో అందరికి తెలుసన్నారు. ఈ బాధలన్నీ పోవాలని తీసుకొస్తున్న కొత్త మున్సిపల్ చట్టాన్ని శుక్రవారం శాసనసభకు వివరిస్తానన్నారు. మున్సిపల్ చట్టాల సవరణ ఆర్డినెన్స్ బిల్లును కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం ఆమోదించినట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.

పురపాలికలకు రాష్ట్ర నిధులు...

పురపాలికలు, గ్రామ పంచాయతీలకు గతంలో కేంద్రం నుంచి మాత్రమే 14వ ఆర్థిక సంఘం నిధులు వచ్చేవని సీఎం తెలిపారు. పంచాయతీరాజ్ సంస్థలతోపాటు రాష్ట్రంలోని 142 మున్సిపాలిటీలకు 14వ ఆర్థిక సంఘం నుంచి రూ.1,037 కోట్లు వస్తాయని, రాష్ట్రం తరపున కూడా ఇదే మొత్తం జమ చేసి రూ.2,074 కోట్లు కేటాయించాలని నిర్ణయించామన్నారు.

రెండు రోజులు భారీ వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రాబోయే రెండు రోజుల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు, పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబ

జవాబుదారిలో భారీ మార్పులు

భారీ సంస్కరణలతో సభ ముందుకు కొత్త మున్సిపల్ చట్టం

- పౌర సేవలు, పారదర్శకతే ప్రధాన ఎజెండా
- బడ్జెట్‌లో 10% నిధులు పచ్చదనానికి కేటాయించాల్సిందే
- కొత్తగా 7 మున్సిపల్ కార్పొరేషన్ల ప్రతిపాదన
- మున్సిపల్ రిజర్వేషన్లు రెండు టర్మ్‌లు.. 50% మించకుండా రిజర్వేషన్లు
- కలెక్టర్లకు విస్తృతాధికారాలు... అవసరమైతే సస్పెండ్ చేసే అధికారం కూడా
- అవిశ్వాసానికి మూడేళ్ల పరిమితి.. ప్రభుత్వానికే రద్దు అధికారం
- మోడల్‌టౌన్‌లు, సమీకృత టౌన్‌షిప్‌లు, ఈ-గవర్నెన్స్, సిటిజన్ చార్టర్ అమలు
- కొత్తగా తెలంగాణ కామన్ మున్సిపల్ సర్వీస్.. ఒకే గొడుగు కిందకు అన్ని కేడర్లు
- కొత్త మున్సిపల్ చట్టాన్ని అసెంబ్లీ ముందుకు తెచ్చిన సర్కారు.. నేడు చర్చ, ఆమోదం

సాక్షి, హైదరాబాద్: కొత్త మున్సిపల్ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా తెరపైకి తెచ్చింది. పారదర్శకత, జవాబుదారీతనంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధుల ఉమ్మడి భాగస్వామ్యంతో మున్సిపల్‌పాలనను పరుగులు పెట్టించేలా ఈ చట్టాన్ని రూపొందించింది. ఓవైపు బాధ్యతలను గుర్తుచేస్తూనే మరోవైపు సంస్కరణలను ప్రవేశపెడుతూ రూపొందించిన ఈ చట్టంలో జిల్లా కలెక్టర్లను సూపర్ బాస్‌లను చేసింది. మున్సిపల్‌పగ్గాలన్నీ వారికే అప్పగించి ప్రజాప్రతినిధుల పనితీరుపై ఓ కన్నేసి ఉంచేలా నిబంధనలను తీసుకొచ్చింది. తేడా వస్తే చైర్‌పర్సన్‌తోపాటు సభ్యులను సస్పెండ్ చేసే అధికారాలను కట్టబెట్టింది. హరిత మున్సిపాలిటీల కోసం బడ్జెట్‌లో 10% నిధులను ప్రత్యేకంగా కేటాయించడంతో పాటు.. నాటిన వాటిలో 85% మొక్కలు బతక్కపోతే సంబంధిత వార్డు మెంబర్, అధికారిపై కొరడా ఝుళిపించనుంది. పాలకవర్గాలకు ఎన్నికలు, వాటి పనితీరు సమీక్ష, పాలన పర్యవేక్షణ, పట్టణ ప్రణాళిక నియమ నిబంధనలు, ఉద్యోగులకు ఏకీకృత సర్వీస్ రూల్స్, నైపుణ్య పెంపుదల కోసం స్వయంప్రతిపత్తితో కూడిన సంస్థ ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ బోర్డుల ఏర్పాటు, పట్టణ, వార్డు కమిటీలు, లేఔట్ల అనుమతి కోసం జిల్లా స్థాయి కమిటీలు, సమీకృత టౌన్‌షిప్‌లు వంటి వినూత్న అంశాలతో రూపొందించిన ఈ చట్టంపై శుక్రవారం సభలో చర్చించి ఆమోదం తెలపనున్నారు.

లేఔట్ అనుమతులకు కమిటీ

లేఔట్లను అనుమతించే అధికారం జిల్లా స్థాయి కమిటీకి దఖలు పరుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల ఎస్ఈ, ఈఈలతో కూడిన కమిటీ ఏర్పాటు కానుంది. ఈ కమిటీ లేఔట్ల అనుమతి దరఖాస్తులను పరిశీలించి.. అనుమతులు జారీ చేయనుంది. భవన నిర్మాణానికి సంబంధించి అన్ని డాక్యుమెంట్లు సమర్పించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత 21 రోజుల్లోగా అనుమతి ఇచ్చేదీ లేనిదీ తేల్చేయాలి. ఒక వేళ దరఖాస్తును తిరస్కరించాలనుకుంటే ఎందుకు తిరస్కరించారో సహేతుక కారణం చూపాలి. లిఖితపూర్వకంగా దరఖాస్తుదారునికి ఈ వివరాలు తెలియజేయాలి. లేనిపక్షంలో అనుమతి ఇచ్చినట్లుగానే పరిగణించనున్నారు. 200 చదరపు మీటర్లలోపు స్థలంలో భవనం నిర్మించాలనుకుంటే గతంలోలాగా అనుమతులు అవసరం లేదు.

> 200 చదరపు మీటర్లలోపు స్థలంలో భవన నిర్మాణాని కిగాను ఆన్‌లైన్‌లో సదరు యజమాని సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే సరిపోతుంది. దీంతోపాటు అన్ని డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో సమర్పించిన వెంటనే అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ అనుమతి నిరాకరిస్తే ఎందుకు నిరాకరించాల్సి వచ్చిందో రాతపూర్వకంగా తెలియజేయాలి. అలా చేయకుండా సదరు దరఖాస్తుపై ఎలాంటి నిర్ణయాన్ని తీసుకోకపోతే అనుమతి ఇచ్చినట్లే పరిగణించాల్సి ఉంటుంది. అందుకు బాధ్యులైన అధికారులపై కూడా చర్యలు తీసుకుంటారు. 200 చదరపు మీటర్లలోపు స్థలాల్లో భవన నిర్మాణానికి ఇచ్చే సెల్ఫ్ డిక్లరేషన్‌కు సదరు యజమాని బాధ్యత వహించాల్సి ఉంటుంది. తప్పుడు డిక్లరేషన్ ఇస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ అవసరం ఉండదు. భవన నిర్మాణం పూర్తయ్యాక ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇస్తారు. ఒకవేళ నిర్ణీత సమయంలో నిర్మాణం పూర్తి చేయకపోతే ఆ భవనానికి ఇచ్చిన అనుమతిని రద్దు చేస్తారు.
> **భవన నిర్మాణాలకు ఇలా!**

సకాలంలో ఇవ్వకపోతే?

లేఔట్ అనుమతులను నిర్దేశిత సమయంలో ఇవ్వలేకపోయిన పక్షంలో బాధ్యులైన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. అనుమతి పొందిన లేఔట్లలో రెండేళ్లలో డెవలపర్ లేదా బిల్డర్ కనీస సౌకర్యాలు కల్పించి ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సిందే. లేదంటే ఆ డెవలపర్ లేదా బిల్డర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెడతారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడా ఎలాంటి లేఔట్లు చేపట్టకుండా అనర్హులుగా ప్రకటిస్తారు. లే అవుట్‌లో పార్కు, గ్రీన్‌బెల్ట్, ఆటస్థలం కోసం కేటాయించిన ఖాళీ స్థలాలను ఉచితంగా మునిసిపాలిటీలకు బదిలీచేయాల్సి ఉంటుంది. ఇందుకోసం కేటాయించిన ఖాళీ స్థలాల్లో మళ్లీ క్రయవిక్రయ లావాదేవీలు నిర్వహిస్తే జరిమానా విధించడంతోపాటు మూడేళ్ల వరకు శిక్ష విధించే అవకాశం ఉంటుంది. లేఔట్లను జిల్లా స్థాయి కమిటీ పర్యవేక్షించనుంది.

సమీకృత టౌన్‌షిప్‌లు

సమీకృత పట్టణాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం డెవలపర్లకు అవసరమైన ప్రోత్సాహకాలను కల్పిస్తోంది. ప్రణాళికబద్ధమైన అభివృద్ధి సాధించేందుకు ఈ టౌన్‌షిప్‌లు దోహదపడతాయని భావిస్తోంది. పనిచేసే ప్రదేశం నివాసం మధ్యగల దూరం తగ్గించడం, రహదారులపై ఒత్తిడి తగ్గించడంతో ఎక్కువ ఉత్పాదక సమయం లభిస్తుంది. తద్వారా నివాస, కార్యాలయ, వాణిజ్య, వినోద, సేవలు, మౌలిక సదుపాయాల హబ్‌లుగా మారనున్నాయి. ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లు నిర్మించే డెవలపర్లు/బిల్డర్లకు ప్రోత్సాహకాలను కూడా ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. నిర్ణీత విస్తీర్ణంలో.. నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించేవాటికి ఈ రాయితీలు వర్తింపజేయనుంది.

ఏకీకృత సర్వీసు

ఇక మున్సిపల్ ఉద్యోగులంతా ఒకే గొడుగు కిందకు రానున్నారు. ప్రస్తుతం పట్టణాభివృద్ధి సంస్థలు, జీహెచ్‌ఎంసీ, నగర పాలక సంస్థల్లో పనిచేస్తున్న అన్ని కేడర్ల అధికారులు, ఉద్యోగులను మున్సిపాలిటీలకు బదిలీ చేసే అధికారం ఉండేది కాదు. ఇలా విడివిడిగా ఉన్న ఉద్యోగుల సర్వీస్ రూల్స్‌ను 'కామన్ మున్సిపల్ సర్వీస్'గా పేర్కొంది. తద్వారా చట్టంలో ప్రతిపాదిస్తున్న మార్పుల ప్రకారం రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలైనా, జీహెచ్‌ఎంసీ అయినా, కార్పొరేషన్లయినా, పట్టణాభివృద్ధి సంస్థలు ఏవైనా ఒకటే సర్వీసు రూల్స్ ద్వారా ఏ ఉద్యోగి ఎక్కడికయినా బదిలీపై వెళ్లే వెసులుబాటు కలుగనుంది.

పారిశుద్ధ్యానికి కార్యాచరణ ప్రణాళిక

పారిశుద్ధ్య నిర్వహణకు వార్డుల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించనున్నారు. చెత్త సేకరణ, డంపింగ్ కోసం ఎన్ని వాహనాలు అమలవుతాయనే దానిపై మ్యాపింగ్ చేయనున్నారు. అలాగే ఘన వ్యర్థాల నిర్వహణ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్)కు ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేస్తారు. డంపింగ్ యార్డులను శాస్త్రీయంగా నిర్వహించాల్సివుంటుంది. పర్యావరణ సమస్యలు తలెత్తకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాల్సివుంటుంది.

హరితనిధి

పట్టణ సంస్థల్లో పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. ఇందులోభాగంగా గ్రీన్‌సెల్‌ను ఏర్పాటు చేసి బడ్జెట్‌లో 10% నిధులను కేటాయించింది. అంతేకాకుండా.. నాటిన మొక్కల్లో 85% సంరక్షించకపోతే బాధ్యులపై చర్యలు తీసుకోనుంది. మొక్కలను కాపాడడంలో ఉదాసీనంగా ఉన్న వార్డు మెంబర్ (కౌన్సిలర్)ను, నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలిన ప్రత్యేకాధికారిని సర్వీసు నుంచి తొలగించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. మున్సిపల్‌లో నర్సరీ, వనజాతుల అభివృద్ధి చేపట్టనుంది.

ఆస్తిపన్ను బోర్డు

ఆస్తిపన్ను మదింపునకు 'తెలంగాణ ఆస్తిపన్ను బోర్డు'ఏర్పాటు చేయనున్నారు. భవనాలు, భూములపై పన్ను నిర్ధారణపై మున్సిపాలిటీలకు సాంకేతిక మార్గదర్శకాల జారీకి ఈ బోర్డు సహాయకారిగా ఉండనుంది. అక్రమార్కులపై మున్సిపల్ శాఖ కొరడా ఝుళిపించనుంది. అక్రమంగా నిర్మాణం గుర్తించి.. దాన్ని కూల్చివేస్తే దాని ఖర్చును భవన యజమాని నుంచి వసూలు చేయనుంది. అలాగే అతడిపై జరిమానాలను విధించనుంది. ఇప్పటివరకు కేవలం రెవెన్యూ అధికారులకే ఉన్న రెవెన్యూ రికవరీ అధికారం మున్సిపల్ కమిషనర్లకు కూడా సంక్రమించనుంది. తెలంగాణ రికవరీ చట్టం-1864 ప్రకారం భూమి రెవెన్యూ వసూలు తరహాలో బకాయిలను రాబట్టే వెసులుబాటు కలుగనుంది. తద్వారా ఆస్తిపన్ను, ఇతర పన్ను ఎగవేతదారులపై ఆర్‌ఆర్ యాక్ట్‌ను ప్రయోగించే అవకాశం కలుగనుంది.

టౌన్‌ప్లానింగ్ ట్రిబ్యునల్

లేఔట్ల అభివృద్ధి, భవన నిర్మాణాల్లో చోటుచేసుకునే అభ్యంతరాలను అప్పీల్ చేసుకునేందుకు టౌన్‌ప్లానింగ్ ట్రిబ్యునల్ ఏర్పాటు కానుంది. నిబంధనల ఉల్లంఘన, పెనాల్టీల విధింపు తదితర న్యాయ నిర్ణయాలను వెలువరించే అధికారం ఈ ట్రిబ్యునల్‌కు దఖలు పరిచారు. ఐదుగురు సభ్యులతో కూడిన ట్రిబ్యునల్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. చైర్‌పర్సన్‌గా జిల్లా జడ్జి ఉంటారు. పాలకవర్గాలను సంప్రదించిన తర్వాత ఏ మున్సిపాలిటీలోనైనా అవసరం అనుకుంటే ప్రభుత్వం.. పట్టణ ప్రణాళిక కమిటీని ఏర్పాటు చేస్తుంది. అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ఈ కమిటీలు ప్రణాళికలు తయారు చేస్తాయి. ఇందుకయ్యే ఖర్చును మున్సిపల్ నిధి నుంచే భరిస్తారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు నిరంతర శిక్షణ ఇచ్చేందుకు స్వయంప్రతిపత్తి కలిగిన ఓ సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎక్సలెన్స్'పేరుతో స్థాపించనున్న ఈ సంస్థలో పట్టణాభివృద్ధి, నిర్వహణ, పాలన, ఆర్థికాంశాలు, పేదరిక నిర్మూలన, విధి విధానాలపై శిక్షణ ఇవ్వనున్నారు.

పదేళ్లు ఒకే రిజర్వేషన్

మున్సిపల్, నగర పాలక సంస్థలకు ప్రస్తుతం ఖరారు చేసే రిజర్వేషన్ రెండుసార్లకు (పదేళ్లు) వర్తించనుంది. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లను అమలు చేయడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని, అవినీతికి అవకాశం కల్పిస్తుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం రొటేషన్ పద్ధతికి స్వస్తి పలికింది. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఈ విధానాన్ని అమలు చేసిన సర్కారు.. తాజాగా మున్సిపల్‌పాలికల్లోనే ఇదే పద్ధతిని అనుసరించనుంది. ఈ మేరకు కొత్త చట్టంలో పొందుపరిచింది. కౌన్సిలర్/కార్పొరేటర్, చైర్‌పర్సన్/మేయర్ పదవులకు ఈ ఏడాది ఖరారు చేసే రిజర్వేషనే వచ్చేసారీ అమలు కానుంది.

50% మించకుండా..

50% స్థానాలను ఎస్టీ, ఎస్సీ, బీసీలకు కేటాయిస్తారు. ఇందులో అన్ని కేటగిరీల్లోనూ సగం సీట్లను మహిళలకు రిజర్వ్ చేస్తారు. చైర్మన్, మేయర్ స్థానాల రిజర్వేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేయనుంది. గ్రేటర్ హైదరాబాద్ సహా మేయర్ స్థానాల్లో సగం సీట్లను వివిధ కేటగిరీలకు రిజర్వ్ చేస్తారు. పాలకవర్గంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే మూడేళ్లు ఆగాల్సిందే. ఇప్పటివరకు నాలుగేళ్లు ఉన్న ఈ వ్యవధిలో ఏడాదిని కుదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టంలో పొందుపరిచింది. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే మాత్రం విధిగా మూడో వంతు సభ్యులు అనుకూలంగా ఓటేయాల్సివుంటుంది.

కౌన్సిలర్, చైర్మన్‌ను సస్పెండ్ చేసే అధికారం

మున్సిపల్‌పాలన కలెక్టర్ల కనుసన్నల్లో జరుగనుంది. విధిగా మున్సిపాలిటీలను తనిఖీ చేయడమేగాకుండా.. ప్రతి నిర్ణయంలోనూ కలెక్టర్లదే పైచేయి కానుంది. చట్టంలో కలెక్టర్లకు విస్తృతాధికారాలను కట్టబెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బడ్జెట్ రూపకల్పన, రికార్డుల పరిశీలన, తీర్మానాలను సమీక్ష/రద్దు చేసే అధికారం అప్పగించారు. మున్సిపాలిటీలకు సంబంధించి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించలేదని విచారణలో తేలితే కౌన్సిలర్, వైస్ చైర్మన్, చైర్మన్‌ను సస్పెండ్ చేసే అధికారం కలెక్టర్లకు చట్టంలోని సెక్షన్ 52, 53, 54, 55, 57, 58, 61 ప్రకారం లభించింది. సస్పెన్షన్‌ను అప్పీలు చేసేందుకు ప్రత్యేక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. 30 రోజుల్లో అప్పీల్ చేసుకునే వెసులుబాటు కల్పించింది.

డైరెక్ట్ చేస్తారు కూడా

పాలన సక్రమంగా సాగేలా చైర్‌పర్సన్‌కు సూచనలు చేసే అధికారం కూడా ఈ చట్టంతో కలెక్టర్లకు దఖలు పడనుంది. మున్సిపాలిటీల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను ఏ క్షణంలోనైనా తనిఖీ చేసే అధికారమూ కలెక్టర్లకు ఇచ్చారు. అలాగే ఆ మున్సిపాలిటీ పరిధిలోని ఏ స్థిరాస్తినైనా తనిఖీ చేయవచ్చు.

సభ ముందుకు వార్డుల విభజన ఆర్డినెన్స్

ఇటీవల వార్డులను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ గురువారం సభ ముందుకు వచ్చింది. 173 గ్రామ పంచాయతీలతో కొత్తగా 75 మున్సిపాలిటీల ఏర్పాటు, 131 గ్రామ పంచాయతీలను ఇప్పటికే ఉన్న 42 మున్సిపాలిటీలు.. రామగుండం, నిజామాబాద్ కార్పొరేషన్లలో విలీనం చేశారు. దీనికి సంబంధించి ప్రభుత్వం గత నెల 29న చట్టసవరణ చేసింది. ఈ నేపథ్యంలో ఆర్డినెన్స్ స్థానంలో బిల్లును ప్రవేశపెట్టింది.

మున్సిపల్ చట్టంలోని మరికొన్ని ముఖ్యాంశాలు..

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోని ఏదో ఒక మున్సిపాలిటీలో ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా కొనసాగుతారు. ఆయా మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగిన 30 రోజుల్లోపు ఎక్స్ ఆఫీషియో సభ్యుడిగా ఎక్కడ కొనసాగాలో తేల్చుకోవాల్సివుంటుంది.
- కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా ఎన్నికైనవారు 30 రోజుల్లోపు ప్రమాణస్వీకారం చేయాల్సివుంటుంది. లేదంటే మరో 3 నెలలపాటు పాలకవర్గం అనుమతి మేరకు సదరు సభ్యుల ప్రమాణస్వీకారానికి గడువు లభించనుంది.
- ఏదైనా కారణంతో సభ్యులు అనర్హతకు గురయితే 30 రోజుల్లోగా జిల్లా కోర్టులో సవాల్ చేయాల్సివుంటుంది. ఈ పిటిషన్‌ను సదరు కోర్టు మూడు నెలల్లోగా పరిష్కరించాల్సివుంటుంది. లేనిపక్షంలో సభ్యుడు ఆ పదవిలో కొనసాగుతారు.
- ఎవరైనా సభ్యులు రాజీనామా చేసినా, చనిపోయినా, అనర్హతకు గురైన విషయాన్ని 15 రోజుల్లో ఈసీకి కమిషనర్ నివేదిక అందజేయాల్సివుంటుంది. ఆ ఖాళీని నాలుగు నెలల్లోగా భర్తీ చేయాలి.
- ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న వార్డు కమిటీల్లో మహిళలు, యువత, వయోధికులు, ఇతర ప్రముఖులు కలిపి 15 మందికి మించరాదు.
- పాలకవర్గాలు ప్రతి నెలా విధిగా సమావేశం కావాల్సివుంటుంది. ఈ సమావేశాలకు కనీసం సగం మంది హాజరుకావాల్సివుంటుంది.
- కామన్ సర్వీసెస్‌కు సంబంధించిన పోస్టుల వర్గీకరణ, భర్తీ ప్రక్రియ, అర్హతల నిర్ధారణ, వేతనాలు, శిక్షణ తదితర నిబంధనలు ఖరారు చేసే అధికారం ప్రభుత్వానికి దఖలు పడుతుంది.
- ఈ-గవర్నెన్స్, సిటిజన్ చార్టర్‌ను పకడ్బందీగా అమలు చేసే మున్సిపాలిటీలను మోడల్ టౌన్‌లుగా పరిగణించనున్నారు.
- మున్సిపాలిటీలకు సంబంధించి ఏటా ప్రభుత్వానికి పాలనా నివేదికను సమర్పించాల్సివుంటుంది. వచ్చే ఏడాదికిగాను కార్యాచరణ ప్రణాళికను కూడా ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన నెలరోజుల్లోపు పంపాల్సివుంటుంది.
- మున్సిపాలిటీల పరిధిలో నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, పార్కింగ్‌లకు యూజర్ చార్జీలను వసూలు చేయనున్నారు. ప్లంబర్, సర్వేయర్ లైసెన్సులు, మాంస విక్రయదారులు, కబేళాల నిర్వహణకు నిర్దేశిత రుసుం చెల్లించి లైసెన్స్ తీసుకోవాల్సివుంటుంది.
- 75 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మించిన ఇంటికి ఏడాదికి రూ.100 ఆస్తిపన్ను మాత్రమే వసూలు చేయనున్నారు. గ్రౌండ్, గ్రౌండ్ ప్లస్ భవనాలకు ఈ మినహాయింపు వర్తించనుంది.
- స్వీయ ఆస్తిపన్ను మదింపు (సెల్ఫ్ అసెస్‌మెంట్)లో తప్పు లెక్కలు చూపినట్లు తేలితే వాస్తవ పన్ను సహా 25 రెట్ల అపరాధ రుసుం వసూలు చేస్తారు.
- ఆస్తిపన్నును ఏటా రెండు సార్లు చెల్లించాల్సివుంటుంది. సగం సంవత్సరం పూర్తికాగానే 30 రోజుల్లోపు దీన్ని కట్టాల్సివుంటుంది.
- ప్రతి మున్సిపాలిటీలో ప్రజల సౌకర్యార్థం విశ్రాంతి గదులు, శౌచాలయాలు, చైల్డ్ ఫీడింగ్ సెంటర్లు, వైకుంఠధామాలు తప్పనిసరి.
- హోటళ్లు, పెట్రోల్ బంకులు, రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్, థియేటర్లు, విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు కనీస పారిశుద్ధ్య సేవలు ఉచితంగా అందించాల్సి ఉంటుంది.

ఏడు కొత్త నగరపాలికలు

కొత్తగా ఏడు నగర పాలక సంస్థల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. నగరీకరణ నేపథ్యంలో రాజధాని శివార్లలోని మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ గురువారం శాసనసభలో ప్రవేశపెట్టిన తెలంగాణ మున్సిపల్ చట్టంలో పొందుపరిచింది. మేడ్చల్ జిల్లా పరిధిలోని బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట, రంగారెడ్డి జిల్లా పరిధిలో బండ్లగూడ జాగీర్, బడంగ్‌పేట, మీర్‌పేట మున్సిపాలిటీలను నగర పాలక సంస్థలుగా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. వీటిరాకతో రాష్ట్రంలో నగరపాలికల సంఖ్య పదకొండుకు చేరింది. కాగా, జిల్లెలగూడ మున్సిపాల్టీని మీర్‌పేట కార్పొరేషన్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించింది. ఇదిలావుండగా, రాష్ట్రవ్యాప్తంగా 128 మున్సిపాలిటీలు, వరంగల్ మహానగరపాలక సంస్థ, కరీంనగర్, ఖమ్మం, రామగుండం, నిజామాబాద్ కార్పొరేషన్లకు కొత్త చట్టాన్ని వర్తింపజేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. జీహెచ్‌ఎంసీకి సంబంధించి ఈ చట్టాన్ని మినహాయిస్తున్నట్లు తెలిపింది.

ఎన్నికలు ఉన్నట్టా.. లేనట్టా!

కొత్తగా ప్రతిపాదించిన 7 కార్పొరేషన్లలో ఎన్నికల నిర్వహణపై స్పష్టత రావాల్సివుంది. గతంలో ఇవి మున్సిపాలిటీలుగా ఉన్న సమయంలో చేసిన విభజన మేరకు బిల్లులోనూ ఆయా నగరపాలికల వార్డుల సంఖ్యను చూపారు. కార్పొరేషన్లలో వార్డుల ఖరారుకు ఉండాల్సిన జనాభాకు.. మున్సిపాలిటీల జనాభాకు భారీ తేడా ఉంటుంది. ఈనేపథ్యంలో కొత్త కార్పొరేషన్లలోని వార్డుల విభజనపై న్యాయపరమైన సమస్యలున్నాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. దీంతోపాటు ప్రతిపాదిత కార్పొరేషన్లలో మీర్‌పేట, బండ్లగూడ జాగీర్, బడంగ్‌పేటలో ఎన్నికలపై ఇప్పటికే హైకోర్టు స్టే విధించింది. ఈనేపథ్యంలో ఈ కార్పొరేషన్ల ఎన్నికలు ఎప్పుడు ఉంటాయనేదానిపై అధికారవర్గాల నుంచి స్పష్టత రావాల్సివుంది.

నగరపాలక సంస్థ	వార్డులు
గ్రేటర్ వరంగల్	66
కరీంనగర్	60
రామగుండం	50
నిజామాబాద్	60
ఖమ్మం	60
బడంగ్‌పేట	32
బండ్లగూడ జాగీర్	22
మీర్‌పేట	25
బోడుప్పల్	28
పీర్జాదిగూడ	26
జవహర్‌నగర్	28
నిజాంపేట	33

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WALK-IN INTERVIEW
Working Location at LB Nagar, Miyapur, SR Nagar
❖ TELECALLERS ❖ SALES HEAD
❖ MARKETING MANAGERS
❖ FIELD SALES EXECUTIVES
We also prefer MARKETING TEAMS (FREELANCERS / SALARIED)
Walk-In Interview on 19th, 20th & 21st July 2019
from 10:00 am - 6:00 pm (Exciting Schemes & Pre Launch Offers)
SUVARNABHOOMI™ Infra Developers Pvt Ltd
9866163361
9948570242
3rd Floor, Icon plaza, Alwyn X Roads, Above Pride Honda Showroom, Miyapur, HYDERABAD-500049.

మున్సిపాలిటీలకూ పరిశీలకులు

సాక్షి, హైదరాబాద్: అభ్యర్థుల ఎన్నికల వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా కొన్ని స్థానాలు లేదా ఒక మున్సిపాలిటీ లేదా కొన్ని మున్సిపాలిటీలకు కలిపి ఎన్నికల వ్యయ పరిశీలకులను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమించవచ్చని కొత్త మున్సిపల్ చట్టంలో పొందుపరిచారు. ఒక ప్రాంతం లేదా ఒక జిల్లాలోని ప్రాంతాలన్నింటికీ కలిపి రాష్ట్రప్రభుత్వ అధికారి ఒకరిని పరిశీలకుడిగా నియమించి, ఆ అధికారి ద్వారా మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించవచ్చని పేర్కొన్నారు. ఒక ప్రాంతానికి పరిశీలకుడిగా నియమితులైనవారికి ఆ పరిధిలోని ఎన్నికల ఫలితాలు వెలువడేలోగా పరిస్థితులను బట్టి ఏ సమయం లోనైనా కౌంటింగ్ నిలిపేసే అధికారం ఉంది. ఇక గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి అభ్యర్థి ఫలితాలు వెలువడిన 45 రోజుల్లోగా జిల్లా ఎన్నికల అధికారులకు తమ ఎన్నికల ఖర్చు వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది. ఏదైనా పోలింగ్ స్టేషన్‌లోనైనా బహిరంగ హింస, హింసాత్మక దాడులు లేదా ప్రకృతి విపత్తు వంటి వాటి వల్ల అవాంతరాలు ఏర్పడితే అక్కడ పోలింగ్‌ను నిలిపేసి మరో తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు కొత్త చట్టంలో అవకాశం కల్పించారు.

సాక్షి
శుక్రవారం, జూలై, 19

నిర్లక్ష్యం... బాధ్యతారాహిత్యం

దేశ ఆర్థిక, వాణిజ్య రాజధానిగా, జనాభారీత్యా అతి పెద్ద మహా నగరంగా పేరు ప్రఖ్యాతులున్న ముంబై వానాకాలం వచ్చేసరికి చిగురుటాకులా వణుకుతుంది. భారీ వర్షాలతో వరద నీరు చేరి సాధారణ జనజీవనం అస్తవ్యస్థమవుతుంది. ఇంచుమించు ఇదే సమయంలో కాలం చెల్లిన భవనాలు కూలుతున్న ఘటనలు కూడా అడపా దడపా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం ముంబైలోని డోంగ్రీ ప్రాంతంలో వందేళ్లనాటి నాలుగంతస్తుల భవంతి కూలి 13మంది ప్రాణాలు కోల్పోగా పలువురు గాయాలపాలయ్యారు. ఈ నెల మొదట్లో వచ్చిన వర్షాలవల్ల వివిధ ప్రాంతాల్లో గోడలు కూలి 27మంది చనిపోయారు. ఇలా కూలడానికి సిద్ధంగా ఉన్న గోడలు ఎక్కడెక్కడున్నాయో లెక్కేసే తనిఖీలు ఇంకా పూర్తికాలేదు. ఈలోగా ఈ భవనం కూలిపోయింది. మన దేశంలో నగరాలు విస్తరిస్తున్నాయి. భారీ భవంతులు నిర్మాణమవుతున్నాయి. విశాలమైన రోడ్లు వేస్తున్నారు. ఫ్లైఓవర్లు వస్తున్నాయి. మెట్రో రైళ్లు పరుగులు పెడుతున్నాయి. కానీ ఇవన్నీ ప్రధాన మార్గాలకే పరిమితమవుతున్నాయి. ఏ నగరం లోపలికెళ్లి చూసినా ఇరుకు సందులు, మురికి కూపాలు, ఒక పద్ధతి లేకుండా ఉన్న రోడ్లు, ప్రమాదకరంగా వేలాడే కరెంటు తీగలు దర్శనమిస్తాయి. వీటి మధ్య నుంచే వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. సారాంశంలో మౌలిక సదుపాయాలన్నీ పరమ అధ్వాన్నంగా, అస్తవ్యస్థంగా ఉంటున్నాయి. ఇవన్నీ శతాబ్దం క్రితమో, అంతకన్నా ముందో జనాభాను దృష్టిలో పెట్టుకుని రూపొందించినవి. వీటితోపాటే కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలుంటాయి. వాటిల్లో పలు కుటుంబాలు నివసిస్తుంటాయి. ఈ దుస్థితి ఒక్క ముంబై నగరానికి మాత్రమే పరిమితమైనది కాదు. దేశంలో ప్రధాన నగరాలన్నిటి స్థితీ ఇలాగే ఉంటుంది.

ఇప్పుడు జరిగిన విషాద ఘటన వంటిదే 2017లో కూడా జరిగింది. అప్పుడు 33మంది మరణించారు. ఇలాంటి భవనాలు ఇంకా ఎక్కడెక్కడున్నాయో చూసి వాటిల్లో నివాసముండేవారిని ఖాళీ చేయించి కూల్చేస్తామని అప్పట్లో ప్రభుత్వం హామీ ఇచ్చింది. అందుకోసం పురాతన భవంతుల్ని నాలుగు కేటగిరీలుగా విభజించారు. పూర్తి ప్రమాదకరమైనవి, పాక్షికంగా ప్రమాదకరమైనవి, పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టవలసినవి, చిన్న చిన్న మరమ్మతులు సరిపోతాయనుకున్నవి అంటూ ఒక జాబితా రూపొందించారు. ఆ జాబితాలో ఇప్పుడు కూలిన భవనం ప్రమాదకరమైన కేటగిరీలో ఉంది. కానీ ఏమైంది? మళ్లీ అదే విషాదఘటన పునరావృతమైంది. ఉదయం పూట భవనం కూలితే రాత్రికి కూడా శిథిలాల తొలగింపు పూర్తికాలేదు. ఈ వ్యవధిలో కొన ఊపిరితో ఉన్న పలువురిని రక్షించారు. అసలు ఆ ప్రాంతానికి జాతీయ విపత్తు నిర్వహణ దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్) వాహనాలు చేరుకోవడానికి కూడా వీలేని పరిస్థితులున్నాయి. ఇప్పుడు కూలిన భవనం లాంటివి ఆ నగరంలో 499 ఉన్నాయని ఒక సర్వే వెల్లడించింది. నగరంలో శిథిలావస్థకు చేరుకున్న భవంతులున్నాయని, వాటిల్లో చాలా భాగం ఇరుకిరుకు సందుల్లో ఉన్నాయని ప్రభుత్వానికి, బీఎంసీకి తెలుసు. ఏటా పడే భారీ వర్షాల వల్ల ఆ భవంతుల పునాదులు దెబ్బతింటున్నాయని తెలుసు. కానీ చర్యలు మాత్రం ఉండవు. కనీసం భవనాలు కూలినప్పుడు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక దళాన్ని సంసిద్ధంగా ఉంచడానికి అవసరమైన నిధులైనా అందుబాటులో ఉంచాలన్న స్పృహ ఎవరికీ లేదు. ఆ విభాగానికి గత మూడు నాలుగేళ్లుగా కేటాయింపులు 38 శాతం మేర తగ్గాయని బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) గణాంకాలు చెబుతున్నాయి. అలాగని ఆ సంస్థకు డబ్బుకేమీ లోటులేదు. ఆదాయంలో అది దేశం లోనే అగ్రగామి. ఎనిమిది లేన్ల రహదారి నిర్మాణానికి, నగరం చుట్టూ 32 కిలోమీటర్ల తీరప్రాంత రహదారి నిర్మాణానికి ఆ సంస్థ భారీ మొత్తంలో నిధులు కేటాయించింది. మన పాలకుల తీరు ఇలా ఉంటున్నది.

ఆ మహానగరాన్ని ఏలడానికి బీఎంసీ ఉంటే, దాని పర్యవేక్షణలో వేర్వేరు సంస్థలు పని చేస్తున్నాయి. 'మంది ఎక్కువైతే మజ్జిగ పలచనవుతుంద'న్న చందంగా ఈ సంస్థల పరిధులు, అధికారాలు ఒక్కోసారి కలగలిసి గందరగోళంగా మారుతున్నాయి. ఈ సంస్థల బిల్డింగ్ కోడ్‌లు, నియమనిబంధనలు పరస్పర విరుద్ధంగా ఉంటున్నాయి. ఏ ఒక్క సంస్థకూ దేనిపైనా సంపూర్ణాధికారాలు లేకపోవడంతో ఎవరికి వారు పట్టనట్టు ఉంటున్నారు. ఏదైనా అనుకోనిది జరిగితే బాధ్యతను ఎదుటివారిపైకి నెట్టేస్తున్నారు. ఇప్పుడు కూలిన భవంతి మహారాష్ట్ర హౌసింగ్ అండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(ఎంహెచ్‌ఏడీఏ) పరిధిలోనిదని బీఎంసీ చెబుతోంది. ఎంహెచ్‌ఏడీఏకు అనుబంధంగా ఉన్న ముంబై భవన మరమ్మతులు, పునర్నిర్మాణ బోర్డు(ఎంబీఆర్‌ఆర్)కు ఈ భవనం గురించి 2017 జూలైలో లేఖ రాశామంటున్నది. కానీ అందులో ఉన్నవారిని ఖాళీ చేయించాల్సిన బాధ్యత మా సంస్థదా, బీఎంసీదా అని ఎంహెచ్‌ఏడీఏ ఎదురు ప్రశ్నిస్తోంది. దాన్ని ఖాళీ చేయించి అప్పగిస్తే కూల్చివేసేవారమంటున్నది. దారుణమైన విషయమేమంటే ఈ భవనం 1986 వరకూ గ్రౌండ్ ఫ్లోర్‌తోనే ఉండేది. కానీ ఆ తర్వాత దానిపై మరో మూడంతస్తులు లేచాయి. పర్యవేక్షించాల్సిన సంస్థలన్నీ గాఢనిద్రపోవడం వల్లే ఇదంతా జరిగిందని స్పష్టంగానే అర్థమవుతుంది.

మనకు జాతీయ భవన నిబంధనలు(ఎన్‌బీసీ) ఉన్నాయి. వాటి ప్రకారం పాత భవంతుల ప్రమాణాలెలా ఉన్నాయో ఎప్పటికప్పుడు తనిఖీలు జరగాలి. భద్రతను ధ్రువీకరించాలి. నివాసానికి అనువుగా లేనివాటి నుంచి కుటుంబాలను ఖాళీ చేయించాలి. కానీ ఆ నిబంధనలు కూడా ఎవరికీ పట్టడం లేదు. ముంబై ఘటనతో అన్ని ప్రభుత్వాలూ అప్రమత్తం కావాలి. ముఖ్యంగా ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో మున్సిపల్ కార్పొరేషన్లు నిపుణుల కమిటీలు ఏర్పాటుచేసి ప్రమాదకర స్థితిలో ఉన్న భవంతుల ఆరా తీయాలి. ఎన్‌బీసీ ఖచ్చితంగా అమలయ్యేలా చూడాలి. చూసీచూడనట్టు వదిలేసే అధికారుల పనిబట్టాలి. లేనట్టయితే ఈ తరహా ఘటనలు పునరావృతమవుతూనే ఉంటాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయణం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం, తిథి బ.తదియ పూర్తి (24 గంటలు), నక్షత్రం ధనిష్ఠ రా.2.56 వరకు, తదుపరి శతభిషం, వర్జ్యం... లేదు
దుర్ముహూర్తం ఉ.8.11 నుంచి 9.03 వరకు
తదుపరి ప.12.29 నుంచి 1.21 వరకు
అమృతఘడియలు... ప.3.24 నుంచి 4.33 వరకు.

సూర్యోదయం : 5.38
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ఉ. 10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

అడవి ఎదపై అణుకుంపటి

తెలంగాణ-ఆంధ్రప్రదేశ్, రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తరించిన నల్లమల అడవుల్లో ఇపుడు 'యురేనియం' తవ్వకం కలకలం సృష్టిస్తోంది. మన్ననూరు పులుల అభయారణ్యం ఉనికికే ఇది ప్రమాదం. అరుదైన చెంచు తెగ మనుగడకు శాపం. యురేనియం నిల్వల అన్వేషణ, తవ్వకాల కోసం సర్కారు సాగిస్తున్న ప్రయత్నాలొకవైపు, తలెత్తుతున్న నిరసనోద్యమాలు మరోవైపు.. 'అమ్రాబాద్' చుట్టూ వాతావరణం వేడెక్కుతోంది. సమగ్ర నిర్వచనం లేని అభివృద్ధి పేరిట పర్యావరణాన్ని పణంగా పెట్టాల్సిందేనా?

దిలీప్ రెడ్డి

''మైళ్లకు మైళ్ల దూరం అందమైన ఇప్పచెట్ల అడవి ఉన్న చోటే స్వర్గం. కానీ, మైళ్లకు మైళ్ల ఇప్పచెట్ల అడవి ఉండీ అందులో ఓ అటవీ రక్షకుడుంటే నరకం''

పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌ఘడ్‌లోని ఓ గిరిజన తెగలో ఈ సామెత వాడుకలో ఉంది. రక్షకులే భక్షకులవుతున్న కాలమిది. అటవీ అధికారులో, చట్టబద్ధ ప్రాధికార సంస్థలో, అటవీ శాఖో, ప్రభుత్వాలో... ఏవైతేనేం, కట్టలు తెంచుకున్న స్వార్థం, అవినీతి, పరస్పర విరుద్ధ విధానాలతో అడవుల్ని ధ్వంసం చేస్తున్నాము. పెంచాల్సిన పరిస్థితుల్లో అడవుల విస్తీర్ణాన్ని తగ్గిస్తున్నారు. పర్యావరణ పరంగా యోచిస్తే కొన్ని చర్యలు, తను కూర్చున్న కొమ్మని మనిషి తానే నరుక్కున్నట్టుంటాయి. అడవుల్ని బలిపెట్టడం ఇటువంటిదే! ఫలితమే పెచ్చుమీరిన కాలుష్యం, జీవవైవిధ్య విధ్వంసం, సహజ వనరుల నాశనం, వాతావరణ మార్పులు. అభివృద్ధి పేరిట జరిగే విధ్వంసాలను పౌరసమాజం అడ్డుకునే క్రమంలో ఘర్షణ తప్పటం లేదు. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్, రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తరించిన నల్లమల అడవుల్లో ఇపుడు 'యురేనియం' తవ్వకం కలకలం సృష్టిస్తోంది. పులుల అభయారణ్యం ఉనికికే ఇది ప్రమాదం. చెంచు తెగ మనుగడకు శాపం. యురేనియం నిల్వల అన్వేషణ, తవ్వకాల కోసం సర్కారు సాగిస్తున్న అంచెలంచెల యత్నాలొకవైపు, ఇప్పుడిప్పుడే పురుడుపోసుకుంటున్న నిరసనోద్య మాలు మరోవైపు.. 'అమ్రాబాద్' చుట్టూ వాతావరణం వేడెక్కుతోంది. రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాల తదుపరి చర్యలు ఎలా ఉంటాయో! నిర్వచనం లేని అభివృద్ధి పేరిట పర్యావరణాన్ని పణంగా పెట్టాల్సిందేనా? ప్రస్తుత-భవిష్యత్తరాల ప్రయోజనాలు మనకు పట్టవా? చెంచులు, గిరిజన జాతుల ప్రగతి మనం ప్రచారం చేసే అభివృద్ధిలో భాగం కాదా? వారి కనీస మనుగడనే లక్ష్యపెట్టని అభి వృద్ధి ఎవరికోసం? ఇటువంటి ప్రశ్నలెన్నో? జనాన్ని ఉద్యమాలవైపు పురిగొల్పుతున్నాయి. సాంకేతికత విస్తరించి, సామాజిక మాధ్యమాల ప్రభావం పెరిగిన పరిస్థితుల్లో ఉద్యమ స్వరూప-స్వభావాలూ మారిపోయాయి. ప్రభుత్వాలు మరింత స్పృహతో, బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరముంది.

దూళి కూడా శాపమే!

యురేనియం తవ్వకాలు, వెలికితీత, రవాణా, నిల్వ, వినియోగం.. ఇవన్నీ భయం కలిగించేవే! దాని స్వభావం-ప్రభావం అలాంటిది. యురేనియం గనుల సంఖ్య, గనుల విస్తీర్ణం ఎక్కువ చేయడానికి కేంద్రం యత్నిస్తోంది. ప్రస్తుత ఉత్పత్తిని నాలుగు రెట్లు పెంచేలా రూ.1,05,700 కోట్ల ఖర్చుతో 13 గనులను ఏర్పాటు చేసే యత్నాల్లో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐల్) ఉంది. ఇందులో చిత్రియాల్ (నల్గొండ), మన్ననూర్-అమ్రాబాద్ (శ్రీశైలం అడవుల్లో) కూడా ఉన్నాయి. ఈ కార్పొరేషన్‌కు ఇప్పటికే ఏడు గనులు జార్ఖండ్‌లో, ఒకటి ఏపీ(కడప)లో ఉన్నాయి. రెండు అవసరాల కోసం ఈ యురేనియం అన్వేషణ. యురేనియం ముడి పదార్థంగా దేశంలో అణు విద్యుత్ ఉత్పత్తిని 22,000 మెగావాట్లకు తీసుకెళ్లడం, దేశ రక్షణ కోసం బాంబుల తయారీకి దీని ఉప ఉత్పత్తిని వాడటం లక్ష్యం. చెప్పుకోవడానికి ఈ కారణాలు బాగానే ఉన్నా వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. అణు విద్యుదుత్పత్తి అసాధారణ ఖర్చుతో కూడు కున్నదే కాక ప్రమాదభరితమైంది. న్యూక్లియర్ పదార్థాలు, అణు ధార్మికత వల్ల పర్యావరణ విధ్వంసమే కాక అడవులు-ఇతర సహ జవనరులు, తరాల తరబడి జీవరాశి ఆయురారోగ్యాలు క్షీణిస్తాయి. అణు వ్యర్థాలు, ఆ కణాలు కలిసిన నీరు, చివరకు ఆ రేణువుల ధూళి, గాలి కూడా ప్రమాదమే!

సమకాలీనం

తవ్వకాలు, వెలికితీత జరుగుతున్న చోట ఇప్పటికే కాలుష్యాల దుష్ప్రభావంతో క్యాన్సర్ వంటి తీవ్ర వ్యాధులు, రేడియేషన్ ప్రభావంతో గర్భస్రావాలు, అంగ వైకల్య జననాలు... ఇలా ఎన్నెన్నో సమస్యలతో జనం సతమతమౌతున్నారు. అందుకే, అగ్ర రాజ్యాలన్నీ ఈ రకం ఉత్పత్తిని నిలిపివేశాయి. దేశ రక్షణకు అవసరమైన అణు బాంబులు మన వద్ద ఉన్నాయి. బాంబుల తయారీకి అవసరమైన యురేనియం, ఉప ఉత్పత్తులు ఇప్పటికే టన్నుల కొద్ది ఉన్నాయి. ఆరు దేశాల నుంచి యురేనియం దిగుమతి చేసుకుంటున్నాము. అంతర్జాతీయ ఆంక్షల తొలగింపు నేపథ్యంలో ఇంకా దిగుమతి చేసుకోవచ్చు. ఇవేవీ పరిగణనలోకి తీసుకోకుండా యురేనియం తవ్వకాలు, అదీ, అపార సహజ సంపదకు నెలవైన నల్లమల అడవుల్లో చేయడం దారుణం. అడవికి, ఔషధ మొక్కల వంటి విలువైన అటవీ సంపదకు, పులుల అభయారణ్యానికి, చెంచులు, వన్యప్రాణులు ఇతర జీవరాశికి నష్టమే కాకుండా భూగర్భ జలాలు, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు సమీపంగా ఉన్నందున ఆ నీళ్లు కలుషితమవుతాయి. వాటిని తెలుగు రాష్ట్రాల్లోని పలు పట్టణాలు, గ్రామాల తాగు, సాగు అవసరాలకు వాడుతున్నందున సగటు మనిషి మనుగడ, భవిష్యత్తరాల బతుకు అగమ్యగోచరమౌతుంది.

మరోమార్గం చూసుకోవాలి

క్లీన్ ఎనర్జీ అయినంత మాత్రాన ఇంత ఖర్చుకు, ఇన్ని ప్రమాదాలకూ సిద్ధపడాల్సిందేనా? మేధావులు, ఉద్యమకారుల ప్రశ్న. యూనిట్ అణు విద్యుత్ ఉత్పత్తి వ్యయమే రూ.30 వరకుంటుంది. భద్రతకు అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ, దీర్ఘకాలిక ఖర్చుల్నీ లెక్కిస్తే యూనిట్ ధర ఇంకా పెరగొచ్చని పాలసీనిపుణుడు దొంతి నర్సింహారెడ్డి అంటున్నారు. ఇంత చేశాక కూడా ప్రమాదాలు జరగవనే గ్యారెంటీ లేదు. రష్యా, జపాన్ వంటి సాంకేతిక నైపుణ్యపు దేశాలే చెర్నోబిల్, ఫుకుషిమా ప్రమాదాలపుడు విలవిల్లాడాయి. ఇక, అందులో వందో వంతు భద్రతకూ భరోసాలేని మన వంటి దేశాల్లో ఏదైనా ప్రమాదం జరిగితే ఏంటి? ఎన్ని వేల, లక్షల కుటుంబాలకు, భవిష్యత్తరాలకది శాపంగా మారుతుందో ఊహకూ అందని భయం! ప్యారిస్ ఒప్పందం ప్రకారం శిలాజ ఇంధన వినియోగం తగ్గించి, పునర్వినియోగ యోగ్య ఇంధనాలకు వెళ్లాలనే మాట నిజమే! అయితే, అది అణువిద్యుత్తే కానవసరం లేదు. భారీ ప్రాజెక్టులు కాకుండా చిన్న, మధ్యతరగతి జల విద్యుత్తు, సౌర, పవన విద్యుత్తు కావొచ్చు. అవి ప్రమాదరహితం. సౌర విద్యుదుత్పత్తి వ్యయం ఇప్పటికే బాగా తగ్గింది. ఇంకా తగ్గించే పరిశోధనలు జరగాలి. వందల, వేల ఎకరాల్లో పలకలు (ప్యానల్స్) వేయడం కాకుండా వికేంద్రీకృత పద్ధతిన ఇళ్లపైన, వ్యవసాయ క్షేత్రాల వద్ద ఏర్పాటు చేసుకునే వ్యవస్థను బలోపేతం చేయాలి. అణువిద్యుత్తే అనివార్యమైతే పది రూపాయలు ఎక్కువ పెట్టయినా యురేనియం దిగుమతి చేసుకోవాలే తప్ప ప్రమాద భరితమైన తవ్వకాలు జరపొద్దని సామాజిక కార్యకర్తలంటారు. అడవిని కల్లోల పరచి ప్రకృతి సంపదను విధ్వంసం చేయొద్దనేది వారి వాదన. ఇప్పుడు తెలంగాణ,ఏపీ రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి వైఖరి తీసుకుంటాయన్నది ఆసక్తికరం. కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్ సహజవాయు ఉత్పత్తి సమయంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఒక న్యాయమైన అంశాన్ని లేవనెత్తారు. ప్రాజెక్టు తాలూకు కష్ట-నష్టాల్ని స్థానికులుగా మేం భరిస్తున్నపుడు ప్రయోజనాల్లో తమకు సహజసిద్ధమైన వాటా ఉండాలని కేంద్రంతో వాదించారు. ఆ స్ఫూర్తిని ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు అంది పుచ్చుకోవాలి.

తీరు మారుతున్న ఉద్యమాలు

ఒకప్పటిలా ఉద్యమాలంటే కేవలం ధర్నాలు, రాస్తారోకోలు కాదు. ఆధునిక సాంకేతికత పుణ్యమా అని ప్రజాఉద్యమాలు కొత్త బాట పట్టాయి. సంప్రదాయ, సామాజిక మాధ్యమాలు వేదికగా ప్రజాభిప్రాయాన్ని బలోపేతం చేస్తున్నారు. ఇలాంటి ప్రాజెక్టుల వల్ల రానున్న ప్రమాద తీవ్రతపై సమాచారాన్ని చిట్టచివరి వ్యక్తికీ చేర్చి మద్దతు కూడగడుతున్నారు. ప్రజాందోళనల్ని సమైక్యపరచి ఉద్యమోద్ధృతి పెంచుతున్నారు. పారిస్ వంటి అంతర్జాతీయ ఒప్పందాల నేపథ్యంలో పర్యావరణ అంశాల్ని, జీవవైవిధ్య ప్రమాదాల్ని ఎత్తి చూపుతూ ఐక్యరాజ్యసమితి (యూఎన్) తదితర సంస్థల్ని ప్రభావితం చేస్తున్నారు. అరుదైన జాతులు అంతరించిపోయే ప్రమాదాల్ని ఎత్తిచూపి ప్రపంచ దృష్టి ఆకర్షిస్తున్నారు. పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోని గోరక్‌పూర్‌లో ఇటువంటి ఆందోళన వచ్చినపుడు అక్కడి కృష్ణజింక, చుక్కల జింక మనుగడ ఎంతటి ప్రమాదంలోకి జారనుందో అధ్యయనం చేశారు. ఎమ్స్ మెహతా, డా॥ సాయిభాస్కర్ వంటి నిపుణులు ఆధారాలతో జాతీయ హరిత ట్రిబునల్ (ఎన్‌జీటీ) ముందు వాదించి, సానుకూల నిర్ణయాలు వచ్చేలా చేశారు. దేశవ్యాప్తంగా ఉద్యమకారులు 'ఆవాజ్' తదితర వేదికల్ని వాడుకుంటూ సంతకాల సేకరణ ద్వారా జనాభిప్రాయాన్ని ప్రోది చేసి, విశాల ఉద్యమాల్ని నిర్మిస్తున్నారు. అన్ని పద్ధతుల్లో ఒత్తిడి పెంచి, ప్రభుత్వాలు మొండిగా, ఏకపక్షంగా వ్యవహరించలేని పరిస్థితిని కల్పిస్తున్నారు. ఉద్యమాల్లో స్థానికత, వ్యూహం-ఎత్తుగడ కొరవడితే లక్ష్య సాధన కష్టం. నాగార్జునసాగర్ అణురియాక్టర్ వ్యతిరేకోద్యమం విజయవంతమైతే కూడంకులం పోరాటాలు విఫలమవ్వడం ఇందుకు ఉదా॥గా ప్రముఖ పర్యావరణవేత్త డా॥ పురుషోత్తమ్‌రెడ్డి పేర్కొంటారు.

అడవికేది రక్ష?

యురేనియం తవ్వకాలకు 'ఇంకా అనుమతులివ్వలేద'ని అటవీ అధికారులు పక్కా సాంకేతిక భాష మాట్లాడుతున్నారు. మరో పక్క అన్నీ జరిగిపోతూనే ఉన్నాయి. అడవుల్ని రక్షించుకోవాల్సిన అవసరం అందరికన్నా అటవీ అధికారులపైనే ఎక్కువగా ఉంది. మనవన్నీ పరస్పర విరుద్ధ విధానాలే! చెంచుల వల్ల అడవి అంతరిస్తోందని వారిని బయటకు తరలించే చర్యలు తీసుకుంటారు. ఇదంతా ఖనిజ తవ్వకాలు జరిపే కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేందుకే! దానికి 'అభివృద్ధి' ముసుగు కప్పే పాలకవర్గాలు అదే చెంచుల్ని, గిరిజనుల్ని, సదరు అభివృద్ధిలో భాగస్వాముల్ని చేయవు. నిజానికి చెంచులు, ఇతర గిరిజన జాతులు అడవికి రక్షగా ఉంటారే తప్ప అడవినెప్పుడూ పాడు చేయరు. వారి జీవనోపాధి పరిరక్షిస్తూ వారినే అటవీ రక్షకులుగా వాడే సమన్వయ చర్యలేవీ ప్రభుత్వాలు చేపట్టవు. అడవి అంచుల్లో, చెట్లు అంతరించిన చోట పోడు వ్యవసాయం చేసుకోండని ప్రత్యామ్నాయం చూపించి వారిని ప్రోత్సహిస్తారు. అందుకోసం, అడవి మధ్యలోంచి వారిని బలవంతంగా తరలిస్తారు. వారికి భూమి హక్కులు కల్పించాలని 'అటవీ హక్కుల చట్టం' సుస్పష్టంగా చెబుతున్నా, దాన్ని సవాల్ చేస్తూ మన ప్రభుత్వాలు సుప్రీం కోర్టుకెక్కుతాయి. ఇంత వైరుధ్యముంటుంది. చట్టాలు అమలు చేయాల్సిన సమయంలో నిద్ర నటించి, గిరిజనావాసాల్లో గిరిజనేతరు లొచ్చి భూములు ఆక్రమిస్తున్నా ఉపేక్షిస్తారు. ప్రాజెక్టుల కోసం అడవుల్ని నరికినపుడు ప్రత్యామ్నాయ అడవుల పెంపకం కోసం లభించే నష్టపరిహార (కంపా) నిధుల్నీ సవ్యంగా వినియోగించరు. రక్షకులే భక్షకులుగా మారుతుంటే ఇక అడవికేది రక్ష? జనం అప్రమత్తం కావడమొకటే పరిష్కారం.

ఈ-మెయిల్ : dileepreddy@sakshi.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బలవంతులు

"చాలామందికి తెలిసినదే. మన దేశంలో పోలీసులు చట్టప్రకారం వ్యవహరించరు. బలవంతుల ఆదేశాల మేరకే వాళ్లు పని చేస్తారు. బలవంతులైనవారు కొన్నిసార్లు మైనారిటీ, బలహీన వర్గాలకు చెందినప్పటికీ, వారి మాటే వింటారు. వారు చెప్పిందే చేస్తారు. ఆవిధంగానే వారు ఆలోచిస్తూంటారు. వివాహ సంబంధమైన కేసుల్లో కూడా తరచూ ఇదే జరుగుతూంటుంది. మన దేశంలో పోలీసుల తీరు గురించి కొత్తగా చెప్పుకోవాల్సిందేముంది?"

– దీపికా భరద్వాజ్, జర్నలిస్

మెట్రో

"ఢిల్లీ మెట్రోను చాలా దారుణంగా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా నోయిడాలో రైల్వే స్టేషన్‌ను ప్రజలు ఎంత దుర్వినియోగం చేయగలరో అంతా చేస్తున్నారు. కొత్తకొత్త మౌలిక వస్తువులన్నీ చాలా త్వరగా పాడైపోతున్నాయి. అత్యవసరంగా ఇక్కడ స్వచ్ఛ భారత్ అభియాన్ నిర్వహించాల్సిన అవసరం ఉంది"

– పూజ మెహ్రో, రచయిత్రి

ప్రార్థన

"అస్సాం పరిస్థితిని తలచుకుంటే ఆందోళనగా ఉంది. అస్సాం వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న అస్సాంలోని మన సోదర సోదరీమణులను తలుచుకుంటే గుండె చెరువవుతోంది. మేమంతా మీతోనే ఉన్నాం. మీ అందరి క్షేమం కోసం ప్రార్థన చేస్తున్నాం. స్థయిర్యాన్ని కోల్పోవద్దు"

– వివేక్ ఆనంద్ ఒబెరాయ్, నటుడు

తీర్పు

"ముఖచిత్రాన్ని బట్టి పుస్తకంలోని అంశాన్ని అంచనా వేయడం తప్పని చెప్పడం లేదు. తీర్పు చెప్పాలనుకోవడం దానికదే తప్పు అని నేను అంటున్నా. ఎవరు ఎలాంటి దుస్తులు ధరించాలనే అంశం కంటే మనం పట్టించుకోవాల్సినవి ఎన్నో ఉన్నాయి. వారు ధరించాలనుకునే వాటిని ధరించే స్వేచ్ఛ మహిళలకు ఉండాలి"

– అమలా పాల్, నటి

చర్చ

"కర్ణాటక అసెంబ్లీలో చర్చ జరుగుతున్న స్థాయి చాలా ఆశ్చర్యకరంగా ఉంది. చర్చలో లోతు, పరిశోధన, వాదన నేర్చుకోవాల్సిన అంశాలు. మొత్తం దేశం అంతా వారి మాటలు వింటోందని శాసనసభ్యులందరికీ తెలుసు. వాళ్లంతా ఇంగ్లిష్‌లోనే మాట్లాడితే వారి చర్చ ఎంత హీనస్థాయిలో ఉందో అనువాద సమస్య లేకుండా అందరికీ అర్థమయ్యేది"

– రోహిణీ స్వామి, జర్నలిస్ట్

ఆదివాసీ సంఘీభావ సభ

ప్రజాసాహితి గౌరవ సంపాదకులు, జనసాహితి నాయకులు నిర్మలానంద జీవితకాలపు సాహిత్యోద్యమ కృషి మనందరికీ తెలుసు. ఆయన భౌతికంగా మనకు దూరమై అప్పుడే సంవత్సరం అవుతూ వుంది. ఈ మొదటి వర్ధంతి సందర్భంగా 'ఆదివాసీలు ప్రకృతితో, దోపిడీవర్గ రాజ్యంతో నిత్యం ఎలా సంఘర్షణ పడుతున్నారు' అన్న అంశంపై సభలు జరపాలని నిర్ణయించాం.

అడవి అంటే కొద్దిమంది ఆదివాసీలు, సెలయేళ్లు, పక్షులు, జంతువులు మాత్రమే కాదు. అడవి అంటే లక్షల సంవత్సరాల మానవ నాగరికతా పరిణామపు కొనసాగింపు. అడవంటే వైవిధ్యం. అడవి అంటే ప్రకృతితో స్నేహమూ, మెలకువతో కూడిన సంఘర్షణల క్రమం. అడవి అంటే లక్షలాది ఆహారపు గింజలు, పక్షి, జంతుజాతుల జన్యు భాండాగారం. రకరకాల తెగుళ్ళకు, పరాయి సాంస్కృతిక దాడికి తట్టుకొని నిలదొక్కుకుంటూ వస్తున్న ప్రాణికోటి మనుగడ. ఆదివాసీలను అడవి నుంచి వేరుచేయడం అంటే ఈ దేశపు వందల కోట్ల ప్రజల్ని తరతరాలుగా రాబోయే ప్రమాదాల కొలిమిలోకి నెట్టడమే. కావాలని కల్లోలాన్ని కొని తెచ్చుకోవడమే. ఏదైనా జన్యు పరిణామమో, ప్రమాదమో జరిగి తేనెటీగలు, సీతాకోక చిలుకల వంటి కీటక జాతి సంతతి మరణిస్తే ఏ అణు బాంబుతోనూ పని లేకుండా ఆరేడు సంవత్సరాలలో మొత్తం మానవాళి అంతరిస్తుందని చాలా తక్కువ మందికి మాత్రమే అర్థమవుతుంది. ఈ విధంగా చూస్తే అడవినే కాదు, మొత్తం మానవాళినే రక్షిస్తున్న మహాశక్తి సంపన్నులు ఆదివాసులు.

మహాశ్వేతాదేవి రచనలను తెలుగులోకి అనువదించి, అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్ వంటి యోధుల పోరాటాల్ని ప్రజాసాహితి ద్వారా మనకందించిన నిర్మలానంద నుంచి ఉత్తేజాన్ని స్వీకరిద్దాం. పాలస్తీనా ప్రజల పోరాటాల్ని, ఆఫ్రికా ఆదిమజాతుల చెదిరిన సమాజాల్ని, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ బహుళ జాతి దుర్మార్గాలకు ఎదురు నిలిచిన దేశ దేశాల కథలను మనకు పరిచయం చేసిన నిర్మలానందను గుర్తు చేసుకుందాం.

(నిర్మలా నంద మొదటి వర్ధంతి సందర్భంగా జూలై 21 సా. 5.30 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ సంఘీభావ సభ)

కె. రామ్మోహన్, జనసాహితి

లంచం పునాదులపై కర్ణాటకం

విశ్లేషణ

మాడభూషి శ్రీధర్

రాజీనామా చేసిన ఎమ్మెల్యేలకు స్వేచ్ఛ ఉందన్న సుప్రీంకోర్టు తీర్పుతో తేలే దేమిటో కనబడడం లేదు. 15 మంది ఎమ్మెల్యేల రాజీనామాతో ముఖ్యమంత్రికి అవసరమయ్యే మెజారిటీ తగ

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం
19-7-2019

స్క్రీన్ టెస్ట్
లోపలి పేజీలో...



ఈసారి నేనే రంగంలోకి దిగుతున్నా : చేతిలో కోతి బొమ్మతో బిగ్ బాస్ 3 హోస్ట్ అక్కినేని నాగార్జున

'మన్మథుడి' సినిమాలో నాగార్జునని చూస్తే 'బాస్ అంటే ఇలా ఉండాలి' అనిపిస్తుంది! సీరియస్‌గా ఉంటాడు. చిలిపిగానూ ఉంటాడు. 'ఉప్పర్ మీటింగ్ ఏంటి?' అంటాడు. ఉత్సాహం నింపుతాడు. ఇప్పుడా బాస్.. బిగ్‌బాస్-3 హోస్ట్‌గా వస్తున్నాడు. మరి ఇక్కడ ఎలా ఉండబోతున్నాడు? మరింత డీసెంట్‌గా, డిగ్నిఫైడ్‌గా, డిలైట్‌ఫుల్‌గా.. ఈ బిగ్ షోను నడిపించబోతున్నాడు. టీజర్‌లను చూస్తుంటే అలాగే అనిపిస్తోంది.

నో యాక్టింగ్ పండూ

''ఆకాశం ఎర్రగా ఉంది'' అన్నాడు ధర్మవరపు సుబ్రహ్మణ్యం. ఆకాశంలోకి చూడకుండానే!

''మామూలుగానే ఉందే'' అన్నాడు నాగార్జున. ఆకాశంలోకి చూసి.

సిటీలోని ఓ ఎత్తయిన భవంతిలో, ఆఖరి అంత స్థులో నిలుచుని ఉన్నారు ఇద్దరూ.

ఇద్దరూ బ్లాక్ సూట్‌లో ఉన్నారు. ఇద్దరికీ నల్ల కళ్లద్దాలు ఉన్నాయి. ఇద్దరి చేతుల్లో లెదర్ సూట్‌కేస్‌లు ఉన్నాయి. వాళ్ల బ్యాక్‌గ్రౌండ్‌లోకి 'ట.. ట్ట.. డా.. య్' అని జేమ్స్‌బాండ్ 007 సిగ్నేచర్ ట్యూన్ వచ్చి వెళుతోంది. వాళ్ల సీక్రెట్ మీటింగ్ అది.

ఆకాశం 'మామూలుగానే ఉందే' అని నాగార్జున అనడంతోనే.. ''కోడ్ వర్డ్. ఫోన్‌లో చెప్పాను కదా'' అన్నాడు అసహనంగా ధర్మవరపు సుబ్రహ్మణ్యం.

వెంటనే నాగార్జున తన ప్యాంటు జేబులోంచి ఓ చీటి తీసి అందులో రాసిపెట్టుకున్న కోడ్‌ని చదువుతూ, ''అది దేశద్రోహుల రక్తం వల్ల వచ్చిన ఎరుపు'' అన్నాడు.

వెంటనే ధ.సు. (ధర్మవరపు సుబ్రహ్మణ్యం) నవ్వాడు. వాళ్లిద్దరూ అదే ఫస్ట్ టైమ్ చూసుకోవడం, అదే ఫస్ట్ టైమ్ కలుసుకోవడం. అదే ఫస్ట్ టైమ్ మాట్లాడుకోవడం.

'బాలసుబ్రహ్మణ్యం' అన్నాడు ధ.సు. చెయ్యిస్తూ.

'అభిరామ్' అన్నాడు నాగార్జున.. చేతికి చెయ్యిస్తూ.

''మీరు మైక్ తెచ్చారా?.. అన్నాడు నాగార్జున.

''మీరు క్యాష్ తెచ్చారా?'' అడిగాడు ధ.సు.

నాగార్జున సూట్‌కేస్‌ని చూపించాడు. ధ.సు. ఇక మొదలుపెట్టాడు.

''యాక్చువల్‌గా ప్రపంచంలో ప్రతి మనిషికీ తన గురించి అవతలివాళ్లు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలనే కుతూహలం ఉంటుంది. అది సహజం. ఇన్‌ఫ్యాక్ట్..'' అంటూ ఇంకా ఏదో చెప్పబోతుంటే.. ''ఇదంతా రాత్రి టీవీలో విన్నాను'' అన్నాడు నాగార్జున.

టీవీలో ధర్మవరపు సుబ్రహ్మణ్యం తను కనిపెట్టిన సీక్రెట్ మైక్ గురించి చెబుతున్నప్పుడు అది చూసి, అలాంటి ఒక సీక్రెట్ మైక్ కోసం ఆర్డర్ ఇచ్చి ఉంటాడు నాగార్జున. అందుకోసమే రహస్యంగా వాళ్లిద్దరూ అక్కడ కలుసుకున్నారు.

ప్రొడక్ట్‌ని అమ్ముకోడానికి వచ్చినవాళ్లు భలే తమాషాగా మాట్లాడతారు. అది ఒకసారికి వినడానికి బాగుంటుంది. రెండోసారికీ వినడానికి బాగానే ఉంటుంది. మరోసారికి.. వినడానికి ఏముందీ అనిపిస్తుంది. అందుకే ధర్మవరపు సుబ్రహ్మణ్యం.. 'యాక్చువల్‌గా ప్రపంచంలో ప్రతిమనిషికీ..' అని మొదలు పెట్టగానే.. 'విన్నాను' అని కట్ చేస్తాడు నాగార్జున. 'మన్మథుడు' సినిమాలోని ఒక పాపులర్ సీన్ ఇది.

•••

స్టార్ 'మా'లో మళ్లీ బిగ్‌బాస్ రియాల్టీ షో ఈ ఆదివారం నుంచి మొదలవబోతోంది! మూడో షో ఇది. వందరోజుల షో. ఇరవై నాలుగు గంటలూ అరవై నాలుగు సీక్రెట్ కెమెరాలు తిరుగుతుండే షో. ధర్మవరపు కనిపెట్టిన సీక్రెట్ మైక్ లాంటిదే.. రెండేళ్లుగా స్టార్ 'మా' ప్రసారం చేస్తున్న ఈ బిగ్‌బాస్ రియాల్టీ షో. అది ఆడియో. ఇది వీడియో.

''ఇది మైక్. ఇది రిసీవర్. ఇది ఏంటెనా. మీరు ఎవరి మాటలు వినాలనుకుంటున్నారో వాళ్ల టేబుల్ కింద ఈ మైక్ పెట్టండి. మీ టేబుల్ కింద ఈ ఏంటెనా పెట్టండి. చెవులో రిసీవర్ పెట్టుకోండి. వాళ్లు మాట్లాడుకునేవన్నీ తెలిసిపోతాయి'' అని డెమో ఇస్తాడు ధర్మవరపు సుబ్రహ్మణ్యం.

స్టార్ 'మా' బిగ్‌బాస్ షో కూడా రెండేళ్ల క్రితం ఇలాగే ప్రోమోలతో మొదలైంది. ఈ జూలై 21 మొదలవబోతున్నది 'బిగ్‌బాస్ 3' షో. కొత్తగా ప్రోమో లేమీ ఇవ్వకుండానే బిగ్‌బాస్ షో ఎలా ఉంటుందో ఇప్పుడు టీవీ ఉన్న ప్రతిఇంటికీ, రోజూ రాత్రి తొమ్మిది అయ్యేసరికి తీరిక చేసుకునే ప్రతి కంటికీ తెలుసు. ఓ పెద్ద ఇల్లు ఉంటుంది. అది బిగ్ హౌస్. అందులో మనకు తెలిసినవాళ్లు, తెలియనివాళ్లు పదహారు లేదా పద్నాలుగు మంది ఉంటారు. వాళ్లంతా హౌస్ మేట్స్. వాళ్లందరికీ ఓ పెద్ద ఉంటాడు. ఆయనే బిగ్‌బాస్ కంటికి కనిపించడు. చెవికి వినిపిస్తుంటాడు. మొదటి షోకి జూనియర్ ఎన్టీఆర్, రెండో షోకి నానీ బిగ్ బాస్ హోస్ట్‌లు. ఇప్పుడీ మూడో షోకి హోస్ట్.. నాగార్జున. బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా కంటెస్టెంట్‌లు మూడు నెలల పాటు హౌస్‌లోపలే ఉండిపోతారు. చూడ్డానికి టీవీలు ఉండవు. చదవడానికి పేపర్లు ఉండవు. మాట్లాడుకోడానికి ఫోన్‌లు ఉండవు. 'ఏదో తింటున్నానంతే.. ఏదో ఉంటున్నానంతే..' అని 'దేవుడు చేసిన మనుషులు' సినిమాలో ఇలియానా పాడుతుంది. అలా పడి ఉంటారు. పడి ఉండలేని వాళ్లు పక్కవాళ్ల మీద పడుతుంటారు. వాళ్లలోనే ఏడ్చేవాళ్లుంటారు. ఏడ్చిమొత్తుకునేవాళ్లుంటారు. నవ్వేవాళ్లుంటారు. నవ్వించి కవ్వించేవాళ్లు ఉంటారు. పువ్వులాంటి వాళ్లుంటారు. ముల్లులా గుచ్చి గుచ్చి చంపేవాళ్లు ఉంటారు. ప్రపంచంలో ఎన్ని రకాల మనస్తత్వాల వాళ్లుంటారో అన్ని మనస్తత్వాలూ ఈ హౌస్‌లో ఉంటాయి. ఆ తత్వాలన్నీ హౌస్‌లోని రహస్య కెమెరాల్లోంచి మన కంట (టీవీ చూస్తున్నవారి కంట) పడుతుంటాయి. బిగ్ హౌస్‌లో అనూహ్యంగా, చిత్ర విచిత్రంగా తలెత్తే పరిస్థితులలో.. నటించినట్లుగా కాకుండా సహజమైన కదలికలు ఉన్నవారే అంతిమంగా విజేతలు. అయితే ఒట్టి సహజత్వమే విజేతను చెయ్యదు. గొంతు మాత్రమే వినిపించే బిగ్ బాస్.. (బిగ్‌బాస్, బిగ్‌బాస్ హోస్ట్ ఒకరు కాదు) తరచు హౌస్‌లోని వాళ్లకేవో ఆదేశాలు ఇస్తుంటాడు. బాధ్యతలను పురమాయిస్తుంటాడు. ఆ ప్రకారం చెయ్యాలి. ఆటలు ఆడించాలి. ఆగ్రహించాలి. హౌస్‌ని ఆర్డర్‌లో పెట్టాలి. ఎవరు ఎప్పుడు హౌస్ నుంచి ఎలిమినేట్ అవుతారో ఊహించలేం. ఆ ఎలిమినేట్ అయినవాళ్లు హౌస్ నుంచి వెళ్లిపోతుంటే చూడాలి.. మన ఇంట్లోంచి కూడా ఇంటి గేట్‌లోకి కన్నీళ్లు ప్రవహించేస్తుంటాయి. అంత నేచురల్‌గా ఉంటుంది రియాల్టీ షో.

'ఓన్లీ రియాలిటీ' అంటున్న నాగార్జున

•••

నాటకీయత లేకపోవడం బిగ్ హౌస్ ప్రత్యేకత అయితే, నాటకీయతే బిగ్ బాస్ షో ప్రచారానికి ప్రాణం తొలి, మొదటి రెండు బిగ్ బాస్ షోలతో పోలిస్తే మూడో బిగ్ బాస్ ప్రమోషన్‌లో నాటకీయత కాస్త ఎక్కువగానే ఉంది. అసలు బిగ్ బాస్ 3 హోస్ట్ ఎవరన్నదానిపైనే స్టార్ 'మా' ఒక ప్రోమోను విడుదల చేసింది. 'కమింగ్ సూన్' ప్రోమో అది. నెలక్రితం విడుదలైంది. ఒక స్వామీజీ ప్రవచిస్తూ ఉంటారు. ఆయన చుట్టూ చిన్నా పెద్ద, పిల్లా జల్లా చేరి ఉంటారు.

''హ.. హ.. మనసు కోతిలాంటిది. మరి అలాంటి మనసున్న మనుషులు ఓ ఇంట్లో చేరితే? మమకారంతో, వెటకారంతో వారిని ఏకతాటిపైకి తెచ్చేదెవరు? అధికారంతో నడిపేది ఎవరు? ఆ ఇంట్లో కొత్త ఉత్సాహాన్ని నింపే శక్తి గల వ్యక్తి ఎవరు?'' అని స్వామీ అడుగుతుంటాడు. అలా ఎవరు... ఎవరు.. ఎవరు.. అని ఆయన అంటున్నప్పుడు హుడెడ్ కోటులో ముఖం కనిపించకుండా, వెనక్కు తిరిగి చూడకుండా ఒక పొడవాటి వ్యక్తి (నాగార్జున).. ఇంటి గోడలకు అంటించి ఉన్న బిగ్ బాస్ 3 పోస్టర్ వైపు వేలు చూపించి వెళ్లిపోతాడు. ఆ టీజర్ బాగా ఆసక్తిని రేకెత్తించింది.

> 'కెమెరా ఆన్ కాగానే యాక్టింగ్ మొదలు పెట్టేస్తారు అందరూ. కానీ అదక్కడ కుదరదు. నో యాక్టింగ్. ఓన్లీ రియాలిటీ'

తర్వాతి ప్రోమోలో 'నో యాక్టింగ్.. ఓన్లీ రియాలిటీ' అంటూ డైరెక్టుగా నాగార్జునే సీన్‌లోకి వచ్చేస్తాడు.

సీన్ నెం.1: పారిశుధ్య కార్మికులు రోడ్డు ఊడుస్తుంటారు. అటుగా వచ్చిన రాజకీయ నాయకుడు సడన్‌గా కారులోంచి దిగి వాళ్ల చేతుల్లోని చీపురు లాక్కుని రోడ్డు ఊడ్వడం మొదలు పెడతాడు! ఆ సీన్‌ని చూస్తూ 'యాక్టింగ్ పండూ..' తన చేతిలోని కోతి బొమ్మతో అంటాడు నాగార్జున.

సీన్ నెం.2 : ఒక అమ్మాయి.. ఆల్రెడీ వేసి ఉన్న ముగ్గు మీద.. ముగ్గు వేస్తున్నట్లుగా చెయ్యిపెట్టి, ఇంకో చేత్తో సెల్ఫీ తీసుకుని 'మై ఫస్ట్ రంగోలి' అని పోస్ట్ చేస్తూ ఉంటుంది. ఆ ముగ్గుకు ఫినిషింగ్ టచ్ ఇస్తున్న ఆవిడ, ''ఏయ్ ముగ్గేస్తుంటే కనబడటం లేదా. జరుగూ' అని ఆ అమ్మాయిని కసురుకుంటుంది. ఆ సీన్‌ని చూసి 'పోజింగూ' అంటాడు నాగార్జున.

సీన్ నెం.3: భార్యాభర్తలు గొడవపడుతుంటారు. వాళ్ల పిల్లాడు స్మార్ట్ ఫోన్‌లో ఆ గొడవను షూట్ చేస్తున్నాడని తెలిసి నవ్వు ముఖాలు పెట్టుకుని ఒకరికొకరు దగ్గరకు జరుగుతారు. ఆ సీన్ చూసి.. 'ఫ్యామిలీస్ పండూ.. కవరింగు' అంటాడు నాగార్జున.

ఇంకా ఇలాంటి సీన్లు మరో రెండుంటాయి. పెళ్లి భోజనం గబగబా, ఆబగా లాగించేస్తున్నవాళ్లు వీడియోగ్రాఫర్ వాళ్లవైపు రాగానే మెల్లిగా తింటున్నట్లు నటిస్తారు. ఓ కుర్రాడైతే వీడియో కాల్‌లో తన గర్ల్ ఫ్రెండ్ 'వేర్ ఆర్ యూ?' అని అడగ్గానే 'ఐయామ్ ఎట్ ద బీచ్. గోవా.. గోవా..' అని చెబుతాడు. నిజానికి అతడు ఉన్నది ఇళ్లు కట్టేచోట ఇసుకలో!

అప్పుడంటాడు నాగార్జున.. 'కెమెరా ఆన్ కాగానే యాక్టింగ్ మొదలు పెట్టేస్తారు అందరూ. కానీ అదక్కడ కుదరదు. నో యాక్టింగ్. ఓన్లీ రియాలిటీ' అని.

మూడో ప్రోమో కర్టెన్ రైజర్‌లాంటిది.

రైతు బజార్‌లోకి అడుగు పెడతాడు నాగార్జున. మొదటి టీజర్‌లోని సేమ్ అదే హుడెడ్ కోట్‌తో. అతడి చేతివేళ్ల మధ్య కోతిబొమ్మ వేలాడుతుంటుంది. మార్కెట్‌లో అకస్మాత్తుగా ఆయన్ని చూసి అక్కడివాళ్లంతా.. పూలమ్ముకునే అమ్మాయిలు, టీ కాచే కుర్రాడు, కోడిగుడ్ల వ్యాపారీ.. అంతా ఉక్కిరిబిక్కిరి అవుతారు. తలపై నుంచి హుడ్‌ని తొలగిస్తాడు నాగార్జున.

''సార్..' అంటాడు గుడ్ల వ్యాపారి.

''ఏంటి.. గుడ్లప్పగించి చూస్తున్నావ్. గుడ్లివ్వు'' అంటాడు నాగార్జున.

''డజనా, రెండు డజన్‌లా సార్'' అంటాడు వ్యాపారి.

''ఆకలేస్తే తింటారు. అలిగితే వాటితోనే కొట్టుకుంటారు. అన్నీ ఇచ్చెయ్'' అని ఇంకో చోటుకు వెళ్తాడు. అక్కడ.. ఓ కూరగాయలమ్మే ఆవిడ.. నాగార్జునను చూసి 'హా..' అని గుండెలపై చేతులు వేసుకుంటుంది.

నవ్వుతాడు నాగార్జున. ''నవనవలాడే లేత వంకాయలు ఓ పాతిక కిలోలివ్వు'' అంటాడు.

''పాతిక కిలోలా!! ఎక్కడికండీ;!!'' అంటుంది ఆవిడ.

''వంకాయల్లాగా వగలు పోయేవాళ్లుంటారే.. అక్కడికి'' అంటాడు.

పక్కనే ఉన్న బియ్యం వ్యాపారి.. ''సార్.. మాంచి వెరైటీ ఓ బస్తా ఇమ్మంటారా?'' అని అడుగుతాడు.

''పద్నాలుగు మంది. వంద రోజులు. ఒక బస్తా ఏం సరిపోతుంది? షాపులో ఉన్నవన్నీ వేసెయ్'' అంటాడు నాగార్జున.

''అయినా.. మీరొచ్చారేంటి సార్'' అంటాడు బియ్యం వ్యాపారి.

అప్పుడు అంటాడు నాగార్జున నవ్వుతూ, కన్నుకొడుతూ.. ''ఈసారి నేనే రంగంలోకి దిగుతున్నా'' అని.

టీజర్‌లు పండాయి. షోని నాగార్జున ఎలాగూ పండిస్తాడు.

•••

'యాక్చువల్‌గా ప్రపంచంలో ప్రతి మనిషికీ తన గురించి అవతలివాళ్లు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలనే కుతూహలం ఉంటుంది. అది సహజం' అని ధర్మవరపు సుబ్రహ్మణ్యం అన్నట్లు.. ఒంటరిగా ఉన్నప్పుడు అవతలి వాళ్లు ఏం ఆలోచిస్తారో, వాళ్ల బిహేవియర్ ఎలా ఉంటుందో తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా ప్రతి మనిషికీ ఉంటుంది. ఆ ఆసక్తి నుంచి పుట్టుకొచ్చిన కాన్సెప్టే బిగ్ బాస్ రియాలిటీ షో. సీక్రెట్ కెమెరాల హౌస్‌లో జరిగే ప్రతి ఒక్కటీ ఆ హౌస్‌లోని వాళ్లకు తప్ప లోకమంతటికీ తెలుస్తుంది! అలాగని లోకం కోసం యాక్టింగ్ చెయ్యడానికి లేదు. ఒరిజినాలిటీ ఉన్నవాళ్లది విజయం అవుతుంది. బిగ్ బాస్ షో పై భిన్న వాదనలు ఉండొచ్చు. ఈ షోను చూడకుండా ఉండలేమన్నదానిపై ఏ వాదనా లేదు. కంటెస్టెంట్‌లుగా హేమ, హిమజ, రాహుల్ సిప్లిగంజ్, ఫన్ బకెట్ మహేశ్, టీవీ9 జాఫర్, వీ6 సావిత్రి, వరుణ్‌సందేశ్, ఆసూరెడ్డి మరికొందరి పేర్లు బయటికొస్తున్నాయి.

ఈసారి షోలో రెండు స్పెషాలిటీలు ఉన్నాయి. కంటెస్టెంట్‌లలో సామాన్యులు ఉండరు. అందరూ సెలబ్రిటీలే. అలాగే ఈసారి షో 'క్లీన్'గా ఉండబోతోంది. నాగార్జున హోస్ట్‌గా ఉండేందుకు ఒప్పుకున్నాడంటే.. అంతేగా! ●

> మనసు కోతిలాంటిది. మరి అలాంటి మనసున్న మనుషులు ఓ ఇంట్లో చేరితే? మమకారంతో, వెటకారంతో వారిని ఏకతాటిపైకి తెచ్చేదెవరు? అధికారంతో నడిపేది ఎవరు?

బిగ్‌బాస్ 3 హోస్ట్ ఎవరో ప్రకటించక ముందు రిలీజ్ అయిన టీజర్‌లో హుడెడ్ కోట్‌లో నాగార్జున

కబీర్ రెడ్డి

మేబీ అది ప్రేమేనేమో!

మన ఉద్దేశం ఏదైనా అది అవతలి వాళ్లకు ఎలా అర్థమయిందో అదే మన అసలు ఉద్దేశం అవుతుంది! హృదయం అచ్చుయంత్రమై అందులోంచి మన ఉద్దేశాన్ని ప్రింట్ అవుట్ తీసి ఇచ్చినా కూడా ఎవరికి వాళ్లు అర్థం చేసుకున్నదే అచ్చులో ఉన్నది అవుతుంది తప్ప, అచ్చులో ఉన్నది అందరికీ ఒకేలా అర్థమవదు.

● మాధవ్ శింగరాజు

యావద్దేశ ప్రజలందరి ఐక్యూ లెవల్స్ ఒకలా ఉండనట్లే, వాళ్ల ఎత్తిపొడుపు లెవల్సన్నీ ఒకేలా ఉండవు. ఐక్యూ కన్నా ఎత్తిపొడుపు మోర్ కాంప్లికేటెడ్. పైన ఉండే వాళ్ల ఐక్యూను ఒకనాటికి కాకున్నా ఒకనాటికి కింద ఉండేవాళ్లు అందుకోగలుగుతారు. ఐక్యూ కన్నా ఇంకా ఎత్తున ఎత్తిపొడుపు ఉంటుంది కనుక అది ఏనాటికీ సామాన్యుల చేతికి అందదు. ఎంత ఐక్యూ ఉన్నా, ఎత్తిపొడుపును అర్థం చేసుకోలేకపోయారంటే వాళ్లూ సామాన్యుల కిందే లెక్క. 'సర్కాజం' అంటారు ఎత్తిపొడుపును ఇంగ్లిష్‌లో.

నటి తాప్సీ ట్విట్టర్‌లో సర్కాస్టిక్‌గా చేసిన ఒక కామెంట్‌పై ఇప్పుడు నెట్‌లో ఆగ్రహావేశాలు రగులుకుంటున్నాయి. అర్థం కాకపోవడం వల్ల జరిగిన అనర్థం అది. అంత పీక్‌లో ఉంది మరి తాప్సీ సర్కాజం. నాగపూర్‌లో ఒక యువకుడు తన ప్రియురాలి క్యారెక్టర్‌ని శంకించి, ఆమె తలను మోది చంపేశాడు. దారుణమైన ఘటన. ఇద్దరూ ఫ్రెండ్స్. అతడి పేరు అష్రాఫ్ షేక్. ఆ అమ్మాయి ఖుషీ పరిహార్. ఆమె ఉండటం నాగపూర్‌లో. మోడలింగ్ అంటే ఇష్టం. లోకల్‌గా ఫ్యాషన్ షోలు చేస్తుంటుంది. అలా అష్రాఫ్ పరిచయం. అలాగే మరికొందరు పరిచయం. వాళ్లతో మాట్లాడొద్దంటాడు ఖుషీని. గత శనివారం పంధుర్న-నాగపూర్ హై వే మీద పోలీసులకు ఓ యువతి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. ముఖం గుర్తుపట్టలేని విధంగా ఉంది. సోషల్ మీడియాలో శోధించి ఆమెను, ఆమె ఫ్రెండ్ అష్రాఫ్‌నీ గుర్తించారు పోలీసులు. చంపింది తనేనని ఒప్పుకున్నాడు అష్రాఫ్. ఎందుకు చంపావు అంటే.. 'వేరే మగాళ్లతో కూడా మాట్లాడుతోంది. తన క్యారెక్టర్ మంచిది కాదని పించి చంపేశాను' అన్నాడు. చంపడమే ఘాతుకం అనుకుంటే, క్యారెక్టర్ మంచిది కాదని చంపేయడం ఇంకా ఘాతుకం. ఈ ఘాతుకంపైనే తాప్సీ సర్కాస్టిక్‌గా చేసిన కామెంట్ బ్యాక్ ఫైర్ అయింది. 'మేబీ అతడు ఆమెను పిచ్చిగా ప్రేమిస్తున్నాడేమో! మేబీ ఆ పిచ్చి ప్రేమతోనే అతడు ఆమెను చంపేశాడేమో!' అని తాప్సీ ట్వీట్ చేశారు. 'కబీర్ సింగ్' డైరెక్టర్ సందీప్ రెడ్డిని ఎత్తిపొడవడం ఇది. అయితే ట్వీట్‌లో సందీప్ పేరు లేకపోవడంతో ఈ ఎత్తిపొడుపు ఎవరికీ అర్థమైనట్లు లేదు. అర్థంకాకపోవడం అర్థం చేసుకోలేనివాళ్ల తప్పైతే కాదు. ఈ ఒక్కచోట ఎత్తిపొడుపులో తన ఐక్యూ లెవల్స్‌ని తాప్సీ తగ్గించుకోవలసింది. సున్నితమైన సంగతి కదా. ఆమె సర్కాజం అర్థమైనవాళ్లకు కూడా తాప్సీ ఎవరికో భలే పంచ్ ఇచ్చారని మాత్రమే అనిపిస్తుంది. ఏ కొద్దిమందికో ఆమె సందీప్‌ని అంటున్నారని తెలుస్తుంది.. ఆయన ఇంటర్వ్యూపై జరుగుతున్న రగడను ఫాలో అవుతున్నవారికి. మిగతావాళ్లంతా నిజంగానే తాప్సీ.. ఆ చంపిన యువకుడిని సమర్థిస్తోందనే అనుకున్నారు. ట్రోలింగ్ మొదలుపెట్టారు.

> 'కబీర్‌సింగ్' దర్శకుడు సందీప్‌రెడ్డి ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ మిస్‌ఫైర్ అయినట్లే.. నాగపూర్‌లో ఓ యువతి హత్యపై ట్విట్టర్లో తాప్సీ పెట్టిన కామెంటు బ్యాక్‌ఫైర్ అయింది. 'మేబీ అది కూడా ప్రేమేనేమో' అని తాప్సీ సందీప్‌రెడ్డిపై సర్కాస్టిక్‌గా చేసిన ట్వీట్ ఏ కొద్దిమందికో అర్థమైనట్లుగా కనిపిస్తోంది.

ప్రతీకాత్మకచిత్రం : 'మిషన్ మంగళ్' చిత్రంలో తాప్సీ

'కబీర్‌సింగ్'లో హీరో హీరోయిన్‌ని చెంపదెబ్బ కొట్టే సీన్ ఉంది. ఇలా స్త్రీ చెంపపై పురుషుడు చెయ్యి చేసుకునే సీన్లు సినిమాలు పుట్టినప్పటి నుంచీ ఉన్నాయి కానీ ఇది కొంచెం వేరుగా ఉంది. ఆ కొట్టడంలో 'టాక్సిక్ మాస్క్యులినిటీ' స్పష్టంగా కనిపిస్తోంది. సినిమా చూస్తున్న మగపిల్లల కండల్లోకి విషపూరిత పురుషత్వాన్ని ఇంజెక్ట్ చేసే శాడు డైరెక్టర్.. ప్రియుడి చేత ప్రియురాలిని ఫిజికల్‌గా అసాల్ట్ చేయించి! పైగా అలా కొట్టడాన్ని ప్రేమ అన్నాడు సందీప్‌రెడ్డి అనుపమా చోప్రాతో. ఆమె ఫిల్మ్ క్రిటిక్. ''స్త్రీని తక్కువ చెయ్యడం కదా అది'' అని అనుపమ అన్నప్పుడు.. ''గాఢమైన ప్రేమలో ఇలాగే జరుగుతుంది. ఇలా జరగలేదంటే అక్కడేం లేనట్లు'' అని సందీప్ అన్నాడు! ఆయన ఇలా అనడం చెంపదెబ్బ సీన్ కన్నా పెద్ద సీన్ అయింది! ఆయన చెప్పదలచుకున్నది ఏదో ఉంది. దాన్నే డెప్త్‌కి వెళ్లి మాట్లాడాడు. అంతే డెప్త్‌కి వెళ్లి తాప్సీ ఆయన్ని ఎత్తిపొడిచారు. ఇంటర్వ్యూలో ఆయన కామెంట్స్ మిస్‌ఫైర్ అయినట్లే, ట్విట్టర్లో తాప్సీ కామెంటు బ్యాక్‌ఫైర్ అయింది. దానిపై మళ్లీక ట్వీట్ పెట్టారు తాప్సీ. ''ఎత్తిపొడుపును అర్థం చేసుకోలేనివాళ్లు దయచేసి నా ట్వీట్‌ను పట్టించుకోకండి. థ్యాంక్యూ, మీరెవరో నాకు తెలియకపోవడం మంచిదైంది'' అని కామెంట్ పెట్టారు. సందీప్‌రెడ్డి అంతకుముందే తన మాటలపై వివరణ ఇచ్చారు. అది కొంచెం బెటర్ వెర్షన్‌లో ఉంది. అంటే.. అర్థం చేయించే భాషలో. ''మీరు నా మాటల్ని పూర్తిగా అపార్థం చేసుకున్నారు. కబీర్‌సింగ్ తన ప్రియురాలిని కొట్టడం కొట్టినట్లు కాదు. ఒకరు లేకుండా ఒకరు ఉండలేనంతగా దగ్గరైనప్పుడు కోపాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛను తీసుకోకుండా ఉండలేకపోవడం అది. అమ్మాయైనా అంతే, అబ్బాయైనా అంతే'' అని అన్నాడు. ఈ మాట ఎంతమందికి ఎంత మేరకు అర్థమైయిందో మరి.

తాప్సీని, సందీప్‌నీ వదిలేద్దాం. అంతగా డెప్త్ లేని, అంతగా సర్కాజం లేని మనం కూడా నెత్తీనోరూ మొత్తుకుంటూనే ఉంటాం.. 'నా ఉద్దేశం అది కాదు' అని చెప్పడానికి. ముఖ్యంగా భార్యాభర్తలు, కుటుంబ సభ్యులు, బాగా దగ్గరి ఫ్రెండ్స్! ఉద్దేశాన్ని వేరేలా అర్థం చేసుకున్నారంటే.. ఉద్దేశాన్ని అర్థం చేసుకోలేకపోయారనో, అపార్థం చేసుకున్నారనో కాదు. మన ఉద్దేశం వేరేలా కూడా అర్థమయ్యేలా ఉందని. ●

హెల్త్ టిప్

దురదలను దూరం పెట్టండి

ఆపిల్ సైడర్ వెనిగర్ యాంటీ సెప్టిక్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉండటం వలన వివిధ రకాల చర్మ సమస్యలను సులభంగా తగ్గిస్తుంది. చర్మం దురదగా అనిపించినపుడు, చిన్న దూది ఉండను తీసుకొని ఆపిల్ సైడర్ వెనిగర్‌లో ముంచి దురదగా అనిపించిన ప్రాంతాలలో రాయటం వలన దురదల నుండి విముక్తి పొందుతారు.

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ శుక్రవారం
19-7-2019

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్

ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! నేను నాలుగేళ్లుగా ఒక అబ్బాయిని ప్రేమిస్తున్నాను. తను నాకు ప్రపోజ్ చేసిన రోజే వాళ్ల ఇంట్లో చెప్పాడు. 'స్టడీస్ అయ్యాక ఆలోచిద్దాం' అన్నారట వాళ్ల పేరెంట్స్. దాంతో సెటిల్ అవ్వాలనే ఉద్దేశంతో మేము కెరీర్ మీద దృష్టిపెట్టాం. మా వాళ్లు నాకోసం సంబంధాలు చూడాలని ప్రయత్నించడంతో.. నేను కూడా ఇంట్లో మా ప్రేమ విషయం చెప్పేశాను. మా పేరెంట్స్ ఒప్పుకోవట్లేదు. 'మాకు నేపథ్యాలే ముఖ్యం' అంటున్నారు. వాళ్ల ఇంట్లో కూడా అదే పరిస్థితి. ఇద్దరం ఒకే మాట మీద ఉన్నాం.. 'చేసుకుంటే తననే చేసుకుంటాను' అని ఇంట్లో వాళ్లకి చెప్పాను. తను కూడా వాళ్ల ఇంట్లో అదే చెప్పాడు. 'పాయిజన్ తాగి చస్తాం' అంటూ ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు పేరెంట్స్. రోజూ ఏదేదో మాట్లాడుతూ మానసికంగా బాధపెడుతున్నారు. అన్నయ్యా! వేరు వేరు నేపథ్యాల్లో పుట్టడమే మేం చేసిన తప్పా? ఏదైనా మంచి సలహా ఇవ్వండి ప్లీజ్!

– స్వీటీ

అస్సలు కాదు చెల్లెమ్మా.. క్యాస్ట్ ప్రాబ్లమ్ కాదు.. మైండ్ ప్రాబ్లమ్...!

కులాలు వేరు అంటే.. ఒక్కో కులానికి ఒక్కో జీవనశైలి, కొన్ని కట్టుబాట్లు, కొన్ని అలవాట్లు ఉంటాయి. నీలాంటి బంగారు తల్లి ఇంకో ఇంట్లో కంఫర్ట్‌బుల్‌గా ఉండదేమోనని పేరెంట్స్ భయపడతారు..

'చాల్లే సార్! ఊరికే అసలు విషయం చెప్పకుండా పక్కకి తప్పిస్తున్నారు. అక్కడ చేసుకుంటే చస్తామని పేరెంట్స్ భయపడుతుంటే సొల్యూషన్ ఇవ్వకుండా ఎస్కేప్ రూట్లో ఆన్సర్ ఇస్తున్నారు!'

కాదు నీలూ! క్యాస్ట్ ప్రాబ్లమ్ కాదని చెప్పడానికి ఆ లైన్‌లో వెళ్లాను.. కానీ చచ్చిపోతామని బెదిరిస్తుంటే మాత్రం.. పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఇద్దరూ విషయం చెప్పుకోవడం బెటర్..!!

'కరెక్ట్ సార్! పోలీస్ వాళ్లు చాలా గుడ్ పోలీసింగ్ చేస్తున్నారు సార్.. వాళ్లైతే.. పేరెంట్స్ ఇద్దరినీ పిలిచి.. కౌన్సెలింగ్ ఇచ్చి.. వీళ్లిద్దరూ మైనర్లు కాకపోతే.. వాళ్లే దగ్గరుండి షాదీ చేస్తారు సార్! అప్పుడు అంతా హ్యాపీస్ సార్!!' అని నవ్వింది నీలు..

lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

8		7	2				1	
4	2			9	8		6	
		3	4		6	2	8	5
		2				1		
5	3						2	7
		1				5		
3	5	9	7		1			
	1		3	4			7	8
	4				2	3		1

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

4	5	1	8	6	2	3	9	7
8	7	6	3	5	9	4	2	1
9	2	3	4	1	7	8	5	6
5	1	4	9	8	6	7	3	2
6	8	9	2	7	3	5	1	4
2	3	7	5	4	1	6	8	9
1	4	5	7	9	8	2	6	3
3	9	8	6	2	4	1	7	5
7	6	2	1	3	5	9	4	8

ఇలా ఉంటా!

శ్రుతీహాసన్

వృద్ధాప్యంలో మనం ఎలా కనిపిస్తాం? అనే ఆలోచనతో ఫేస్‌యాప్ అనే యాప్ తయారైంది. ఈ యాప్ సాయంతో ప్రతి ఒక్కరు టైమ్ మిషన్ అవసరం లేకుండా భవిష్యత్తులో తాము ఎలా ఉంటామో సరదాగా చూసుకుంటున్నారు. ఫేస్‌యాప్ చాలెంజ్ ద్వారా ముడతలు నిండిన ముఖాలను చూసుకొని మురిసిపోతున్నారు. ఇప్పుడు ఈ చాలెంజ్‌లో శ్రుతీహాసన్ కూడా పాల్గొన్నారు. వృద్ధాప్యంలో తాను ఎలా ఉంటారో చూపించడమే కాకుండా తన ఓల్డ్ ఏజ్ లైఫ్ ఎలా ఉంటుందో కూడా శ్రుతీహాసన్ సరదాగా పంచుకున్నారు. ''జీవితంలో ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే.. నా పదిమంది మనవళ్లు, మనవరాళ్లు, వివిధ దేశాల్లో ఉండే నా ఇల్లు, సంతృప్తికర జీవితం వీటన్నింటికీ నేను చాలా థ్యాంక్‌ఫుల్‌గా ఉంటాను. 'ఇప్పటికీ మీరు మానసికంగా చిన్నవాళ్లే' అనే ప్రశ్నకు ఎప్పటిలానే 'మన శక్తి మేరకు వర్కౌట్ చేయడమే' అని సమాధానం ఇస్తుంటానేమో?' అని చెప్పుకొచ్చారు శ్రుతీహాసన్. ఇంతకీ అర్థమైందా? తాను ఓల్డ్ ఏజ్‌లో ఉన్నట్లుగానే ఫీలై, శ్రుతి ఈ విధంగా చెప్పారు.

వందమందితో డిష్యూం డిష్యూం

రకుల్

ప్రభాస్

ప్రభాస్ కటౌట్ ఆరడుగులు ఉంటుంది. ఇలాంటి బలమైన హీరోని ఎదుర్కోవాలంటే ఒకరిద్దరు విలన్లు కచ్చితంగా సరిపోరు. డజన్ల కొద్ది రౌడీలు రావాల్సిందే. 'సాహో' సినిమా క్లైమాక్స్‌లో ఏకంగా వందమందికి పైగా కరుడుగట్టిన రౌడీలతో ప్రభాస్ తలపడతారని తెలిసింది. ప్రభాస్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ చిత్రం 'సాహో'. సుమారు 300 కోట్ల బడ్జెట్‌తో వంశీ, ప్రమోద్, విక్కీ నిర్మించారు. శ్రద్ధా కపూర్ కథానాయిక. 'సాహో' క్లైమాక్స్‌ను దాదాపు వందమంది ఫైటర్స్‌తో చిత్రీకరించారట. ఈ సన్నివేశం కోసం అబుదాబిలో ప్రత్యేకంగా సెట్‌ను రూపొందించారు. పది ఎకరాలలో ఓ ఎడారి, అందులో పాడుబడిన భవంతిని తలపించే సెట్‌ను తయారు చేశారు. ఎడారి లుక్ పర్ఫెక్ట్‌గా సెట్ కావడం కోసం సెట్ మొత్తాన్ని నల్ల మట్టితో నింపారని సమాచారం. పెంగ్ జాంగ్ ఈ ఫైట్‌ని కంపోజ్ చేశారు. ఈ ఫైట్ కోసం భారీగా ఖర్చుపెట్టారట. జాకీ ష్రాఫ్, అరుణ్ విజయ్, మురళీ శర్మ, మందిరా బేడీ ముఖ్య పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి మది కెమెరామేన్‌గా చేశారు. ముందు ఈ చిత్రం ఆగస్ట్ 15న విడుదల చేస్తామని చిత్రబృందం ప్రకటించింది. అయితే వాయిదాపడిందని సమాచారం. 'సాహో' రిలీజ్ డేట్‌పై స్పష్టత రావాల్సి ఉంది.

సినిమాలో చేసినవి నిజంగా చేస్తామా?

''సినిమాలో పాత్ర ఏ విధంగా ఉంటే అలా మేం నటిస్తాం. అంతే కానీ సినిమాలో మేం పోషించే పాత్ర ఏదైనా చెడు చేస్తే దాన్ని మేం ప్రమోట్ చేసినట్టు కాదు. నిజ జీవితంలో మేం వాటిని అనుసరిస్తున్నట్టూ కాదు. ఆ సన్నివేశాలను చూసి నన్ను విమర్శించేవాళ్లను పట్టించుకోను కూడా'' అన్నారు రకుల్ ప్రీత్ సింగ్. తన లేటెస్ట్ చిత్రం 'మన్మథుడు 2' టీజర్‌లో రకుల్ పొగ తాగుతూ కనిపించారు. ఇది సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. పలువురు రకుల్‌ని విమర్శించారు. ఈ విషయానికి రకుల్ స్పందించారు. ''నిజజీవితంలో నేను పొగ తాగను. అంతెందుకు నాకు చీట్ డే (వారంలో నచ్చినవన్నీ తినడానికి ప్రత్యేకంగా పెట్టుకునే రోజు) కూడా ఉండదు. నా చుట్టూ ఉండేవాళ్లకు తెలుసు.. నేను ఫిట్‌నెస్‌కి ఎంత ప్రాముఖ్యత ఇస్తానో. 'కబీర్ సింగ్'లోనూ షాహిద్ సిగిరెట్ తాగాడు. అతను పొగతాగడాన్ని ప్రోత్సహిస్తున్నట్టా? కానే కాదు. సినిమాలో స్మోక్ చేసినంత మాత్రాన అవి మా నిజజీవితంలో చేస్తామని కాదు. సినిమాకు, నిజజీవితానికి తేడాను అర్థం చేసుకోవాలి. విమర్శలకు రియాక్ట్ అయితే ప్రతీది పట్టించుకోవాలి. నాకంత ఆసక్తి లేదు. నా తల్లిదండ్రులు నన్ను అర్థం చేసుకోవడం ముఖ్యం'' అన్నారు రకుల్. నాగార్జున, రకుల్ జంటగా నటించిన 'మన్మథుడు 2' ఆగస్ట్ 9న రిలీజ్ కానుంది.

అనుష్క

నిశ్శబ్దాన్ని విందాం

దాదాపు పద్నాలుగేళ్ల క్రితం 'సూపర్' (2005) సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు అనుష్కా శెట్టి. ఆ తర్వాత 'విక్రమార్కుడు' (2006), 'లక్ష్యం' (2007), 'అరుంధతి' (2010), 'మిర్చి' (2013), 'బాహుబలి' (2017), 'రుద్రమదేవి', 'భాగమతి' (2018) వంటి సూపర్‌హిట్ సినిమాలతో ప్రేక్షకులతో సూపర్ హీరోయిన్ అనిపించుకున్నారు అనుష్క. ఆమె నటించిన తొలి సినిమా 'సూపర్' విడుదలై ఈ నెల 21తో 14 ఏళ్లు పూర్తి అవుతుంది. ఈ సందర్భంగా అనుష్క నటిస్తున్న తాజా చిత్రం 'నిశ్శబ్దం'లోని ఫస్ట్ లుక్‌ను ఈ ఆదివారం విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో బదిర యువతి (చెవిటి, మూగ) పాత్ర చేస్తున్నారు అనుష్క. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ యూఎస్‌లో జరుగుతోంది. హేమంత్ మధుకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మాధవన్, అంజలి, షాలినీ పాండే, సుబ్బరాజు, మైఖేల్ మ్యాడసన్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ఇంగ్లీష్, తమిళం, హిందీ భాషల్లో కూడా విడుదల చేయాలని చిత్రబృందం ప్లాన్ చేస్తోంది.

నేనంటే భయానికి భయం

శ్రీకాంత్

నా పేరే ఎందుకు?

రిలీజ్ కాని సినిమాలకు చెందిన క్లిప్పింగ్‌లు, స్టిల్స్ అప్పుడప్పుడు నెట్‌లో వైరల్ కావడం ఈ టెక్నాలజీ యుగంలో సాధారణ విషయమై పోయింది. హీరోయిన్ రాధికా ఆప్టే తాజాగా నటించిన 'ది వెడ్డింగ్ గెస్ట్' సినిమా రొమాంటిక్ సీన్ ఒకటి నెట్‌లో వైరల్‌గా మారింది. అది దేవ్ పటేల్, రాధికా ఆప్టే మధ్య సాగే శృంగార సన్నివేశం. ఈ వీడియోకి సంబంధించిన ఫొటోలు 'రాధికా ఆప్టే ఇన్ లీక్డ్ సెక్స్ సీన్' అని ఎక్కువగా నెట్‌లో తిరుగుతోంది. ఈ విషయంపై రాధికా ఆప్టే స్పందించారు. ''ది వెడ్డింగ్ గెస్ట్' సినిమాలో బోలెడన్ని రొమాంటిక్ సీన్స్ ఉన్నాయి. అందుకో హైలీ రొమాంటిక్ సీన్ ఒకటి లీకైంది. కానీ 'రాధికా ఆప్టే ఇన్ లీక్డ్ సెక్స్ సీన్' అని నా పేరుతోనే ఎందుకు? ఇది ప్రచారం అవుతుందో నాకు అర్థం కావడం లేదు. అందులో దేవ్ పటేల్ కూడా ఉన్నారు కదా. హీరో పేరుతో కాకుండా హీరోయిన్ పేరుతో ఎందుకు వైరల్ చేస్తున్నారు. సొసైటీలో ఉన్న సైకో మెంటాలిటీస్ వల్ల ఇలాంటివి జరుగుతున్నాయనిపిస్తోంది'' అన్నారు రాధిక. మూడేళ్ల క్రితం ఇలాంటి సమస్యనే ఎదుర్కొన్నారు రాధికా ఆప్టే. అప్పుడు లీకైన వీడియోలో నటుడు రాధికా ఆప్టేతో నటుడు ఆదిల్ హుస్సేన్ ఉన్నారు. అప్పుడు కూడా రాధికా ఇలానే స్పందించారు.

'నేనంటే భయానికే భయం.. నన్ను పట్టుకోవాలనుకోకు... పట్టుకుందామనుకున్నా అది నేనవను' అంటూ పోలీస్ అధికారి బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు ఓ కిల్లర్ వార్నింగ్ ఇస్తున్న డైలాగ్‌తో ప్రారంభమైన 'రాక్షసుడు' ట్రైలర్ ఉత్కంఠ రేకెత్తించేలా ఉంది. 'మనం వెతుకుతున్నవాడు రేపిస్టో, కిడ్నాపరో లేకపోతే వన్‌సైడ్ లవరో కాదు... పథకం ప్రకారం హత్యలు చేసే ఒక మతిస్థిమితం లేని వ్యక్తి', 'మనం ఊహించిన దానికంటే ఈ కేసులో ఏదో సీరియస్‌నెస్ ఉంది మేడమ్' అంటూ బెల్లంకొండ శ్రీనివాస్ చెప్పే డైలాగులు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి.

అభిషేక్ నామా, దువా కౌశిక్, బెల్లంకొండ సాయిశ్రీనివాస్, కోనేరు సత్యనారాయణ, రమేష్ వర్మ

బెల్లంకొండ శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా రమేష్ వర్మ పెన్మత్స దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాక్షసుడు'. ఎ హవీష్ లక్ష్మణ్ కోనేరు ప్రొడక్షన్స్ పతాకంపై కోనేరు సత్యనారాయణ నిర్మించిన ఈ సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా ఈ చిత్రాన్ని ఆగస్ట్ 2న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో 'రాక్షసుడు' ట్రైలర్‌ని విడుదల చేశారు. కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ– ''ఏడాది క్రితం నేను, రమేష్ వర్మ కలిసి చెన్నైలో తమిళ చిత్రం 'రాక్షసన్'ని చూశాం. బాగా నచ్చడంతో రీమేక్ చేశాం. హీరోగా నలుగురైదుగురు పేర్లు అనుకుని, సాయిశ్రీనివాస్‌ను తీసుకున్నాం. పోలీసాఫీసర్ పాత్రలో బాగా నటించాడు. ఒక మంచి సినిమా తీశామనే తృప్తి కలిగింది'' అన్నారు. ''సాయిశ్రీనివాస్ కెరీర్‌లో ఈ సినిమా చాలా పెద్ద హిట్ అవుతుంది'' అన్నారు అభిషేక్ నామా. ''డైరెక్టర్‌గా చాన్స్ ఇచ్చిన కోనేరు సత్యనారాయణగారికి, బెల్లంకొండ సురేశ్‌గారికి థ్యాంక్స్'' అన్నారు రమేశ్ వర్మ. ''కవచం' సమయంలో రమేష్ వర్మ ఈ రీమేక్ గురించి చెప్పారు. మళ్లీ పోలీస్ పాత్రే అనుకుని ముందు ఆసక్తి చూపలేదు. కానీ, తమిళ సినిమా చూశాక అద్భుతంగా అనిపించింది. ఇలాంటి సినిమాను మిస్ చేసుకోకూడదనిపించి చేశా. అద్భుతమైన థ్రిల్లర్. కోనేరు సత్యనారాయణ లాంటి నిర్మాత ఈ చిత్రానికి లభించడం అదృష్టం. ఈ బ్యానర్‌లో తొలి చిత్రం నాదే కావడం హ్యాపీ. రమేష్ వర్మతో సహా అందరూ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు'' అన్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. నటుడు కాశీ విశ్వనాథ్, బేబీ దువా కౌశిక్, కెమెరామేన్ వెంకట్ సి. దిలీప్, ఎడిటర్ అమర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచీర సస్పెన్స్

కార్యక్రమం

శ్రీకాంత్ కీలక పాత్రలో బేబి సాయి తేజస్విని, కారుణ్య చౌదరి, రఘుబాబు ముఖ్య తారలుగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఎర్రచీర'. సత్య సుమన్‌బాబు దర్శకత్వంలో బేబీ ఢమరి సమర్పణలో శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతోంది. సత్యసుమన్ బాబు మాట్లాడుతూ– ''హారర్, యాక్షన్ సస్పెన్స్ ప్రధానంగా రూపొందుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. ప్రస్తుతం హైదరాబాద్‌లో హీరోయిన్ ప్రియాంక అగస్టీన్–రఘుబాబు– ఫిష్ వెంకట్‌లపై ప్రత్యేక పాట చిత్రీకరిస్తున్నాం. ఇందులో చేజింగ్ సీన్స్, హారర్, కామెడీ హైలైట్‌గా నిలుస్తాయి. త్వరలో క్లయిమాక్స్ చిత్రీకరణ పూర్తి చేయనున్నాం. మరోవైపు నిర్మాణానంతర పనులు కూడా జరుగుతున్నాయి. శ్రీకాంత్, కమల్ కామరాజు, అజయ్, శ్రీరాం, అలీ పాత్రలు ఆకట్టుకుంటాయి'' అన్నారు. ''ఆగస్టు చివరి నాటికి అన్ని పనులు పూర్తి చేసి, సెప్టెంబర్ 20న సినిమా విడుదల చేస్తాం'' అని ఎగ్జిక్యూటివ్ నిర్మాత తోట సతీష్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: చందు.

కుశాలీ, మాధవన్

కుశాలీ ఖుషీ

హీరోయిన్‌గా తొలి అవకాశం వస్తే ఏ అమ్మాయి అయినా ఎగిరి గంతేస్తుంది. అదీ మాధవన్ లాంటి నటుడు హీరో అంటే ఇక ఆ అమ్మాయి ఆనందం రెట్టింపు కావడంలో ఆశ్చర్యం లేదు. కానీ కుశాలీ కుమార్ మాత్రం భయపడుతున్నారు. అశ్విన్ నీల్ మణి దర్శకుడిగా పరిచయం అవుతూ బాలీవుడ్‌లో 'దహీ చీనీ' అనే చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రంలో మాధవన్ హీరోగా నటించనున్నారు. టీ–సీరిస్ వ్యవస్థాపకుడు, మ్యూజిక్ మొఘల్ గుల్షాన్ కుమార్ రెండో కుమార్తె, నిర్మాత భూషణ్ కుమార్ చెల్లి కుశాలీ కుమార్ ఈ సినిమాతో బాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వనున్నారు. ''హీరోయిన్‌గా నా ప్రయాణాన్ని మొదలుపెట్టడానికి ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నాను. కానీ మాధవన్ లాంటి మంచి యాక్టర్‌తో కలిసి నటించాలంటే మాత్రం భయంగా ఉంది. అయితే బాగా కష్టపడి నా వంతు ప్రయత్నం చేస్తాను'' అని చెప్పుకొచ్చారు కుశాలీ. ఈ సినిమా చిత్రీకరణ వచ్చే నెలలో ప్రారంభం కానుంది.

ఫ్యాషన్

చోకర్ చోలీ

క్లాసీగా ఉండాలి
కలర్‌ఫుల్‌గా ఉండాలి
కంఠానికి పట్టేసినా
ఆభరణంలా నిలవాలి
కట్టు.. కట్
కంటికింపుగా ఉండాలి.
వెస్ట్.. ఈస్ట్ ..
చోకర్ ద బెస్ట్
అనిపించాలి.

నిర్వహణ:
నిర్మలారెడ్డి

వెస్టన్ గౌన్‌లకు మనవైన ఫ్రాక్‌లకూ నెక్ స్టైల్ ఒకటే 'చోకర్' డిజైన్. మెడను హత్తుకునేలా.. హారంలా అమరిన ఈ నెక్ స్టైల్ నేటితరాన్ని అమితంగా ఆకట్టుకుంటోంది.

చోకర్ నెక్ ఓ ఆభరణం కాబట్టి మెడలో మరే హారాలు ఈ స్టైల్ బ్లౌజ్ ధరించినప్పుడు అక్కర్లేదు.

చీరకట్టు హైలైట్ కావాలంటే అందులో డిజైనర్ బ్లౌజ్ తప్పనిసరి. ఎంబ్రాయిడరీతో పని లేకుండా చిన్నపాటి మార్పుతో సంప్రదాయ చీరకూ స్టైలిష్ మెరుగులు అద్దవచ్చు.

వెస్టన్ టాప్స్‌కి సింగిల్ షోల్డర్, చోకర్ నెక్ మనకు తెలిసినవే. ఇవే ఇప్పుడు మన సంప్రదాయ బ్లౌజ్‌లకూ నప్పింది. లెహంగా మీదకు ధరించిన చోకర్ నెక్ బ్లౌజ్ ప్రత్యేకతను చూపుతుంది.

పట్టు చీర మీదకు ధరించే బ్లౌజ్ ఎంబ్రాయిడరీ చేసినదై ఉండాలి, లేదంటే బ్లౌజ్ డిజైన్‌లో ప్రత్యేకత ఉండాలి. సింపుల్ జాకెట్ అయినా చోకర్ నెక్‌తో పట్టీలాంటి భాగానికి ఎంబ్రాయిడరీ చేయించుకుంటే మరింత స్పెషల్‌గా కనిపిస్తోంది.

మెడ చుట్టూతా గొంతుకు పట్టినట్టు అతి తగ్గరగా ఉండేది చోకర్. మఖమల్, ప్లాస్టిక్, పూసలు, లెదర్‌తోనే కాదు బంగారు, వెండి, ప్లాటినమ్ లోహాలతో ఇలా రకరకాల మెటీరియల్స్‌తో చోకర్ ఆభరణాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. క్రీపూర్వం 2500 ఏళ్ల క్రితం కంఠానికి సుమేరియన్ కళాకారులు ఆభరణాన్ని తయారు చేసినట్టు చరిత్ర చెబుతోంది. ప్రపంచ నాగరికతలో ముందున్న ప్రాచీన ఈజిప్టులో చోకర్స్ ఉన్నట్టు చరిత్రకారులు కనుగొన్నారు. అప్పట్లో దీనిని 'తాల్‌ముడ్' అని పిలిచేవారని, మహిళ అలంకరణ వస్తువులలో ఇదీ ఒకటి అని పేర్కొన్నారు. అయితే, డ్రెస్ డిజైనర్లు బ్లౌజ్ డిజైన్స్‌లో కంఠానికి హత్తుకుపోయేలా చోకర్ డిజైన్‌ని తీసుకువచ్చారు. దీంతో చోకర్ నెక్ డ్రెస్ మరింత స్టైలిష్‌గా రూపుకట్టింది.

వాస్క్యులార్ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

హార్ట్ ఎటాక్ లాంటిదే ఈ 'లెగ్' అటాక్!

నా వయసు 60 ఏళ్లు. గతంలో పొగతాగే అలవాటు ఉండేది. నడుస్తున్నప్పుడు నాకు కాలునొప్పి వస్తోంది. పిక్కలు, తొడలు, తుంటిభాగంలోనూ నొప్పిగా ఉంటోంది. మెట్లు ఎక్కుతున్నప్పుడు వచ్చే నొప్పి, ఆగితే తగ్గుతోంది. నొప్పి సన్నగా, తిమ్మిరి ఎక్కినట్లుగా ఉంటోంది. కాళ్ల కండరాలు అలసిపోయినట్లుగా ఫీలవుతున్నాను. పిరుదులు కూడా నొప్పిగా ఉంటున్నాయి. నా సమస్యకు కారణం తెలపండి.

–ఎమ్. రమణరావు, నెల్లూరు

మీరు చెప్పిన లక్షణాలను బట్టి మీకు కాలిలోని రక్తనాళాలు పూడిపోయినట్లుగా అనిపిస్తోంది. గుండెకు రక్తసరఫరా చేసే రక్తనాళాలు బ్లాక్ అయిన గుండెపోటు వచ్చినట్లే... కాలిలో కూడా అదే పరిణామం సంభవించే అవకాశం ఉంది. గుండెపోటులో ఉంటే ప్రమాదం లాగే ఈ లెగ్ అటాక్స్ ప్రమాదకరం. కాలిపైన ఎంతకూ నయంకాని అల్సర్స్ వచ్చి, చివరకు కాలు తీసేయాల్సిన పరిస్థితి దారితీయవచ్చు. లెగ్ అటాక్స్‌లో ఉన్న మరో ప్రమాదకరమైన అంశం... వీటిని చివరిదశ వరకూ గుర్తించడం కష్టం. అంతకుమించి ఈ వ్యాధి గురించి సాధారణ ప్రజల్లో అవగాహన చాలా తక్కువ. డయాబెటిక్ వ్యాధిగ్రస్తులు, 50 ఏళ్లు పైబడిన వారు, స్థూలకాయులు, రక్తపోటు ఎక్కువగా ఉన్నవారు, పొగతాగే వారు ఈ లెగ్ అటాక్స్ గురయ్యే అవకాశాలు ఎక్కువ. మీరు పేర్కొన్న లక్షణాలతో పాటు కాళ్లు లేదా పాదాలు క్రమంగా పాలిపోయినట్లుగా ఉండటం, కాళ్లు నీలిరంగులోకి లేదా ముదురు ఎరుపు రంగులోకి మారడం వంటివీ చోటుచేసుకుంటాయి. నడవకుండా విశ్రాంతిగా ఉన్నప్పుడు కూడా మీ లక్షణాల తీవ్రత ఎక్కువగా ఉంటే వ్యాధి తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నట్లు గ్రహించాలి. ఈ రక్తనాళాల జబ్బును నిర్ధారణ చేయడానికి యాంజియోగ్రామ్ బాగా ఉపయోగపడుతుంది. అయితే నిర్ధారణలో మరింత కచ్చితత్వం కోసం అల్ట్రాసోనోగ్రఫీ, ఎమ్మారైలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

ఇలా కాలి రక్తనాళాల్లో పూడిక పేరుకుందని తెలిసినప్పుడు ప్రాథమిక దశలో సరైన మందులు, జీవనశైలిలో మార్పుల ద్వారా దీనికి చికిత్స చేస్తారు. దీనికి ఎంత త్వరగా చికిత్స చేయిస్తే అంత మంచిది. ఎందుకంటే వ్యాధి ముదిరాక డాక్టర్‌ను సంప్రదిస్తే ఒక్కోసారి కాలిని తొలగించే ప్రమాదమూ ఉండవచ్చు. అందుకే మీలో కనిపించిన లక్షణాలను గుర్తిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఇప్పుడు దీనికి బెలూన్ యాంజియోప్లాస్టీ, స్టెంట్ వంటి సమర్థమైన, సురక్షితమైన చికిత్స ప్రక్రియలు అందుబాటులోకి వచ్చాయి.

వేరికోస్ వెయిన్స్ విషయంలో నిర్లక్ష్యం వద్దు

నా వయసు 47 ఏళ్లు. మోకాలి కింది భాగం నుంచి పాదాల వరకు ఉన్న రక్తనాళాలు ఉబ్బినట్లుగా కనిపిస్తున్నాయి. అవి ఎర్రటి, నీలం రంగులో ఉన్నాయి. వాటి వల్ల నాకు ఎలాంటి నొప్పి కలగడం లేదు. అయితే చూడటానికి ఎబ్బెట్టుగా, ఇబ్బందికరంగా ఉన్నాయి. దయచేసి నా సమస్యకు తగిన పరిష్కారం చూపగలరు.

- ఎల్. రవికుమార్, నిజామాబాద్

సాధారణంగా మనిషి శరీరాన్నంతటికీ గుండె, రక్తనాళాల ద్వారా రక్తాన్ని సరఫరా చేస్తుంది. మళ్లీ అవే రక్తనాళాల ద్వారా రక్తం గుండెకు చేరుతుంది. అయితే మిగతా భాగాల విషయంలో ఎలా ఉన్నప్పటికీ కాళ్ల విషయానికి వస్తే భూమి ఆకర్షణ శక్తి వల్ల ఈ రక్తప్రసరణ ప్రక్రియ కాస్త ఆలస్యమవుతుంది. అంతేకాకుండా వయసు పైబడటం, కుటుంబ నేపథ్యం, స్థూలకాయం, కూర్చొని పనిచేయటం, అదేపనిగా నిలబడి పనిచేయడం, బరువైన వృత్తిపనులు చేయడంతో జరిగినప్పుడు రక్తప్రసరణ ఆలస్యం అవుతుంది. మహిళల్లో గర్భం దాల్చడం, హార్మోన్లు ప్రభావం వంటి అంశాలు రక్తప్రసరణ ఆలస్యమయ్యేలా చేయవచ్చు. శరీరంలో ఏ భాగానికైనా ఈ సమస్య ఏర్పడవచ్చు. కానీ సాధారణంగా మోకాలి కింది భాగం నుంచి పాదాల వరకు ఇది ఇబ్బంది పెడుతుంది. ఈ సమస్య ఉన్నప్పుడు మీ ఫ్యామిలీ డాక్టర్‌ను కలిసి, ఆయన సూచనల మేరకు మీ కాలి దగ్గర ఒక ఎత్తయిన దిండు వేసుకుంటే సరిపోతుంది. అలాకాకుండా మీ కాలి రక్తనాళాల్లో ఏవైనా అడ్డంకులు ఏర్పడినా లేదా రక్తనాళాలు ఉబ్బి గుండెకు చేరాల్సిన రక్తసరఫరాను అది అడ్డుకుంటుంటే అప్పుడు మీరు 'వేరికోస్ వెయిన్స్' అనే కండిషన్ బారిన పడ్డట్లు చెప్పవచ్చు. మీరు మీ డాక్టర్‌ను సంప్రదిస్తే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయిస్తారు. ఒక వేళ మీరు 'వేరికోస్ వెయిన్స్' బారిన పడ్డా కంగారు పడాల్సిన అవసరం లేదు. మీరు చెప్పిన వివరాల ప్రకారం మీ సమస్య మొదటి దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఆధునిక వైద్య చికిత్సల్లో వచ్చిన పురోగతి వల్ల మీ సమస్యను పూర్తిగా నయం చేయవచ్చు. సర్జరీ వంటి ప్రక్రియలకు ఖర్చుచేయడం అనవసరం అనే అభిప్రాయంతో మీ సమస్య తీవ్రతను పెంచుకోవద్దు. అలాగే నొప్పి, దురద, వాపులాంటివి లేవనుకొని నిర్లక్ష్యం చేయకూడదు. మీరు వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తగిన చికిత్స చేయించుకోండి.

డయాబెటిక్ ఫుట్ అంటే?

నా వయసు 59. గత పదిహేనేళ్లుగా షుగర్‌వ్యాధితో బాధపడుతున్నాను. కొన్ని నెలల నుంచి నా కాళ్లు తరచూ తిమ్మిరెక్కుతున్నాయి. కాళ్లలో మంటలుగా అనిపిస్తున్నాయి. ఒక రోజు మరుగుతున్న నీళ్లు కాళ్ల మీద పడి బొబ్బలు కూడా వచ్చాయి. కానీ నాకు బాధ తెలియలేదు. నేను ఆందోళనతో డాక్టర్‌ను కలిశాను. డయాబెటిస్ ఫుట్ అని చెప్పి చికిత్స అందించారు. నాకు డయాబెటిస్ ఉందిగానీ... కాళ్లకు ప్రత్యేకంగా ఈ డయాబెటిస్ ఏమిటో నాకు అర్థం కావడం లేదు. అసలు డయాబెటిక్ ఫుట్ అంటే ఏమిటి? దయచేసి వివరంగా చెప్పండి.

– జి. ప్రభావతి, నల్లగొండ

డయాబెటిస్ ఫుట్ అంటే విడిగా కాళ్లకు డయాబెటిస్ సోకడం కాదు. డయాబెటిస్‌తో బాధపడే చాలామందిలో ఎదురయ్యే ప్రధానసమస్యల్లో కాళ్లపై పుండ్లు ఏర్పడే డయాబెటిక్ ఫుట్ ముఖ్యమైనది. దాదాపు ఆరోవంతు మంది వ్యాధిగ్రస్తుల్లో ఇది కనిపిస్తుంది. రోడ్డు ప్రమాదాల్లో కాకుండా... దేశవ్యాప్తంగా కాళ్లను తొలగించే పరిస్థితుల్లో 50 శాతానికి పైగా ఈ డయాబెటిక్ ఫుట్ కారణంగానే చోటుచేసుకుంటున్నాయి. ఇక డయాబెటిస్ సమస్య తీవ్రమై కాలు తొలగించాల్సి వచ్చిన వారిలోనూ 40 శాతం మందిలో ఆ తర్వాత మూడేళ్లకే రెండో కాలు కూడా తొలగించాల్సి వస్తోంది. అయితే ఇలాంటి రోగులకు ఆశాజనకం, ఉపశమనం కలిగించే విషయం ఏమిటంటే... ఇలా కాలిని తొలగించాల్సిన కేసుల్లో కాస్త ముందుజాగ్రత్తగా వ్యవహరిస్తే 85 శాతం మందిలో ఈ ప్రమాదాన్ని నివారించవచ్చు.

డయాబెటిస్ కారణంగా వచ్చే ఈ పరిస్థితి గురించి తగిన అవగాహన లేకపోవడమే మనలో కాలు కోల్పోవడానికి ఒక ప్రధాన సమస్య. అందుకే డయాబెటిస్‌పై తగిన అవగాహన పెంచుకోవాలి.

డయాబెటిస్ రోగులు... తమ కాలు తిమ్మిరిగా ఉండటం, నొప్పినీ... వేడి–చల్లదనాలను కాలు గుర్తించలేకపోవడం, కాళ్లమంటలు, కొద్దిపాటి బరువును కూడా భరించలేకపోవడం (పలుచని బెడ్‌షీట్ కాలి మీద పడ్డా అది చాలా బరువుగా అనిపించడం), కాలి కండరాలు బలహీనపడటం వంటి లక్షణాలతో డయాబెటిక్ ఫుట్‌ను ముందుగా

గుర్తించవచ్చు. ఈ కారణాల వల్ల కాలికి దెబ్బతగిలినా రోగికి అది తెలియదు. మరోవైపు ఆ గాయం మానకుండా పెద్దదవుతుంది. పుండు పడుతుంది. డయాబెటిస్ వల్ల కాలికి జరిగే రక్తసరఫరాలో కూడా సమస్యలు ఎదురవుతాయి. తగినంత రక్తం సరఫరా కాకపోవడంతో గాయాలు పుండ్లు త్వరగా మానవు. అది గ్యాంగ్రీన్‌గా మారే ప్రమాదం పొంచి ఉంటుంది. కొద్దిపాటి జాగ్రత్తలతో డయాబెటిక్ ఫుట్ నుంచి కాళ్లూ, పాదాలను కాపాడుకోవచ్చు. వెచ్చని నీళ్లు, సబ్బు ఉపయోగిస్తూ ప్రతి రోజూ పాదాలను శుభ్రంగా కడుక్కోవాలి. పాదాలను నీళ్లలో నాన్చి ఉంచకూడదు. వేళ్ల మధ్యభాగాలతో సహా మొత్తం కాలు, పాదాన్ని తుడిచి పొడిగా ఉంచుకోవాలి. కాళ్లు, పాదాలపై పుండ్లు, బొబ్బలు, కమిలిన ప్రదేశాలు ఏమైనా ఏర్పడ్డాయా అని ప్రతి రోజూ చూసుకుంటూ ఉండాలి. కాళ్లల్లో రక్తప్రసరణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే ఈ విషయంలో మరింత జాగ్రత్త అవసరం. బయటే కాకుండా ఇంట్లో కూడా పాదరక్షలు ధరించి తిరగాలి. వీలైనంతవరకు సాక్స్ వేసుకోకపోవడమే మంచిది. వేళ్లను కప్పి ఉంచే పాదరక్షలను ధరించి తిరగాలి. మార్నింగ్ వాక్, ఇతర సమయాల్లో షూస్ ధరించేట్లయితే కాన్వాస్‌తో తయారుచేసిన వాటినే ఎంచుకోవాలి.



డాక్టర్ దేవేందర్ సింగ్,
సీనియర్ వాస్క్యులార్ అండ్ ఎండోవాస్క్యులార్ సర్జన్,
యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ,
హైదరాబాద్

పరి పరిశోధన

గుండెజబ్బును సూచించే రక్తపోటు అంకెలు!

అధిక రక్తపోటు గుండెజబ్బులకు దారితీస్తుందని మనం చాలాకాలంగా వింటూనే ఉన్నాం. రక్తపోటును కొలిచేందుకు ఉపయోగించే రెండు అంకెలు (డయాస్టోలిక్, సిస్టోలిక్) ద్వారా కూడా గుండెపోటు, జబ్బులను ముందుగానే గుర్తించవచ్చునని కైసర్ పర్మనెంటే అనే సంస్థ జరిపిన తాజా అధ్యయనం చెబుతోంది. గుండె ఎంత శక్తితో రక్తాన్ని ధమనుల్లోకి పంపుతుందో తెలిపేది సిస్టోలిక్ రీడింగ్ కాగా... లబ్ డబ్‌ల మధ్య గుండె విశ్రాంతి తీసుకునేటప్పుడు ధమనులపై ఉన్న ఒత్తిడిని డయాస్టోలిక్ రీడింగ్ సూచిస్తుంది. న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన వివరాల ప్రకారం.. గుండెపోటు ప్రమాదాన్ని అంచనా వేసేటప్పుడు వైద్యులు దశాబ్దాలుగా సిస్టోలిక్ అంకెపైనే ఎక్కువ ఆధారపడుతున్నారని.. డయాస్టోలిక్ అంకెను పరిగణించాల్సిన అవసరం లేదని కూడా చెబుతారని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త అలెగ్జాండర్ సి ఫ్లింట్ తెలిపారు. తాజా అధ్యయనం మాత్రం రెండింటినీ పరిగణనలోకి తీసుకోవాలని చెబుతోందని చెప్పారు. తాము దాదాపు మూడు కోట్ల అరవై లక్షల మంది తాలూకూ రక్తపోటు వివరాలను పరిశీలించి ఈ అంచనాకు వచ్చామని.. 20007 –16 మధ్యకాలంలో ఈ వివరాలను తీసుకోగా డయాస్టోలిక్ అంకెకూ గుండెపోటు, జబ్బులను అంచనా వేయడంలో తగిన ప్రాధాన్యమున్నట్లు తెలిసిందని చెప్పారు.

దోమల నిర్మూలనకు కొత్త మార్గం

వ్యాధులను మోసుకొచ్చి అందించే దోమలను నియంత్రించేందుకు చైనా శాస్త్రవేత్తలు మరో కొత్త, వినూత్నమైన పద్ధతిని ఆవిష్కరించారు. చైనాలోని రెండు ప్రాంతాల్లో జరిగిన ప్రయోగాల్లో తాము దోమలను విజయవంతంగా నియంత్రించగలిగామని జార్జ్‌టౌన్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు తెలిపారు. రేడియోధార్మికతతో పాటు వూల్‌బాకియా అనే బ్యాక్టీరియా రెండింటినీ ఉపయోగించడం ద్వారా తాము ఈ ఘనతను సాధించగలిగామని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త పీటర్ ఆర్మ్‌బ్రస్టర్ తెలిపారు. జికా, డెంగీ వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణమైన ఆసియన్ టైగర్ దోమల నిర్మూలన కోసం తాము ఈ ప్రయోగాలు చేపట్టామని.. రేడియోధార్మికత ద్వారా దోమలు నిస్సంతులుగా మారితే.. వూల్‌బాకియా బ్యాక్టీరియా దోమ గుడ్లను నాశనం చేస్తుందని వివరించారు. రెండేళ్లపాటు తాము గువాంగ్ ఝూ ప్రాంతంలోని రెండు ద్వీపాల్లో ఈ పద్ధతులను పరిశీలించి చూశామని చెప్పారు. దోమ గుడ్లలో 94 శాతం ఎదగలేకపోయాయని తెలిపారు. వ్యాధి వ్యాప్తికి కారణమైన ఆడ దోమల సంఖ్య కూడా 83 నుంచి 94 శాతం వరకూ తగ్గిపోయినట్లు తమ పరిశీలనల్లో తేలిందని వివరించారు. మగ దోమలను రేడియోధార్మికత ద్వారా వంధ్యత్వం వచ్చేలా చేయడం.. ఆ దోమలను ప్రకతిలోకి వదలడం ఈ పద్ధతిలో ముఖ్యమైన అంశమని అన్నారు. గతంలోనూ ఈ పద్ధతిని ఉపయోగించినప్పటికీ తాజాగా తాము బ్యాక్టీరియాతో కూడిన దోమలను ఉపయోగించామని.. ఫలితంగా ఆడదోమల గుడ్లు బలహీనంగా మారాయని వివరించారు.

స్క్రీన్ టెస్ట్

3 వెంకటేశ్ హీరోగా నటించిన 'నువ్వు నాకు నచ్చావ్' సినిమాలో హీరోయిన్ ఆర్తి అగర్వాల్‌కు అత్త పాత్రలో నటించిన ప్రముఖ నటి ఎవరో తెలుసా?
ఎ) విజయశాంతి బి) రమ్యకృష్ణ
సి) జయసుధ డి) సుహాసిని

4 అల్లు అర్జున్ తాను చేసిన దర్శకుల్లో ఐదుగురు దర్శకులతో రెండు సార్లు సినిమాలు చేశారు. వారిలో ఇద్దరితో మూడోసారి చేయటానికి రెడీ అయ్యారు బన్నీ. ఆ దర్శకుల్లో ఒకరు త్రివిక్రమ్, రెండో దర్శకుడు ఎవరు?

ఎ) సుకుమార్
బి) బోయపాటి శ్రీను
సి) వీవీ వినాయక్
డి) పూరీ జగన్నాథ్

5 మహేశ్‌బాబు చేస్తున్న సినిమా పేరు 'సరిలేరు నీకెవ్వరు'. దర్శకుడు అనిల్ రావిపూడి. ప్రస్తుతం ఈ సినిమా కోసం ఆ చిత్రబృందం భారతదేశంలోని ఏ ప్రాంతానికి వెళ్లారో తెలుసా?
ఎ) ఊటీ బి) రామేశ్వరం
సి) ముంబాయి
డి) కాశ్మీర్

20 నాగార్జున హీరోగా గతంలో 'కిల్లర్' అనే సినిమా వచ్చింది. ఆ సినిమా పేరుతో మళ్లీ ఈ మధ్యే ఓ డబ్బింగ్ సినిమా విడుదలైంది. ఆ డబ్బింగ్ సినిమాలో హీరో ఎవరో తెలుసా?
ఎ) ఆర్య బి) విశాల్
సి) ధనుశ్
డి) విజయ్ ఆంటోని

17 మహేశ్‌బాబు హీరోగా నటించిన 'టక్కరి దొంగ' చిత్రానికి దర్శకుడు జయంత్ సి. పరాన్జీ. ఆ చిత్రసంగీత దర్శకుడు ఎవరు?
ఎ) ఎ.ఆర్. రెహమాన్ బి) మణిశర్మ
సి) దేవిశ్రీ ప్రసాద్
డి) హారిస్ జయరాజ్

10 నాగార్జున హీరోగా నటించిన 'నిన్నే పెళ్లాడతా' చిత్రంలోని 'ఎటో వెళ్లిపోయింది మనసు, ఇలా ఒంటరయ్యింది వయసు..' పాట రచయితెవరు?
ఎ) సుద్దాల అశోక్ తేజ
బి) వేటూరి
సి) భువనచంద్ర
డి) సీతారామశాస్త్రి

2 నాగార్జున హీరోగా చేస్తున్న చిత్రం 'మన్మథుడు 2' వచ్చే నెల 9న విడుదల కానుంది. గతంలో నాగార్జున నటించిన 'మన్మథుడు'కు సీక్వెల్ ఇది. ఆ సినిమా విడుదలై ఎన్నేళ్ల యిందో తెలుసా?
ఎ) 15 బి) 23
సి) 17 డి) 19

7 'నేనే నానీనే నీ నా నానీనే' పాట నాని, సమంత జంటగా నటించిన 'ఈగ' చిత్రంలోనిది. ఈ పాట రచయితెవరో కనుక్కోండి?
ఎ) ఎస్.ఎస్. రాజమౌళి
బి) యం.యం. కీరవాణి
సి) శివశక్తి దత్తా
డి) విజయేంద్ర ప్రసాద్

6 రీసెంట్‌గా విడుదలైన 'ఓ బేబి' చిత్రంలో లీడ్ హీరోయిన్‌గా నటించారు సమంత. ఆ చిత్రంలో ఆమె 70 ఏళ్ల వృద్ధురాలి నుండి 25 ఏళ్ల యువతిగా మారతారు. 70 ఏళ్ల పాత్రలో నటించిన ప్రముఖ నటి ఎవరో తెలుసా?
ఎ) కాంచన బి) లక్ష్మీ సి) జయచిత్ర డి) జమున

8 'పాండురంగ మహత్యం' చిత్రంలో పాండురంగని పాత్రలో నటించారు యన్టీఆర్. ఆ చిత్రంలో బాలనటిగా బాలకృష్ణుని పాత్రలో నటించిన ప్రముఖ హీరోయిన్ ఎవరో తెలుసా?
ఎ) శ్రీదేవి బి) విజయ నిర్మల
సి) జయలలిత డి) రోజా రమణి

15 అలీ హీరోగా నటించిన 'ఆషాడం పెళ్లికొడుకు' చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమైనది ఎవరో గుర్తుందా?
ఎ) శ్రీనివాసరెడ్డి
బి) శ్రీను వైట్ల
సి) ఏయస్ రవికుమార్ చౌదరి
డి) యస్వీ కృష్ణారెడ్డి

14 ఇప్పటివరకూ శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన అన్ని చిత్రాలకు కెమెరామెన్ ఒక్కరే. ఆయన పేరేంటి?
ఎ) చోటా.కె. నాయుడు
బి) శ్యామ్ కె. నాయుడు
సి) సెంథిల్ డి) విజయ్ సి. కుమార్

16 పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన 'ఇద్దరమ్మాయిలతో' చిత్రంలో ఓ హీరోయిన్‌గా క్యాథరిన్ నటించారు. అల్లు అర్జున్ కథానాయకునిగా నటించిన ఆ చిత్రంలో మరో హీరోయిన్ ఎవరు?

ఎ) హన్సిక బి) షీలా
సి) అమలాపాల్
డి) పూజా హెగ్డే

18 రానా, నయనతార జంటగా నటించిన 'కృష్ణం వందే జగద్గురుం' చిత్రానికి దర్శకుడెవరో తెలుసా?
ఎ) శ్రీవాస్ బి) క్రిష్
సి) శేఖర్ కమ్ముల డి) ప్రకాశ్ తోలేటి

1 చిరంజీవి హీరోగా నటించిన 'రాజా విక్రమార్క' చిత్రంలో ఇద్దరు హీరోయిన్‌లు. ఓ హీరోయిన్ రాధిక. మరో హీరోయిన్ ఎవరో తెలుసా?
ఎ) రాధ బి) భానుప్రియ
సి) అమల డి) నగ్మా

9 ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో కైకాల సత్యనారాయణ మెయిన్ లీడ్‌లో నటించిన చిత్రం పేరేంటో గుర్తుందా?
ఎ) యమలీల బి) టాప్ హీరో
సి) ఘటోత్కచుడు డి) మాయలోడు

12 ప్రభాస్ హీరోగా తెరకెక్కిన 'సాహో' చిత్రానికి దర్శకుడు సుజిత్. ఆ దర్శకుడి మొదటి సినిమా హీరో ఎవరో తెలుసా?
ఎ) నాగార్జున
బి) శర్వానంద్
సి) గోపీచంద్
డి) నాగచైతన్య

11 అఖిల్ హీరోగా మూడు చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం తను చేస్తున్న నాలుగో చిత్రానికి దర్శకుడెవరో తెలుసా?
ఎ) అనిల్ రావిపూడి బి) వెంకీ అట్లూరి
సి) 'బొమ్మరిల్లు' భాస్కర్
డి) విక్రమ్ కె. కుమార్

19 రామ్ హీరోగా నటించిన 'ఇస్మార్ట్ శంకర్' చిత్రంలో ఇద్దరు హీరోయిన్‌లు. నిధి అగర్వాల్ ఓ హీరోయిన్‌గా నటించారు. మరో హీరోయిన్ ఎవరు?
ఎ) అనుపమా పరమేశ్వరన్ బి) ఈషా రెబ్బా
సి) నభా నటేశ్ డి) కీర్తీ సురేశ్

13 ఆది సాయికుమార్ హీరోగా నటించిన చిత్రం 'రఫ్'. ఆ చిత్రంలో ఆది సరసన హీరోయిన్‌గా నటించింది ఎవరో తెలుసా?
ఎ) రకుల్ ప్రీత్ సింగ్
బి) రాశీ ఖన్నా సి) రెజీనా
డి) క్యాథరిన్

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!

సమాధానాలు: 1) ఎ 2) ఎ 3) డి 4) ఎ 5) డి 6) బి 7) ఎ 8) ఎ 9) ఎ 10) డి 11) ఎ 12) బి 13) ఎ 14) డి 15) ఎ 16) ఎ 17) బి 18) బి 19) ఎ 20) డి

అడ్డంకులు మాయం!

ఐశ్వర్యా రాజేశ్

ప్రియా భవానిశంకర్

కమల్ హాసన్

ఆర్థికపరమైన సమస్యల వల్ల 'ఇండియన్ 2' సినిమా చిత్రీకరణకు బ్రేక్ పడిందనే వార్తలు ఆ మధ్యకాలంలో బాగానే వినిపించాయి. ఒక దశలో ఈ సినిమా ఆగిపోతుందనే పుకార్లు కూడా వచ్చాయి. కానీ 'ఇండియన్ 2' చిత్రీకరణకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయని కోలీవుడ్ తాజా సమాచారం. ఆగస్టు మూడో వారంలో ఈ సినిమా చిత్రీకరణ తిరిగి ప్రారంభం కానుందని తెలిసింది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో 'ఇండియన్ 2' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటించనున్నారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. ఈ సినిమా తాజా షెడ్యూల్ ఆగస్టు 19న మొదలు కానుందని చెన్నై కోడంబాక్కమ్ కబర్. ఈ సినిమాలో సిద్ధార్థ్‌తో పాటు కథానాయికలు ఐశ్వర్యా రాజేష్, ప్రియాభవాని శంకర్ కీలక పాత్రలు చేయనున్నారని సమాచారం. 1996లో కమల్‌హాసనే హీరోగా శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో భారతీయుడు) చిత్రానికి 'ఇండియన్ 2' సీక్వెల్ అనే విషయం తెలిసిందే. ఈ సంగతి ఇలా ఉంచితే... 2015లో దర్శక-నిర్మాతగా కమల్‌హాసన్ 'తలైవన్ ఇరుక్కిండ్రాన్' అనే సినిమాను అనౌన్స్ చేశారు. కారణాలు ఏవైనా ఈ సినిమా చిత్రీకరణ ఆగిపోయింది. 'ఇండియన్ 2'తో పాటు ఈ సినిమాను కూడా సెట్స్‌పైకి తీసుకువెళ్తున్నారు కమల్‌హాసన్. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్‌ను స్వరకర్తగా తీసుకున్నారు. 'ఇండియన్ 2' సినిమా నిర్మాణ బాధ్యతలు చేపట్టిన లైకా ప్రొడక్షన్స్ 'తలైవన్ ఇరుక్కిండ్రాన్ నిర్మాణంలోనూ భాగమవ్వడం విశేషం. ఇలా కామా పెట్టిన పాత ప్రాజెక్ట్స్‌ని కూడా ముగించే పనిలో ఉన్న కమల్ ఆగిపోయిన తన 'శభాష్ నాయుడు' చిత్రాన్ని కూడా సెట్స్ పైకి తీసుకు వెళ్లే ప్రయత్నాలు చేస్తారా? వేచి చూద్దాం.

ఎక్కడైనా ఒకేలా ఉంటా

రణ్‌వీర్ సింగ్

రణ్‌వీర్ సింగ్ అనగానే మనందరికీ అంతులేని ఎనర్జీ, విభిన్న వేషధారణ.. ఇవన్నీ గుర్తొస్తాయి. స్క్రీన్ మీద, మీడియా ముందు కనపడే సమయాల్లో రణ్‌వీర్ సింగ్ ఎలా ఉంటారో మనందరికీ తెలుసు. కానీ ఆఫ్‌స్క్రీన్ రణ్‌వీర్ ఎలా ఉంటాడు? కెమెరా ముందు విభిన్నంగా ఉండటం కేవలం మార్కెటింగ్ స్ట్రాటజీనా? విచిత్ర వేషధారణ అంతా ఆకట్టుకోవడానికేనా? ఇదే ప్రశ్నలను రణ్‌వీర్ ముందుంచితే ''నాది భిన్న మనస్తత్వం. మీరు అందరిలా ఉండరు అని ఎవరైనా నాతో చెబితే 'నాకు తెలుసు. ఇకపై కూడా అలానే ఉంటాను' అని బదులిస్తాను. నా చేష్టలు, నా అలవాట్లు, నా వైఖరి ఏంటో నా చిన్ననాటి మిత్రులకు తెలుసు. ఇవన్నీ నిన్నో మొన్నో పుట్టుకొచ్చినవి కాదు. అలాగే విభిన్నంగా ఉండే దుస్తులు ధరించడం చిన్నప్పటి నుంచి అలవాటే. ఇదంతా ఆడియన్స్ దృష్టిని ఆకర్షించడానికి అనే వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ఆన్‌స్క్రీన్ అయినా ఆఫ్‌స్క్రీన్ అయినా నేను ఒకేలా ఉంటాను. అందరూ నన్ను ఇలానే ఇష్టపడతారనుకుంటున్నాను. నన్ను నేను ఇలానే ఇష్టపడతాను'' అని చెప్పారు. ప్రస్తుతం '83' సినిమాతో బిజీగా ఉన్నారాయన.

నాన్నకు ప్రేమతో మిస్సయ్యాను

రిచర్డ్ ప్రసాద్

'స్వామి రారా, దోచెయ్, కొత్త జంట, బాబు బంగారం' వంటి చిత్రాలకు కెమెరామేన్‌గా మంచి మార్కులు అందుకున్నారు రిచర్డ్ ప్రసాద్. తాజాగా ఆయన ఛాయాగ్రాహకుడిగా చేసిన చిత్రం 'ఓ బేబీ'. సమంత లీడ్ రోల్‌లో నందినీ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 5న విడుదలైన విషయం తెలిసిందే. రిచర్డ్ మాట్లాడుతూ– ''స్టీవెన్ స్పీల్‌బర్గ్ సినిమాల స్ఫూర్తితో కెమెరామేన్ కావాలనుకున్నాను. విజువల్ కమ్యూనికేషన్స్‌లో డిగ్రీ చేశా. చెన్నై అడయార్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో మూడేళ్లు సినిమాటోగ్రఫీ చేశా. 'మనం' చిత్రానికి పి.ఎస్. వినోద్ వద్ద అసిస్టెంట్‌గా చేశాను. నా మిత్రుడైన రచయిత, దర్శకుడు కృష్ణచైతన్య వల్ల 'స్వామి రారా'కి కెమెరామేన్‌గా అవకాశం వచ్చింది. 'కొత్తజంట' చిత్రంలో విజువల్స్ బాగున్నాయని అల్లు అర్జున్‌గారు మెచ్చుకున్నారు. నాగచైతన్యగారి వల్లే 'ఓ బేబీ' సినిమా అవకాశం వచ్చింది. ఫొటోగ్రఫీ అన్నది కథపై ఆధిపత్యం చేయకూడదు. కథలో మిళితం కావాలి. 'ఓ బేబీ' ట్రైలర్ బాగుందని ప్రముఖ కెమెరామేన్ నీరవ్‌షా అభినందిస్తూ మెసేజ్ పంపడం హ్యాపీ. నందినీగారి ఆలోచనలను అర్థం చేసుకుని 'ఓ బేబీ'కి పనిచేశా.. అందుకే తన తర్వాతి చిత్రానికీ నన్నే కెమెరామేన్‌గా ఎంచుకున్నారామె. 'నాన్నకు ప్రేమతో' చిత్రానికి పనిచేసే చాన్స్ వచ్చింది. అయితే వీసా సమస్యతో చేయలేకపోయా. మరో రెండు పెద్దచిత్రాలు కూడా కొన్ని కారణాల వల్ల వదులుకోవాల్సి వచ్చింది. నన్ను సినిమాటోగ్రాఫర్‌గా చూడాలని మా అమ్మ కోరిక. అది తీరకుండానే ఆమె చనిపోవడం బాధాకరం'' అన్నారు.

వైజాగ్ : జగదాంబ - ఐనాక్స్ వరుణ్ - ఐనాక్స్ సిఎంఆర్ - ఐనాక్స్ చిత్రాలయ - ముక్తా ఎ2 సినిమాస్ - శరత్ - శ్రీవేంకటేశ్వర - కామేశ్వరి - లక్ష్మీనరసింహా | (రాజువాక) మోహినీ 35ఎంఎం - కన్య | విజయనగరం: ఐనాక్స్ ఎన్‌సిఎస్ మాల్ - రజని & శివరజని | నరసింహ (గోపాలపట్నం) | కన్య (నర్సిపట్నం) | సత్యనారాయణ మినీ (అనకాపల్లి) | సూర్యమహాల్ (శ్రీకాకుళం) | వెంకటేశ - (నర్సన్నపేట) | విజయవాడ: ఐనాక్స్ ఎల్ఇపిఎల్ - ఐనాక్స్ ఊర్వశి - సినీపోలిస్ - సినీపోలిస్ పవర్ వన్- క్యాపిటల్ సినిమాస్ - మీరజ్ - శాంతి ప్రశాంతి - పివిఆర్ సినిమాస్ - నవరంగ్ - అన్నపూర్ణ - యువరాజ్ | టిజిఆర్ (బొబ్బిలి) | టిజిఆర్ (పార్వతీపురం) | ఎస్‌టిజిఎల్ బాలాజి (శిలనాగారం) | ఎస్‌టిజిఎల్ బాలాజి (మధురవాడ) | ఎస్‌టిజిఎల్ బాలాజి (అచ్యుతాపురం) | గణేష్ (తగరపువలస) | ఐనాక్స్ ఎస్ఆర్ఎంటి - గీత్ - సత్యగౌరీ - పద్మప్రియా - చాణిక్య & చంద్రగుప్త (కాకినాడ) | సూర్య మినీ - అనుశ్రీ - గీత్ అప్పర - రాజ (రాజమండ్రి) | వెంకటపద్మావతి (అమలాపురం) | సత్యశ్రీ (మండపేట) | శ్రీ లలిత (పెద్దాపురం) | వేణుగోపాల్ (అక్కవరం) | పూర్ణ (పిఠాపురం) | గణేష్ (సామర్లకోట) | అన్నపూర్ణ (తాటిపాక) | రాజవాణి (జగ్గయ్యపేట) | సింధూరు (గుడివాడ) | రామ్‌రాజ్ (మచిలీపట్నం) | రవీంద్ర (పాయకాపురం) | తిరుమల (నూజివీడు) | శ్రీనివాస (ఉయ్యూరు) | వెంకటేశ్వర (కైకలూరు) | నటరాజ్ (జగ్గయ్యపేట) | స్వర్ణ సినిమ్యాక్స్ (ఇబ్రహీంపట్నం) | శ్రీనివాస (పోరంకి) | (ఏలూరు) అంజికా మినీ - క్రాంతి | (భీమవరం) ఎవిజ - కిశోర్ మినీ - నటరాజ్ | శ్రీగౌరీ (చింతలపూడి) | శ్రీచిత్ర (తణుకు) | లక్ష్మీనారాయణ (తాడేపల్లిగూడెం) | సౌభాగ్య (జంగారెడ్డిగూడెం) | గీత అన్నపూర్ణ (పాలకొల్లు) | వెంకటగంగారత్న (ఆకువీడు) | (గుంటూరు) జెఎల్ఇ సినిమాస్ - వి సెల్యూలాయిడ్ ప్లాటినో సినిమాస్ - ది సినిమా - భాస్కర్ ఎస్‌సిఎన్-1 (వైభవ్ సినిమాస్) - బాలీవుడ్ ఎ/సి - హాలీవుడ్ - సినిప్రైమ్ | (తెనాలి) లక్ష్మి కాంప్లెక్స్ - పెమ్మసాని | సాయి కార్తిక్ (చిలకలూరిపేట) | విజేత (నర్సరావుపేట) | (ఒంగోలు) గోరింట్ల మల్టిప్లెక్స్ - ఎస్‌సిఎన్-1 - కార్నివాల్ రవి ప్రియా - కృష్ణా | గోపాలకృష్ణ (మంగళగిరి) | బసవేశ్వర (రేపల్లె) | శ్రీనివాస (సత్తెనపల్లి) | (నెల్లూరు) బి సినిమా - ఎస్2 సినిమాస్ | మానస (కావలి) | (కర్నూలు) ఐనాక్స్ జ్యోతి మాల్ - భరత్ - ఆనంద్ సినీ కాంప్లెక్స్ - ఎస్‌సిఎన్2 | (నంద్యాల) | శ్రీరామ - మినీ పర్‌తాప్ | (ఆదోని) సత్యం - ద్వారకా కాంప్లెక్స్ ఎస్‌సిఎన్-1 | శివప్రియా (ఎమ్మిగనూరు) | జిఎం పిక్చర్ ప్యాలెస్ (బనగానపల్లి) | (అనంతపూర్) ఎస్‌బిసి సినిమా - త్రివేణి కాంప్లెక్స్ - గాయత్రి | బాలాజి (హిందూపూర్) | రంగ (ధర్మవరం) | రవి - సాయిబాబా (కడప) | కుమార్ (ప్రొద్దుటూరు) | సిద్ధేశ్వర (ఆర్ఎల్‌వై కోడూరు) | (తిరుపతి) పిజిఆర్ - సంధ్య - శ్రీనివాస తేజ | విజయలక్ష్మి (చిత్తూరు) | రవి (మదనపల్లి) | పద్మ పిక్చర్ ప్యాలెస్ (రేణిగుంట) | ఎస్‌జె సినిమాస్ శ్రీనివాస పిక్చర్ ప్యాలెస్ (నగరి) | విజయలక్ష్మి (శ్రీకాళహస్తి) | బాలాజి (పుంగనూరు) - ఎస్ఎల్‌వి (గుంతకల్) | కనకదుర్గ (అత్తిలి) | వై స్క్రీన్ (కొవ్వూరు) | వెంకటేశ్వర (తిరువూరు) | గోపికృష్ణ (జి.కొత్తపల్లి) | వెంకటసూర్య (కడియం) | నటరాజ్ (పెందుర్తి) | ప్రితిసాయి (అనకాపల్లి) | సాయి శ్రీమ్యాక్స్ (చోడవరం) | రాజ (కొత్తవలస) | ఎస్ఆర్‌కె చిత్రమందిర్ (పాయకరావుపేట) | జమునా కాంప్లెక్స్ (పాడలకూరు) | విజయ (కర్నూలు)

జింబాబ్వేపై ఐసీసీ నిషేధం

జింబాబ్వేపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తీవ్ర చర్య తీసుకుంది. క్రికెట్ వ్యవహారాల్లో జింబాబ్వే ప్రభుత్వం అతి జోక్యంతో ఆట స్ఫూర్తికి విఘాతం కలుగుతోందనే కారణంతో ఆ జట్టుపై నిషేధం విధించింది. మరో వైపు జాంబియా, క్రొయేషియా, మొరాకోలను కూడా ఐసీసీ సస్పెండ్ చేసింది.

క్రికెట్ అసలు ఆటనే కాదు!

ప్రపంచవ్యాప్తంగా సంఖ్యాపరంగా అత్యంత ప్రజాదరణ ఉన్న క్రీడల్లో ఫుట్‌బాల్ తర్వాతి రెండో స్థానం క్రికెట్‌దే. అయితే అగ్రదేశం రష్యా మాత్రం క్రికెట్‌ను గుర్తించడానికి నిరాకరించింది. 'క్రికెట్ అనేది అసలు ఒక క్రీడనే కాదు. అందువల్ల దానిని ప్రభుత్వం గుర్తించడం లేదు' అని రష్యా ప్రభుత్వ క్రీడా శాఖ తాజాగా ప్రకటించింది. ప్రపంచ కప్ ఫైనల్ ముగిసిన జూలై 14 తర్వాతి రోజే ఈ ప్రకటన రావడం విశేషం. కామన్వెల్త్ దేశాల్లో అత్యంత ఆదరణ ఉన్న క్రికెట్ సుమారు 250 కోట్ల మంది అభిమానులతో రెండో స్థానంలో ఉందని ఒక అంచనా.

టైటిల్ వేటలో టైటాన్స్

ఈసారైనా రాత మారేనా • యువ ఆటగాళ్లతో తెలుగు జట్టు • రేపటి నుంచే ప్రొ కబడ్డీ లీగ్-7

సాక్షి, హైదరాబాద్: ఈ సీజన్‌లో కసిదీరా ఆడేందుకు తెలుగు టైటాన్స్ సన్నద్ధమైంది. ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఏడో సీజన్ ఆరంభమే హైదరాబాద్‌లో జరగనుండటంతో తొలి అంచె పోటీల్లో స్థిరమైన విజయాలు సాధించాలని ఆశిస్తోంది. ఆరేళ్లుగా టైటాన్స్ ఆశల పల్లకి మోసిన స్టార్ రైడర్ రాహుల్ చౌదరి జట్టును వీడాడు. అతని స్థానంలో మరో స్టార్ రైడర్ సిద్ధార్థ్ దేశాయ్ రాగా... సారథ్య బాధ్యతల్ని ఇరానీ డిఫెండర్ అబొజర్ మిఘానికి అప్పగించింది. చీఫ్ కోచ్‌గా ఇరాన్‌కు చెందిన గోలమ్ రెజాను నియమించింది. ఇలా జట్టుకు కొత్త దిశను చూపిన యాజమాన్యం తమ దశమారాలని గంపెడాశతో బరిలోకి దిగుతోంది.

కబడ్డీ... కబడ్డీ... అంటూ ఆరేళ్లుగా తెలుగు టైటాన్స్ ఆడుతోంది. కానీ టైటిల్ వేటలో కనీసం ఫైనల్ మెట్టయినా ఎక్కలేకపోయింది. ఈ సారైనా ఆ ముచ్చట తీర్చుకునేందుకు టైటాన్స్ కష్టపడుతోంది. జట్టులో మార్పులు కూడా చేసింది. కొత్త కెప్టెన్, కొత్త కోచ్‌లతో జట్టు కూత పెట్టేందుకు సిద్ధమైంది. మరీ ఈ కూత ఎందాకో తెలియాలంటే మనం మూడు నెలలు ఆగాలి! ఎందుకంటే ఫైనల్ అక్టోబర్‌లో కదా జరిగేది!!

డిఫెండర్లపై విశ్వాసం

ఈ సారి జట్టు కుర్రాళ్లపై నమ్మకముంచింది. దీంతో అనుభవజ్ఞులకంటే యువ ఆటగాళ్లే తొడగొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ముఖ్యంగా డిఫెన్స్‌లో విశాల్ భరద్వాజ్, కెప్టెన్ అబొజర్ మిఘానిలు ఓ పట్టుపడితే ప్రత్యర్థులకు కష్టాలు తప్పవు. గత సీజన్‌లో విశాల్ చక్కగా రాణించాడు. 60 టాకిల్ పాయింట్లు సాధించిన అతడు సగటున మ్యాచ్‌కు మూడున్నర పాయింట్లు తెచ్చిపెట్టాడు. ఆరో సీజన్‌లో మూడో ఉత్తమ ప్రదర్శన అతనిదే. ఇక రైట్ కార్నర్‌లో మెరుగైన డిఫెండర్ అబొజర్. కీలక సమయంలో ప్రత్యర్థులను, పాయింట్లను ఒడిసి పట్టాడు. ఆరో సీజన్‌లో అతను విశాల్‌కు కాస్త తక్కువగా 57 పాయింట్లు సాధించాడు. 2.7 సగటు నమోదు చేశాడు. రైడర్ల పాలిట వీళ్లిద్దరు టైటాన్స్‌కు బ్రహ్మాస్త్రాలైతే తెలుగు జట్టుకు తిరుగుండదు. యు ముంబా మాజీ కోచ్ అయిన గొలమ్ రెజాను చీఫ్ కోచ్‌గా నియమించడం, కెప్టెన్ కూడా ఇరానీ ఆటగాడే కావడం... ఇద్దరి సమన్వయం జట్టుకు దోహదం చేసే అవకాశముంది.

కలిసిరాని హైదరాబాద్

టైటాన్స్‌కు ఇప్పటివరకు సొంత మైదానం కలిసి రాలేదు. ఆరు సీజన్‌లలో మూడు వైజాగ్‌లో ఆడగా మరో మూడు ఇక్కడే ఆడింది. ఆడిన మూడు సీజన్లూ హైదరాబాదీ అభిమానుల్ని టైటాన్స్ నిరాశపరిచింది. ఓవరాల్‌గా 16 మ్యాచ్‌లాడిన తెలుగు టైటాన్స్ కేవలం ఐదే మ్యాచ్‌లు గెలిచింది. 9 మ్యాచ్‌లో ఓటమి ఎదురవగా... రెండు టైగా ముగిశాయి. ఈ సారైనా తమ తలరాత మారాలని జట్టు ఆశిస్తోంది.

సెమీసే అత్యుత్తమం

తెలుగు టైటాన్స్ 6 సీజన్లు పోరాడినా టైటిల్ వేటలో ఒక్కసారి కూడా నిలువలేకపోయింది. పీకేఎల్‌లో తెలుగు టీమ్ అత్యుత్తమ ప్రదర్శన సెమీఫైనలే! రెండు, నాలుగో సీజన్‌లలో రెండు సార్లు సెమీస్ చేరింది. గత రెండు సీజన్‌లలోనూ పేలవమైన ప్రదర్శనతో జోన్ 'బి'లో ఐదో స్థానంలో నిలిచింది. మొత్తమ్మీద ఈ ఆరేళ్లలో గెలిచిన మ్యాచ్‌లకంటే ఓడిన మ్యాచ్‌లే ఎక్కువ! 104 మ్యాచ్‌లాడిన టైటాన్స్ జట్టు 45 మ్యాచ్‌ల్లో గెలుపొందగా... 47 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. మరో 13 టైగా ముగిశాయి.

తెలుగు టైటాన్స్ జట్టు

అబొజర్ (కెప్టెన్), విశాల్, అరుణ్, కృష్ణ, మనీశ్, ఆకాశ్, ఆకాశ్ దత్తు (డిఫెండర్లు); సిద్ధార్థ్ దేశాయ్, అమిత్, అంకిత్, కమల్, ముల శివ, రజనీశ్, రాకేశ్, సూరజ్, మల్లికార్జున్, (రైడర్లు); అర్మాన్, ఫర్హాద్ మిలగర్దన్ (ఆల్‌రౌండర్లు).

సిద్ధార్థ్ దేశాయ్... ఒక్క సీజన్‌తో స్టార్ అయిన మహారాష్ట్ర ఆటగాడు. గతేడాది యు ముంబా తరపున కూత పెట్టించాడు. సంచలన రైడింగ్ ప్రదర్శనతో ప్రత్యర్థులను హడలెత్తించాడు. లీగ్‌లో గత సీజన్ మాత్రమే ఆడిన ఈ మహారాష్ట్ర కబడ్డీ ప్లేయర్‌పై తెలుగు టైటాన్స్ భారీ ఆశలే పెట్టుకుంది. అందుకనే ఏకంగా సుమారు రూ. కోటిన్నర (రూ.1.45 కోట్లు) వెచ్చించి మరీ అతన్ని కొనుక్కుంది. ప్రొ కబడ్డీ వేలంలోనే ఇది అత్యధిక మొత్తం కావడం విశేషం.

అందరి కళ్లు సిద్ధార్థ్‌పైనే

రాహుల్ చౌదరి తరలిపోయిన లోటును దేశాయ్ సమర్థంగా భర్తీ చేయగలడనే విశ్వాసంతో టైటాన్స్ యాజమాన్యం ఎంత మొత్తానికైనా వెనుకాడలేదు. నిజంగా సిద్ధార్థ్‌కు అంత సీనుందా అంటే... గత సీజన్ ప్రదర్శన చూస్తే ఔననాల్సిందే. పీకేఎల్-6లో ఆడిన 21 మ్యాచ్‌ల్లో ఏకంగా 218 పాయింట్లు సాధించాడు. సగటున మ్యాచ్‌కు 10 పాయింట్లు తెచ్చిపెట్టిన రైడర్‌గా నిలిచాడు. అందుకే 'ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డును ఎగరేసుకుపోయాడు. గత సీజన్‌లో కేవలం ముగ్గురు రైడర్లే ఈ ఘనత సాధించారు. ఇక ప్రస్తుత తెలుగు టైటాన్స్ రైడర్లంతా కలిపి చేసిన పాయింట్లు (69), సిద్ధార్థ్ ఒక్కడే చేసిన పాయింట్లకూ ఎంతో వ్యత్యాసముంది. అతని సగం పాయింట్లకు సరిపోని దూరంలో ఉన్నాయి. ఈ ఖరీదైన ఆటగాడు మంచి పాటగాడు (గాయకుడు) కూడా! అంతేనా... డ్యాన్సర్ కూడా. బరిలో కూత పెట్టడమే కాదు... మ్యాచ్‌లు గెలిస్తే ఆటపాటలతో హోరెత్తిస్తానంటున్నాడు సిద్ధార్థ్.

క్వార్టర్స్‌లో సింధు

- శ్రీకాంత్ ఓటమి
- ఇండోనేసియా బ్యాడ్మింటన్ ఓపెన్

జకార్తా: ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు క్వార్టర్స్‌లో ప్రవేశించింది. గురువారం 62 నిమిషాల పాటు సాగిన మహిళల ప్రిక్వార్టర్ మ్యాచ్‌లో ఐదో సీడ్ సింధు 21-14, 17-21, 21-11 తేడాతో మియా బ్లిచ్‌ఫెల్ట్ (డెన్మార్క్) పై గెలిచింది. మ్యాచ్‌ను డెన్మార్క్ షట్లర్ ధాటిగా ఆరంభించింది. సింధుపై మొదటి గేమ్‌లో 6-3తో ఆధిక్యంలో వెళ్లింది. వెంటనే తేరుకున్న సింధు వెంట వెంటనే పాయింట్లు సాధించి స్కోరును సమం చేసింది. తర్వాత మరింత దూకుడును పెంచిన సింధు సుదీర్ఘ ర్యాలీలు, స్మాష్ షాట్లతో హోరెత్తించి మొదటి గేమ్‌ను 21-14తో కైవసం చేసుకుంది. అయితే రెండో గేమ్‌ను మియా గెలవడంతో మ్యాచ్ మూడో గేమ్‌కు దారితీసింది. మూడో గేమ్‌లో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన సింధు 21-11తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను చేజిక్కించుకుంది. మియా బ్లిచ్‌ఫెల్ట్‌పై సింధుకిది మూడో విజయం కావడం విశేషం. గతంలో ఇండియన్ ఓపెన్, సింగపూర్ ఓపెన్‌లలో సింధు ఆమెను మట్టికరిపించింది. పురుషుల ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ కిడాంబి శ్రీకాంత్ 17-21, 19-21తో ఎన్జీ కా లాంగ్ అంగుస్ (హాంకాంగ్) చేతిలో వరుస గేమ్‌లలో చిత్తయ్యాడు. పురుషుల డబుల్స్‌లో భారత జోడి సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి 15-21, 14-21తో టోర్నీ టాప్ సీడ్ మార్కస్ గిడియోన్ - కెవిన్ సంజయ(ఇండోనేషియా) జంట చేతిలో... మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సిక్కి రెడ్డి-ప్రణవ్ చోప్రా (భారత్) 14-21, 11-21తో టాప్ సీడ్ జెంగ్ సి వె-హువాంగ్ యా కియోంగ్ (చైనా) జోడీ చేతిలో పరాజయం పాలైయ్యారు. శుక్రవారం జరిగే మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మూడో సీడ్ నొజోమి ఒకుహారా (జపాన్)తో సింధు పోటీ పడనుంది. వీరిద్దరూ 14 సార్లు తలపడగా.. చెరో ఏడు సార్లు గెలిచి సమంగా ఉన్నారు.

క్వార్టర్స్ ఫైనల్లో సిరిల్ వర్మ

రష్యా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

వ్లాడివోస్తోక్: రష్యా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలంగాణ షట్లర్ సిరిల్ వర్మ సత్తా చాటాడు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ మ్యాచ్‌లో సిరిల్ వర్మ 21-11, 21-7తో మిహ ఇవానిక్ (స్లొవేనియా)పై అలవోక విజయాన్ని నమోదు చేసి క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. మహిళల సింగిల్స్ విభాగంలో రితుపర్ణ దాస్ (భారత్) 21-18, 21-7తో క్రిస్టీ గ్లిమోర్ (ఇజ్రాయిల్)పై విజయం సాధించి క్వార్టర్స్‌లో ప్రవేశించింది. మరో మ్యాచ్‌లో భారత్‌కే చెందిన రాహుల్ యాదవ్ చిట్టబోయిన 21-16, 12-21, 14-21తో పబ్లో అబియాన్ (స్పెయిన్) చేతిలో పోరాడి ఓడాడు. టోర్నీ టాప్ సీడ్ శుభంకర్ దే (భారత్) 18-21, 18-21తో అన్‌సీడ్ ఆటగాడు కొడై నరోక (జపాన్) చేతిలో ఓడగా... మహిళల విభాగంలో వృశాలి 21-19, 9-21, 12-21తో ఏడో సీడ్ పాయ్ యు పో (చైనీస్ తైపీ) చేతిలో ఓడింది. మహిళల డబుల్స్ విభాగంలో విజయవాడ అమ్మాయి టాప్ సీడ్ మేఘన జక్కంపుడి - పూర్విషా ఎస్ రామ్ జోడి 13-21, 21-12, 21-15తో అనస్టాసియా కుర్‌ద్యకోవా - షపావలోవ (రష్యా) ద్వయంపై విజయం సాధించి క్వార్టర్స్‌లో ప్రవేశించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జంట, ఆరో సీడ్ కృష్ణ ప్రసాద్ గర్గ - పూర్విషాలు 21-5, 21-14తో మత్వే మాన్యులోవ్ - వార్వర మాలిక్ (రష్యా)పై గెలిచింది.

రంజీల్లో డీఆర్ఎస్

నాకౌట్ మ్యాచ్‌లలో అమలు

ముంబై: ఇకపై దేశవాళీ క్రికెట్ టోర్నీలో కూడా అంపైర్ నిర్ణయానికి సమీక్ష కోరవచ్చు. రంజీ ట్రోఫీలో నాకౌట్ మ్యాచ్‌ల్లో నిర్ణయ సమీక్ష పద్ధతి (డీఆర్ఎస్)ని అమలు చేయాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్ణయించింది. గతేడాది రంజీ ట్రోఫీలో పలు అంపైరింగ్ తప్పిదాలతో కెప్టెన్లు, కోచ్‌లు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ నేపథ్యంలో పరిమితులతో కూడిన డీఆర్ఎస్‌ను ఈ సీజన్ నుంచే అమల్లోకి తీసుకురానుంది. అంటే ఇక్కడ హాక్-ఐ, అల్ట్రా ఎడ్జ్ సాంకేతికతను వాడకుండా టీవీ రీప్లే ఆధారంగా నిర్ణయాన్ని వెలువరిస్తారు. బీసీసీఐ జనరల్ మేనేజర్ (క్రికెట్) సాబా కరీమ్ మాట్లాడుతూ అంపైరింగ్ పొరపాట్లపై రంజీ కెప్టెన్లు, కోచ్‌లు ఫిర్యాదు చేయడంతో ఈ సారి డీఆర్ఎస్‌ను అమలు చేయాలని బోర్డు నిర్ణయించిందని చెప్పారు. ఫీల్డు అంపైర్ల తప్పిదాలను సరిదిద్దేందుకు పరిమిత డీఆర్ఎస్‌ను తీసుకొస్తున్నట్లు తెలిపారు. గత నెలలో పరిపాలక కమిటీ (సీఓఏ) రంజీ నాకౌట్ మ్యాచ్‌ల్లో డీఆర్ఎస్ నిర్ణయానికి ఆమోదం తెలిపిందని ఆయన చెప్పారు.

సెమీస్ చేరిన భారత్

కటక్: కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు సెమీఫైనల్లో అడుగుపెట్టాయి. గురువారం జరిగిన పురుషుల గ్రూప్- 'ఎఫ్'లో భారత్ 3-0తో శ్రీలంకపై, 3-0తో మలేసియాపై, 3-0తో వేల్స్‌పై ఘన విజయం సాధించి తుది నాలుగు జట్లలో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. అంథోని అమల్‌రాజ్, సత్యన్, మానవ్ ఠక్కర్ బృందం శ్రీలంకపై గెలుపొందగా... అమల్‌రాజ్, శరత్ కమల్, హర్మీత్ దేశాయ్ బృందం మలేసియా జట్టుపై.. మానవ్ ఠక్కర్, హర్మీత్ దేశాయ్, అమల్‌రాజ్ జట్టు వేల్స్‌పై విజయం సాధించాయి. మరో వైపు మధురిక పట్కర్, అర్చన కమత్, ముఖర్జీలతో కూడిన భారత బృందం 3-0తో వేల్స్ జట్టుపై... అర్చన కమత్, మనిక మత్రా, మధురిక పట్కర్ జట్టు 3-0తో మలేసియాపై... అర్చన కామత్, మనికా బత్రా, సుతీర్థ ముఖర్జీల జట్టు నైజీరియాపై గెలుపొంది సెమీఫైనల్లో ప్రవేశించింది.

ఇయాన్ చాపెల్‌కు చర్మ క్యాన్సర్

త్వరగా కోలుకుంటున్నానన్న ఆసీస్ మాజీ సారథి

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, ప్రముఖ వ్యాఖ్యాత ఇయాన్ చాపెల్ చర్మ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు గురువారం వెల్లడించారు. వ్యాధి నివారణకు రేడియో థెరపీ చికిత్స జరుగుతోందని, త్వరలోనే మళ్లీ వ్యాఖ్యాతగా తన గొంతు వినిపిస్తానని 75 ఏళ్ల చాపెల్ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. భుజం, మెడ భాగాల్లోని క్యాన్సర్ కణాలను తొలిగించినట్లు తెలిపారు. ఆగస్టులో జరగనున్న యాషెస్ సిరీస్ తొలి టెస్టు సమయానికి పూర్తిగా కోలుకుంటానని ప్రకటించారు. 'గతంలోనూ చర్మ క్యాన్సర్‌ను సమర్థంగా ఎదుర్కొన్నా. కానీ ఈ వయస్సులో అనారోగ్యం ఆందోళన కలిగించేదే. నాలుగు వారాల రేడియో థెరపీ పూర్తయింది. రిపోర్టులన్నీ అనుకూలంగానే ఉన్నాయి. యాషెస్ సిరీస్ సమయానికి అందుబాటులో ఉంటాను' అని చాపెల్ డైలీ టెలీగ్రాఫ్ పత్రికకు చెప్పారు. చర్మ క్యాన్సర్ ఉందని తెలిసినప్పటికీ ఆయన చికిత్స తీసుకుంటూనే రేడియోలో వ్యాఖ్యాతగా పనిచేశారు. అధిక పనిభారం, పనివేళలు అనుకూలంగా లేకపోవడంతో వరల్డ్‌కప్ టోర్నీకి మాత్రం దూరంగా ఉన్నారు. చాపెల్ 1964 నుంచి 1980 వరకు ఆస్ట్రేలియా తరపున 75 టెస్టులాడి 5345 పరుగులు సాధించారు.

పి.టి. ఉషకు ఐఏఏఎఫ్ అవార్డు

న్యూఢిల్లీ: భారత మాజీ అథ్లెట్, దిగ్గజ ఒలింపియన్ పి.టి. ఉషను అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య (ఐఏఏఎఫ్) ప్రతిష్టాత్మక 'వెటరన్ పిన్' అవార్డుకు ఎంపిక చేసింది. మన దేశంలో విశేష కృషికి గుర్తింపుగా ఇచ్చే జీవిత సాఫల్య పురస్కారంలాంటిదే 'వెటరన్ పిన్' అవార్డు. తను ఈ అవార్డుకు ఎంపికైన విషయాన్ని ఆమె ట్విట్టర్‌లో తెలియజేసింది. 'ప్రపంచ అథ్లెటిక్స్‌లో సుదీర్ఘ కాలం పాటు చేసే సేవలకు గుర్తింపుగా ఐఏఏఎఫ్ వెటరన్ పిన్ అవార్డు అందజేస్తారు. అలాంటి విశిష్ట పురస్కారానికి నేను ఎంపికవడం చాలా సంతోషంగా ఉంది. ఐఏఏఎఫ్‌కు కృతజ్ఞతలు' అని ట్వీట్ చేసింది. దోహాలో సెప్టెంబర్ 24న జరిగే ఐఏఏఎఫ్ కాంగ్రెస్‌లో 55 ఏళ్ల ఉషకు ఈ అవార్డు అందజేస్తారు.

సన్‌రైజర్స్ హెడ్ కోచ్‌గా ట్రెవర్ బేలిస్

టామ్ మూడీ స్థానంలో నియామకం

హైదరాబాద్: ఇంగ్లండ్ జట్టును విశ్వ విజేతగా నిలిపి ప్రస్తుత ప్రపంచ క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన కోచ్‌గా పేరున్న ట్రెవర్ బేలిస్... ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. ప్రస్తుతం సన్‌రైజర్స్‌కు టామ్ మూడీ (ఆస్ట్రేలియా) హెడ్ కోచ్‌గా ఉన్నాడు. బేలిస్ సైతం ఆస్ట్రేలియాకు చెందినవాడే. కొంతకాలంగా ఇంగ్లండ్‌కు శిక్షకుడిగా వ్యవహరిస్తున్నాడు. ఇతడి ఆధ్వర్యంలోనే ఆ జట్టు 2015 యాషెస్ సిరీస్‌ను 3-2 తేడాతో గెల్చుకుంది. 2016 టి20 ప్రపంచ కప్ ఫైనల్ చేరింది. అనంతరం వన్డేల్లో నంబర్‌వన్‌గానూ అవతరించింది. తాజాగా వన్డే ప్రపంచ కప్‌నూ సాధించింది. వచ్చే నెలలో ప్రారంభం కానున్న యాషెస్ సిరీస్‌తో ఇంగ్లండ్ జాతీయ జట్టుతో బేలిస్ ఒప్పందం ముగియనుంది. దీనికిముందు 2010-11లో అతడు ఆస్ట్రేలియా టి20 లీగ్ బిగ్ బాష్‌లో సిడ్నీ సిక్సర్స్‌కు కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. అనంతరం శ్రీలంక జాతీయ జట్టుకు పనిచేశాడు. లంక 2011 ప్రపంచ కప్‌లో ఫైనల్ చేరినప్పుడు బేలిస్ ఆ దేశ కోచ్‌గా ఉన్నాడు. 2012-15 మధ్య కోల్‌కతా నైట్‌రైడర్స్ రెండుసార్లు ఐపీఎల్ విజేతగా నిలిచిన సందర్భంలోనూ అతడే శిక్షకుడు. బేలిస్ కోసం కోల్‌కతా నైట్‌రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ సైతం ప్రయత్నించాయి. కోల్‌కతాతో చర్చలు కూడా నడిచినా అవి ముందుకు సాగలేదు.

మూడీ సేవలకు వీడ్కోలు

సన్‌రైజర్స్ కోచ్‌గా టామ్ మూడీది విజయవంతమైన ప్రయాణమే. అతడు ఏడు సీజన్ల పాటు బాధ్యతలు నిర్వర్తించాడు. ఇందులో 2016లో హైదరాబాద్ లీగ్ విజేతగా నిలవగా, 2018లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఈ ఏడాది నాలుగో స్థానంలో నిలిచింది. 'మూడీ స్థానంలో ఫ్రాంచైజీకి కొత్త హెడ్ కోచ్‌ను నియమించాలన్నది బాగా ఆలోచించి తీసుకున్న నిర్ణయం. జట్టు భవిష్యత్‌ను దిశా నిర్దేశం చేసేందుకు అతడు సరైనవాడు ' అని సన్ యాజమాన్యం ఓ ప్రకటనలో పేర్కొంది. జట్టుపై మూడీ ప్రభావాన్ని ఈ సందర్భంగా కొనియాడింది. 'సన్ రైజర్స్ పురోగతి, విజయాల్లో మూడీది చెరగని ముద్ర. లీగ్‌లో అత్యధిక కాలం కోచ్‌గా పనిచేశాడు. అయినా కొత్తవారికి కోచింగ్ బాధ్యతలు ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయించింది' అని సన్‌రైజర్స్ సీఈవో షణ్ముగం తెలిపాడు.

సరబ్‌జోత్ సింగ్‌కు పసిడి

జూనియర్ షూటింగ్ ప్రపంచకప్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత షూటర్ సరబ్‌జోత్ సింగ్ బంగారు పతకాన్ని సాధించాడు. దీంతో భారత్ సాధించిన బంగారు పతకాల సంఖ్య 9కు చేరింది. జర్మనీలో జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో 239.6 పాయింట్లు సాధించి పసిడిని పట్టేశాడు. దీంతో పురుషుల, మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగల్లో భారత్‌కే చెందిన షూటర్లు బంగారు పతకాలు సాధించడం విశేషం. రెండు రోజుల క్రితం 14 ఏళ్ల ఈశా సింగ్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో బంగారు పతకం సాధించింది. 9 బంగారు, 9 రజత, 4 కాంస్య పతకాలతో మొత్తం 22 పతకాలను సాధించిన భారత్ పతకాల పట్టికలో అగ్రస్థానంలో ఉండగా 20 పతకాలతో చైనా రెండో స్థానంలో ఉంది.

అమ్మ చూపు చల్లగా..!

అమ్మ ప్రేమ అమృతంలాంటిది. బిడ్డకు ఏ కష్టం వచ్చినా చూసి తల్లడిల్లుతోంది. కనురెప్పలా కాపాడుకుంటోంది. కూలి పనులకు వెళ్లిన ఓ మాతృమూర్తి తన వెంట బిడ్డను తీసుకెళ్లింది. పత్తి చేనులో కలుపు తీస్తుండగా ఎండ వేడి తీవ్రత ఎక్కువైంది. దీంతో కుమారుడికి ఎండ తగలకూడదనే ఉద్దేశంతో గొడుగు నీడలో పనులు చేస్తూ ఇలా కనిపించింది. ఈ చిత్రం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని సమీప పంట పొలాల్లోనిది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

హై'టెన్షన్' బతుకు!

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి, మంగపేట, పెగడపల్లి గ్రామాల్లో హైటెన్షన్ విద్యుత్ లైన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కూలీలు పనులు చేస్తున్నారు. ఒక విద్యుత్ టవర్ నుంచి మరో టవర్ వరకు తీగల పైనే కొక్కెంల సహాయంతో నడుచుకుంటూ వెళ్లి నిర్మాణ పనులు చేస్తున్నారు. ఆకాశంలో తేలుతూ.. ప్రమాదం అంచున వేలాడుతూ తీగలు సవరిస్తున్నారు. జానెడు పొట్ట కోసమే ఈ బతుకు పోరాటం చేస్తున్నామని కూలీలు చెబుతున్నారు.

కాల్వ శ్రీరాంపూర్ (పెద్దపల్లి)

పిండేసిన పిడుగు

ప్రకృతి రైతుపై పగబట్టింది. ఓ వైపు వర్షాభావంతో పంటలు ఎండిపోతుండగా.. గురువారం కురిసిన కొద్దిపాటి వర్షానికే పిడుగుపడి రైతుతో పాటు దుక్కిటెద్దులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం పినపాక పట్టీనగర్‌లో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దోమల సుందరరావు (45) మధ్యాహ్నం పత్తి చేనులో కలుపు నివారణకు అరకతో దున్నుతున్నాడు. ఆ సమయంలో చిరు జల్లుతో పాటు ఉరుములు, మెరుపులతో పిడుగు పడింది. దీంతో సుందరరావుతో పాటు రెండు ఎద్దులు మృత్యువాత పడ్డాయి.

- బూర్గంపాడు

ఆస్తులు పెంచుకునేందుకే..

టీఆర్ఎస్ కార్యాలయాల నిర్మాణంపై ఇంద్రసేనారెడ్డి

హన్మకొండ: ఆస్తులు పెంచుకోవడానికి టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల నిర్మాణం చేపట్టిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి ఆరోపించారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలకు కార్యాలయాల నిర్మాణాలకు స్థలాలు ఇవ్వాల్సి ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వం టీఆర్ఎస్‌కు మాత్రమే కేటాయిస్తోందని విమర్శించారు. జాతీయ, ప్రాంతీయ పార్టీల వారీగా స్థలాలు కేటాయించాల్సిన నిబంధనలున్నా పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీది గెలుపేనా అంటూ విమర్శిస్తున్న సీఎం కేసీఆర్ ఒక్కసారి తన గెలుపును సమీక్షించుకోవాలని సూచించారు. మాటలు మాట్లాడే ముందు ఒళ్లు, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. సరైన సమయంలో కర్రు కాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మునిసిపల్ ఎన్నికల్లో గెలుపొందడానికి అడ్డదారులు తొక్కుతున్న అధికార టీఆర్ఎస్ తనకు అనుకూలంగా వార్డుల విభజన, నిబంధనలకు విరుద్ధంగా రిజర్వేషన్లు కేటాయిస్తున్నదని ఆయన ఆరోపించారు. మునిసిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఎడమ కంటికి బదులు కుడి కంటికి ఆపరేషన్

బాధితుడి కుమారుడు ఆరోపణ

హుస్నాబాద్: సిద్దిపేట జిల్లాలో వైద్యులు ఓ వ్యక్తికి ఎడమ కంటికి బదులు కుడి కంటికి ఆపరేషన్ చేశారు. హుస్నాబాద్ పట్టణానికి చెందిన చల్లా కిష్టారెడ్డికి ఎడమ కంటికి బదులు కుడి కంటికి ఆపరేషన్ చేశారని బాధితుడి కుమారుడు ఆరోపించారు. రెండు రోజుల క్రితం హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో సికింద్రాబాద్ పుష్పగిరి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. కిష్టారెడ్డి ఎడమ కంటి చూపు సరిగా లేదని శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. దీంతో వైద్యులు ఆపరేషన్ చేయాలని, సికింద్రాబాద్ పుష్పగిరి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అక్కడి వైద్యులు ఎడమ కంటికి ఆపరేషన్ చేయాల్సి ఉండగా, కుడి కంటికి ఆపరేషన్ చేశారని బాధితుడి కుమారుడు మాధవరెడ్డి ఆరోపించారు. ఈ విషయంపై ఇక్కడి వైద్యులను అడగ్గా కిష్టారెడ్డికి చెందిన రెండు కళ్లకు చూపు సమస్య ఉందని, కుడి కంటికి ఇన్‌ఫెక్షన్ తీవ్రంగా ఉండటంతో ముందుగా కుడి కంటికి ఆపరేషన్ చేశామని, మరో నెల రోజుల్లో ఎడమ కంటికి సైతం ఆపరేషన్ చేస్తామని చెబుతున్నారు.

మేడిగడ్డలో మళ్లీ గేట్లెత్తారు

8 గేట్ల నుంచి 20 వేల క్యూసెక్కుల వరద

- కన్నెపల్లిలో ఆగిన మోటార్లు
- నేడు 2, 7, 8 మోటార్లకు వెట్‌రన్
- అన్నారంలో 5.9 టీఎంసీలు

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీలో నీటి ప్రవాహం పెరగడంతో గురువారం మళ్లీ 8 గేట్లను ఎత్తారు. దీంతో 20 వేల క్యూసెక్కుల వరద తరలిపోతోంది. ఇప్పటికే 7.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మొత్తం 85 గేట్లు ఉండగా.. ఇందులో నాలుగు గేట్లు ఒక మీటర్ ఎత్తులో, మరో నాలుగు గేట్లను అర మీటరు ఎత్తులో ఎత్తి ఉంచారు. ప్రస్తుతం బ్యారేజీలో 8 మీటర్ల ఎత్తులో నీరు ఉంది. అవసరమైతే మరిన్ని గేట్లు ఎత్తడానికి ఇంజనీరింగ్ అధికారులు సిద్ధంగా ఉన్నారు.

కన్నెపల్లిలో రెండోరోజు ఆగిన మోటార్లు

కన్నెపల్లి పంపుహౌస్‌లో 12 రోజులుగా ఎత్తిపోసిన మోటార్లు రెండు రోజులుగా ఆగాయి. గోదావరి సమీపంలో నీటి లభ్యత లేని కారణంగా ఆటోమేషన్ పద్ధతిలో మోటార్లు రన్ చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు సన్నద్ధమయ్యారు. శుక్రవారం నుంచి 2, 7, 8 మోటార్లకు వెట్‌రన్ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటి వరకు 1, 3, 4, 5, 6 నంబర్ల మోటార్లతో రోజుకు ఒక టీఎంసీ చొప్పున నీటిని ఎత్తిపోయగా గ్రావిటీ కాల్వ ద్వారా 13.345 కిలోమీటర్ల దూరం ప్రయాణించిన నీరు.. అన్నారం బ్యారేజీలో చేరుతోంది. రెండు రోజులుగా నిలిచిన ఎత్తిపోతలు శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు చెప్పారు.

అన్నారంలో 5.9 టీఎంసీలు

కన్నెపల్లి పంపుహౌస్ నుంచి ఎత్తిపోస్తున్న నీరు అన్నారం బ్యారేజీలో చేరి 5.9 టీఎంసీలు నిల్వ అయింది. ఈ బ్యారేజీ నిల్వ సామర్థ్యం 10.57 టీఎంసీలు. ప్రస్తుతం 8 మీటర్ల ఎత్తులో నీటి మట్టం ఉంది. ఇక్కడి పెద్దపల్లి జిల్లా అన్నారం బ్యారేజీకి నీరు బ్యాక్‌వాటర్ రూపంలో చేరింది. మోటార్లకు వెట్‌రన్ ప్రక్రియను మొదలు పెట్టనున్నారు. ఆ మోటర్లతో నీటిని ఎత్తిపోస్తేనే సుందిళ్ల బ్యారేజీకి నీరు చేరుతుంది.

మేడిగడ్డ బ్యారేజీలో నీటి నిల్వ దృశ్యం

మహారాష్ట్ర వర్షాలతో..

వర్షాలు భారీగా కురిస్తేనే నీటి లభ్యత ఉంటుంది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలపైనే ఎత్తిపోతలు ఆధారపడి ఉన్నాయి. నాలుగు రోజులుగా ప్రాణహిత నదికి వరద తగ్గుతోంది. కాళేశ్వరం వద్ద రోజుకు 8-9వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. వరద ప్రవాహానికి సంబంధించిన వివరాలను మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా టేకడ సీడబ్ల్యూసీ కేంద్రం నుంచి ఎప్పటికప్పుడు మేడిగడ్డలో ఏర్పాటు చేసిన ఫ్లడ్ కంట్రోల్ రూం ద్వారా ఇంజనీర్లు ఆరా తీస్తున్నారు.

150 గుడ్లు పెట్టిన నాటుకోడి

ఓ నాటు కోడి ఆరు నెలల్లో 150 గుడ్లు పెట్టి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. నాగర్ కర్నూల్ జిల్లా దేవల్‌తిర్మలాపూర్‌కి చెందిన రామకృష్ణమాచారి రెండేళ్ల కోడిపెట్ట గత ఆరు నెలలుగా 150 గుడ్లు పెట్టింది. నేటికీ పెడుతూనే ఉంది. ఈ విషయాన్ని రామకృష్ణమాచారి గ్రామస్తులకు తెలియజేయడంతో పలువురు ఆసక్తిగా వచ్చి ఆ కోడిపెట్టను చూశారు. కొందరు గుడ్లను తీసుకెళ్లి తమ కోళ్లకు పొదుగేసుకున్నారు. ఈ విషయమై పశువైద్యాధికారిని అడగగా.. జన్యులోపం వల్ల లక్షల్లో ఒక కోడి ఇలా గుడ్లు పెడుతుందని తెలిపారు.

- పెద్దకొత్తపల్లి (కొల్లాపూర్)

మహిళను ట్రాక్టర్‌కు కట్టేసి కొట్టారు

చిన్నబోనాలలో దారుణం

సిరిసిల్ల: వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని ఆరోపిస్తూ ఓ మహిళను ట్రాక్టర్‌కు కట్టేసి కొట్టారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల శివారులోని చిన్నబోనాలలో గురువారం ఉదయం చోటుచేసుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త తొమ్మిదేళ్ల క్రితం గల్ఫ్‌కు వెళ్లాడు. పిల్లలు లేని ఆమె స్థానికంగా బీడీలు చుడుతోంది. ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. పక్షం రోజుల క్రితం ఆమెను తీసుకుని ఊరు విడిచి వెళ్లాడు. ఇటీవల సిరిసిల్ల పట్టణానికి వచ్చి శివనగర్ ప్రాంతంలో ఓ ఇల్లును అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. సమాచారం అందుకున్న అతని కుటుంబ సభ్యులు అద్దెకు ఉంటున్న ఇంటికి వెళ్లి గ్రామానికి తీసుకెళ్లారు. అయితే.. మరుసటి రోజు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న మహిళ కూడా చిన్నబోనాలలోని అతని ఇంటికి వెళ్లింది. దీంతో ఆగ్రహానికి గురైన సదరు వ్యక్తి కుటుంబ సభ్యులు మహిళను ట్రాక్టర్‌కు కట్టేసి విచక్షణారహితంగా కొట్టారు. గ్రామస్తులందరూ చూస్తూ ఉండిపోయారే గానీ ఎవరూ అడ్డుకోలేకపోయారు. ఆమెను కొడుతున్న దృశ్యాలు సోషన్ మీడియాలో వైరల్ అయ్యాయి.సమాచారం అందుకున్న పోలీసులు బాధితురాలిని విడిపించి సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ శ్రీనివాస్ చౌదరి తెలిపారు.

మహిళను విడిపిస్తున్న పోలీసులు

తండ్రి.. భర్తకు బదులుగా 'తెలంగాణ'

ఫొటో ఓటరు జాబితా తప్పుల తడక

- మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలు

జనగామ: జనగామ మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఫొటో ఓటరు జాబితాలో అనేక తప్పులు చోటు చేసుకుంటున్నాయి. కులాల గుర్తింపులో పొరపాట్లు చేసిన అధికారులు.. తండ్రి, భర్తల పేర్లు మార్చేసి ఓ అడుగు ముందుకు వేశారు. ఓటరు జాబితాల్లో చోటుచేసుకున్న తప్పిదాలు.. సోషల్ మీడియా వేదికగా హల్‌చల్ చేస్తున్నాయి. ఈ నెల 16న తుది ఓటరు జాబితా ప్రకటించగా.. ఒక్కొక్కటిగా తప్పులు వెలుగు చూస్తున్నాయి. 10వ వార్డుకు చెందిన రేఖ పేరు పక్కన తండ్రికి బదులుగా భర్త అని ముద్రించి.. తెలంగాణగా నమోదు చేశారు. ఆమె తల్లి మీరాబాయి.. భర్తకు బదులుగా తెలంగాణ, ఆమె భర్త సోనాబీర్ తండ్రికి బదులుగా తెలంగాణ అని ముద్రించారు. ఇంటిల్లిపాదికి 'తెలంగాణ' పదాన్ని ఇచ్చేశారు. వార్డుల వారీగా ఓటరు సర్వేతో పాటు ఫొటో ఐడెంటిఫికేషన్ సమయంలో.. క్షేత్రస్థాయిలో పనిచేయక పోవడంతోనే తప్పిదాలకు ఆస్కారం కలిగిందని చెబుతున్నారు. ఇదిలా ఉంటే కులాల మార్పిడి దుమారం రేపుతోంది. ఓసీలను బీసీగా.. బీసీలను ఎస్సీలుగా అక్కడక్కడా మార్చడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. 3వ వార్డుకు చెందిన ఓసీ కులానికి చెందిన దొంతుల భిక్షపతి కుటుంబాన్ని బీసీగా, బీసీ కులానికి చెందిన వారిని ఓసీగా మార్చడంతో గురువారం పురపాలక సంఘ కార్యాలయానికి వెళ్లి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఓసీ నుంచి బీసీకి మార్చడంతో.. తమకు అదే సర్టిఫికెట్ ఇవ్వాలని భిక్షపతి కుటుంబ సభ్యులు అధికారులను డిమాండ్ చేశారు. ఏ ప్రాతిపదికన కులం పేరు మార్చారు.. వాటి వివరాలను చూపించాలని ప్రశ్నించారు.



555	ఎ.సి -పి.ఎస్ - వరుస సంఖ్య. : 98 - 260 - 1031
పేరు	:సోనబీర్ యుక్లోటి
తండ్రి పేరు	:TELANGANA
వయసు	:61 లింగ : :M
డోర్ నెం.	:4-6-4
ఓటరు ఐడి.	YQK1550672

తండ్రి పేరుకు బదులుగా తెలంగాణ



13	ఎ.సి -పి.ఎస్ - వరుస సంఖ్య. : 98 - 260 - 47
పేరు	:మీరాబాయి జంజోటు
భర్త పేరు	:TELANGANA
వయసు	:60 లింగ : :F
డోర్ నెం.	:4-6-4
ఓటరు ఐడి.	DFY2345460

భర్తకు బదులు తెలంగాణ

- కామారెడ్డి జిల్లా కన్నారెడ్డిలో రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొనడంతో 20 మంది ప్రయా ణికులు గాయపడ్డారు.

పీవీ ఇంటిని మ్యూజియంగా మారుస్తాం

భీమదేవరపల్లి: వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలోని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఇంటిని దసరాలోగా మ్యూజియంగా మార్చనున్నట్లు పీవీ కుమారుడు ప్రభాకర్‌రావు వెల్లడించారు. గురువారం ఆయన వంగర గ్రామాన్ని సందర్శించారు. పీవీ రచించిన గ్రంథాలు, రచనలతో పాటు గ్రామస్తులకు, విద్యార్థులకు ఉపయోగపడే విధంగా లైబ్రరీని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కళ తప్పిన జలపాతాలు



గతేడాది ఈ సమయానికి జల కళతో కళకళలాడిన కుంటాల, పొచ్చర జలపాతాలు ఈ సంవత్సరం జల ధారలు లేక వెలవెలబోతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి జలపాతాలకు వచ్చిపోయే పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచలేకపోతున్నాయి. ఈ సమయానికి జలపాతాలు నీళ్లతో నిండుగా కనిపిస్తాయని అనుకొని వచ్చే ప్రకృతి ప్రియులకు రాళ్లు, రప్పలు మాత్రమే కనబడుతున్నాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

కూరెళ్లకు దాశరథి పురస్కారం

రామన్నపేట: ప్రముఖ సాహితీవేత్త, రచయిత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యను దాశరథి పురస్కారం వరించింది. జూలై 22న దాశరథి కృష్ణమాచార్యుల జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం దాశరథి పురస్కారాన్ని అందజేస్తోంది. 2019 సంవత్సరానికిగాను ప్రభుత్వం కూరెళ్లను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన కూరెళ్ల లక్ష్మమ్మ-వెంకటరాజయ్యల కుమారుడు కూరెళ్ల విఠలాచార్య. ఆయన ఏడవ తరగతి నుంచే తన రచనా వ్యాసాంగాన్ని ప్రారంభించారు. కూరెళ్ల రాసిన 18కి పైగా గ్రంథాలు ఇప్పటివరకు ముద్రితమయ్యాయి. ఆయన సాహితీరంగానికే పరిమితంకాక జిల్లా వ్యాప్తంగా పలు సాంస్కృతిక సంస్థలు, యువజన సంఘాలను నెలకొల్పి సామాజిక సేవా కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నారు. ఆయనకు మధురకవి, అభినవ పోతన, తెలంగాణ వేమన, నల్లగొండ కాళోజీ తదితర బిరుదులు ఉన్నాయి.

డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య

నీట్ సూపర్ స్పెషాలిటీలో అశోక్‌రెడ్డికి 2వ ర్యాంకు

బెజ్జంకి: నీట్ సూపర్ స్పెషాలిటీ ప్లాస్టిక్ సర్జరీ కోర్సులో సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం కల్లెపెల్లికి చెందిన అశోక్‌రెడ్డి జాతీయ స్థాయిలో 2వ ర్యాంకు సాధించాడు. తిరుపతిలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన అశోక్‌రెడ్డి 2018లో ముంబైలో జనరల్ సర్జరీ విభాగంలో పీజీ పూర్తి చేశాడు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రాక్టీస్ చేస్తూనే నీట్ పరీక్షలు రాసి జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన అశోక్‌రెడ్డిని స్థానిక ప్రజలు అభినందించారు.

హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్
HP ల్యూబ్రికెంట్స్ కోసం క్లియరింగ్ & ఫార్వార్డింగ్ ఏజెంట్స్ (CFAs) నియామకం
సవరణ
19-6-2019న వార్తాపత్రికలలో అనంతపురం & నల్గొండ జిల్లాల కోసం HP ల్యూబ్రికెంట్స్ కొరకు క్లియరింగ్ & ఫార్వార్డింగ్ ఏజెంట్స్ (CFAs) నియామకం కొరకు ప్రచురింపబడిన ప్రకటనను రిఫర్ చేయండి. ఫారం దాఖలుకు ఆఖరి తేది 31-7-2019 వరకు పొడిగించబడినది
INDIA'S LARGEST LUBE MARKETER

తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయం : నిజామాబాద్
ఫోన్ నెం. 6-2-166/ఎ, సుభాష్ నగర్, నిజామాబాద్ - 503 002
అదనపు సమాచారం
తేది: 18-07-2019న ప్రచురితమైన M/s. ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్, దేవాపూర్ (గ్రా), కాసిపేట (మం), మంచిర్యాల జిల్లా వారి పర్యావరణ బహిరంగ విచారణ తేది: 20.08.2019 సమయం: ఉ॥ 11.00 గం॥లకు గ్రామ పంచాయతి కార్యాలయం, దేవాపూర్ (గ్రా), కాసిపేట (మం), మంచిర్యాల జిల్లాలో జరుగును అని గమనించగలరు.

SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF TELANGANA LTD.
SHORT TENDER NOTICE :: TENDER NOTICE No. 02/2019-20
Sealed tenders are invited from eligible contractors Carrying out various Electrical Works in Operation Division, Jadcherla in Mahabubnagar Circle.
Issue Last date : 30-07-2019 upto 17.00 Hrs.
Submission Last date : 31-07-2019 upto 16.00 Hrs.
All Information can be obtained from the website: www.tssouthernpower.com
Fax No.: 08542-233380 & Phone No.: 08542-233380. Sd/-
Tender ID No: SPDCLMBN01071 Divisional Engineer, Operation, Jadcherla

TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION
Pratibha Bhavan, M.J. Road, Nampally, Hyderabad
DEPARTMENTAL TESTS - MAY - 2019 SESSION
Vide Commission's NOTIFICATION NO. : 03/2019
TSPSC has conducted Written Examination for the above notification from 08-06-2019 to 17-06-2019 through CBRT for objective type papers. The Response Sheets of these objective type exams will be available on TSPSC website from 19-07-2019. For further details please visit www.tspsc.gov.in.
Date : 18-07-2019 Sd/- SECRETARY
DIPR RO. No.258-PP/CL/ADVT/1/2019-20, Dt: 18/7/2019

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
CIN No. U40109TG2000SGC034119
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
పని పేరు: TSNPDCLలోని వివిధ ఆపరేషన్ సర్కిళ్ళకు 8.0mt/ 140kg గల PSCC పోల్స్ తయారీ మరియు సరఫరా.

క్ర.సం.	పని పేరు	పరిమాణము	సుమారు విలువ (రూ. కోట్లలో)
1	8.0mt/ 140kg PSCC పోల్స్ తయారీ మరియు సరఫరా	242000	38.12

ఐయానా : కోట్ చేసిన విలువలో 2% : కాంట్రాక్టు కాలము : 12 నెలలు
టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ తేది : 15-07-2019 నుండి 14-08-2019 17.00 గం. వరకు
ఆన్‌లైన్ & ఆఫ్‌లైన్ టెండరు దాఖలు తేది : 16-08-2019న 13.00 గం. వరకు
సాంకేతిక బిడ్ తెరుచు తేది : 21-08-2019న 15.00 గం.కు
ధర బిడ్ తెరుచు తేది : 28-08-2019న 11.00 గం.కు
వివరమైన టెండరు నోటీసుకు సంబంధించి తదుపరి వివరాల కోసం www.tsnpdcl.in మరియు www.tender.telangana.gov.in. దర్శించండి. డిజిటల్ కీ పొందడానికి www.tsts.in దర్శించండి.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్/P&MM/TSNPDCL/వరంగల్

తిరుమల తిరుపతి దేవస్థానములు: తిరుపతి
SE-III సర్కిల్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Adv. No.13/SE-IV/TTD/TPT/2019-20 తేది: 18-07-2019
SE-III సర్కిల్‌లో (32) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై ఇ-టెండర్లు కోరబడుచున్నవి. NIT నంబర్లు దిగువ విధంగా ఉన్నవి:

SE-III	NIT నం. 36/SE-IV/TTD/2019-20 నుండి NIT నం. 38/SE-IV/TTD/2019-20 (3 పనులు)
EE-III	NIT నం. 30/EE-III/TTD/2019-20 నుండి NIT నం. 32/EE-III/TTD/2019-20 (3 పనులు)
EE-XI	NIT నం. 42/EE-XI/TTD/2019-20 నుండి NIT నం. 61/EE-XI/TTD/2019-20 (20 పనులు)
EE-XII	NIT నం. 44/EE-XII/TTD/2019-20 నుండి NIT నం. 49/EE-XII/TTD/2019-20 (6 పనులు)

వివరాల కోసం www.tirupati.orgకి లేదా www.tirumala.orgకి లాగాన్ చేయండి. పని వివరాల కోసం https://tender.apeprocurement.gov.inకు లేదా http://www.apeprocurement.gov.inకు లాగిన్ చేయండి.
Roc. No.PR4/13908/Adv.No.169/PRO/2019, Dt: 18-07-2019 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్య మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No.51/SE/TS/TUFIDC/Yellandu/General/2019-20/75, 51/SE/TUFIDC/Sathupalli/2019-20/73 & 51/SE/TUFIDC/Unit-1/GWMC/2018-19/63, తేది: 16.07.2019. ఎల్లందు, సత్తుపల్లి మున్సిపాలిటీలలో మరియు Gr. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లలో పార్కుల అభివృద్ధి, CC రోడ్లు, డ్రెయిన్లు, BT రోడ్లు వేయుట, ముస్లిం కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం మొ.న పనులు చేపట్టుటకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ.263.03 లక్షలు. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ మరియు ముగింపు తేది: 18.07.2019 నుండి 25.07.2019. ఫోన్ నం.9849906143, మెయిల్ ఐడి: se.unit1.tufidc@gmail.com. తదుపరి వివరాలకు దర్శించండి: https://tender.telangana.gov.in
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, (PH), యూనిట్-I, TUFIDC, వరంగల్
DIPR RO. No.664-DP/CL/ADVT/1/2019-20, Dt: 18.7.2019

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్య & మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్
NIT No.01 to 07, 41, 36 & 08/SE/TUFIDC/UNIT-III/MBNR/2019-20, తేది: 17.07.2019 (3వ పిలుపు) మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో జంక్షన్ అభివృద్ధి, విగ్రహాలు, క్లాక్‌టవర్ జంక్షన్, రైల్వే స్టేషన్ జంక్షన్ అభివృద్ధి, ఆధునిక శ్మశాన వాటిక, BT రోడ్లు, కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం మొ॥ పనులు చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV : రూ.1372.00 లక్షలు. బిడ్ల దాఖలు ప్రారంభ & ముగింపు తేది : 18.07.2019 నుండి 25.07.2019. ఫోన్ నం. : 7416421348, మెయిల్ ID : se.unit3.tufidc@gmail.com తదుపరి వివరాలకు : https://tender.telangana.gov.in
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH), యూనిట్ III, TUFIDC, మహబూబ్‌నగర్
DIPR RO. No.662-DP/CL/ADVT/1/2019-20, Dt: 18.7.2019

TELANGANA STATE COUNCIL OF HIGHER EDUCATION HYDERABAD
DEPARTMENT OF TECHNICAL EDUCATION
TSEAMCET-2019 ADMISSIONS
FINAL PHASE NOTIFICATION
PAYMENT OF PROCESSING FEE, SLOT BOOKING, CERTIFICATE VERIFICATION AND OPTION EXERCISE FOR WEB BASED COUNSELLING.
The Qualified candidates of TSEAMCET-2019 who have participated or not participated in first phase of counselling and desirous of seeking admission B.E/ B.Tech/ Pharmacy Courses are informed that final phase web counselling will commence on 24-07-2019. Further details of final phase counselling schedule is placed in the website: https://tseamcet.nic.in
Date:17-07-2019 Sd/- Navin Mittal, IAS
Place: Hyderabad Convenor, TSEAMCET- 2019 & CTE
DIPR Ro.No.666-DP/CL/Advt/1/2019-20, Dt:18-07-2019

కర్నాటకం క్లైమాక్స్ నేడే

విధానసౌధలో మంత్రులతో మాట్లాడుతున్న సీఎం కుమారస్వామి



విధానసౌధలో ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్న యడ్యూరప్ప

మధ్యాహ్నం 1.30 గంటల్లోగా మెజారిటీ నిరూపించుకోవాలని సీఎంకు గవర్నర్ ఆదేశం

- హైడ్రామా మధ్య విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సీఎం కుమారస్వామి
- జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరిన బీజేపీ
- బలపరీక్ష పూర్తిచేయాలన్న గవర్నర్ సూచనను పట్టించుకోని స్పీకర్
- విప్‌ల జారీని తేల్చాకే బలపరీక్ష చేపట్టాలన్న సీఎల్పీ నేత సిద్ధరామయ్య

సాక్షి బెంగళూరు/ముంబై/న్యూఢిల్లీ: కర్ణాటక అసెంబ్లీ 'విధానసౌధ'లో గురువారం విశ్వాస పరీక్ష సందర్భంగా హైడ్రామా నెలకొంది. ముఖ్యమంత్రి కుమారస్వామి శాసనసభ ప్రారంభం కాగానే 'ఈ సభ నా నేతృత్వంలోని మంత్రివర్గంపై విశ్వాసం ఉంచుతోంది' అని ఏకవాక్య విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా 15 మంది రెబెల్ ఎమ్మెల్యేలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అయితే ఈరోజే విశ్వాసపరీక్షను పూర్తిచేయాలని ప్రతిపక్ష నేత బీఎస్ యడ్యూరప్ప స్పీకర్ రమేశ్‌ను డిమాండ్ చేయడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. వెంటనే రంగంలోకి దిగిన సీఎల్పీ నేత సిద్ధరామయ్య రెబెల్ ఎమ్మెల్యేలకు విప్ జారీచేసేందుకు వీలుగా రూలింగ్ ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. ఈ విషయమై తాను అడ్వొకేట్ జనరల్‌ను సంప్రదించి నిర్ణయం తీసుకుంటానని స్పీకర్ ప్రకటించడంతో బీజేపీ ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. దీంతో వారికి పోటీగా కాంగ్రెస్ నేతలు కూడా ఆందోళన చేయడంతో సభ మూడుసార్లు వాయిదాపడింది. ఈ సందర్భంగా బీజేపీ ప్రతినిధుల బృందం గవర్నర్ వజూభాయ్‌వాలాను కలుసుకున్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. చివరికి స్పీకర్ న్యాయ సలహా కోసం వెళ్లిపోవడంతో డిప్యూటీ స్పీకర్ కృష్ణారెడ్డి అసెంబ్లీని శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే రామలింగారెడ్డి తన రాజీనామాను గురువారం ఉపసంహరించుకున్నారు.

దేశానికి నిజాలు చెప్పాలి: కుమారస్వామి

విధానసౌధలో గురువారం జరిగిన విశ్వాసపరీక్షకు అధికార కూటమికి చెందిన 17 మంది ఎమ్మెల్యేలు(రెబెల్స్‌తో కలిపి) గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో కుమారస్వామి మాట్లాడుతూ..'తిరుగుబాటు ఎమ్మెల్యేలు మా సంకీర్ణ ప్రభుత్వంపై దేశమంతటా పలు అనుమానాలు నెలకొనేలా చేశారు. మా ప్రభుత్వం ఐఎంఎ కుంభకోణం, జేఎస్‌డబ్ల్యూ కుంభకోణంలో చిక్కుకుందని నిరాధార ఆరోపణలు చేశారు. కాబట్టి ఈ విషయంలో మేం దేశ ప్రజలకు నిజాలు చెప్పాల్సిన అవసరముంది. ప్రస్తుతం దేశమంతా కర్ణాటకవైపు చూస్తోంది' అని తెలిపారు. వెంటనే ప్రతిపక్ష నేత, కర్ణాటక బీజేపీ చీఫ్ యడ్యూరప్ప స్పందిస్తూ..'విశ్వాసపరీక్ష ప్రక్రియ మొత్తం ఒక్కరోజులోనే పూర్తికావాలి' అని డిమాండ్ చేశారు. దీంతో 'చూస్తుంటే ప్రతిపక్ష నేతకు తొందర ఎక్కువైనట్లు ఉంది' అని కుమారస్వామి వ్యంగ్యంగా జవాబిచ్చారు. ఈ సందర్భంగా రెబెల్ ఎమ్మెల్యేలకు విప్ జారీచేయడంపై తుది నిర్ణయం తీసుకునేవరకూ విశ్వాసపరీక్షను వాయిదా వేయాలని సీఎల్పీ నేత సిద్ధరామయ్య స్పీకర్‌ను కోరారు. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ రెబెల్ ఎమ్మెల్యేలు పార్టీ విప్‌ను ధిక్కరించే అవకాశముందనీ, కాబట్టి ఈ విషయంలో రూలింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను పరిష్కరించకుండా విశ్వాసపరీక్షను చేపడితే అది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. దీంతో ఈ వ్యవహారంలో తాను అడ్వొకేట్ జనరల్ సలహా ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. దీంతో స్పీకర్ కావాలనే విశ్వాసపరీక్షను ఆలస్యం చేస్తున్నారని బీజేపీ సభ్యులు అసెంబ్లీలో ఆందోళనకు దిగారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే అదృశ్యం..

అసెంబ్లీలో విశ్వాసపరీక్షకు ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీమంత్ పాటిల్ అదృశ్యమయ్యారు. దీంతో సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీయే తమ ఎమ్మెల్యేను కిడ్నాప్ చేసిందని మంత్రి డి.కె.శివకుమార్ విధానసౌధలో ఆరోపించారు. 'పాటిల్‌ను కిడ్నాప్ చేసి ముంబైలోని ఆసుపత్రిలో బలవంతంగా చేర్పించారు. ఆయన కుటుంబ సభ్యుల నుంచి నాకు ఫోన్‌వచ్చింది. పాటిల్ వెంట బీజేపీ నేత లక్ష్మణ్ సవది ఉన్నారు. నేను రెండు చేతులు జోడించి మిమ్మల్ని(స్పీకర్‌ను) ఒక్కటే కోరుతున్నా. మా ఎమ్మెల్యేను వెనక్కి తీసుకురండి సార్. మాకు పోలీస్ భద్రత కావాలి. పాటిల్‌ను బలవంతంగా తరలించారనడానికి నా దగ్గర సాక్ష్యాలున్నాయి' అని తెలిపారు. ఈ సందర్భంగా పాటిల్ ఫొటోలతో వెల్‌లోకి దూసుకెళ్లిన కాంగ్రెస్ సభ్యులు 'బీజేపీ డౌన్‌డౌన్' 'ఆపరేషన్ కమల డౌన్‌డౌన్' అని నినాదాలు చేశారు. అయితే సంఖ్యాబలం లేకపోవడంతోనే కాంగ్రెస్ నేతలు నాటకాలు ఆడుతున్నారని బీజేపీ విమర్శించింది. దీంతో స్పీకర్ రమేశ్ స్పందిస్తూ..'అంటే నేను కళ్లు మూసుకుని నాకు ఏమీ సంబంధం లేనట్లు కూర్చోవాలా? అసలు మనం ఎటువైపు పోతున్నాం. ఛాతి నొప్పి ఉండటంతో తాను ఆసుపత్రిలో చేరినట్లు పాటిల్ నుంచి లేఖ అందింది. ఇది సహజంగా అనిపించడం లేదు. ఈ విషయంలో ఎమ్మెల్యే కుటుంబీకులతో మాట్లాడి నాకు నివేదిక అందించండి' అని హోంమంత్రి ఎంబీ పాటిల్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీమంత్ పాటిల్ అదృశ్యంపై కాంగ్రెస్ నేతలు బెంగళూరు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే తననెవరూ కిడ్నాప్ చేయలేదనీ, సొంతపనిపై బుధవారం ముంబైకి రాగా ఛాతిలో నొప్పి రావడంతో ఆసుపత్రిలో చేరానని శ్రీమంత్ పాటిల్ ఓ వీడియోను విడుదల చేశారు.

అసెంబ్లీలోనే బీజేపీ ధర్నా..

విశ్వాసతీర్మానంపై కనీసం 15 నిమిషాలు కూడా సభలో చర్చించలేదని విమర్శించారు. ఇందుకు నిరసనగా తాము విధానసౌధలోనే నిద్రపోతామని తెలిపారు. సభలో విశ్వాసపరీక్ష ఎప్పుడు జరుగుతుందో ఖరారయ్యేవరకూ ఈ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో సుప్రీంకోర్టుకు వెళ్లే అంశాన్ని బీజేపీ ముఖ్యనేతలు పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. 2018లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఇది మూడో విశ్వాసపరీక్ష తీర్మానం కావడం గమనార్హం. మొదటగా సీఎం యడ్యూరప్ప తగిన సంఖ్యాబలం లేక విశ్వాసపరీక్షకు 3 రోజులముందే రాజీనామా చేయగా, రెండోసారి కుమారస్వామి నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం బలపరీక్షలో నెగ్గింది.

అసెంబ్లీలో బలాబలాలు

ఒకవేళ రెబెల్స్ రాజీనామాలను వెనక్కి తీసుకోకుంటే

మొత్తం ఎమ్మెల్యేలు : 225 | రాజీనామాలు : 15 (12 కాంగ్రెస్+3 జేడీఎస్)

రాజీనామాలు ఆమోదం పొందితే మిగిలేవారు : 210



గవర్నర్‌తో బీజేపీ బృందం భేటీ

విశ్వాసపరీక్ష ఆలస్యమయ్యే అవకాశమున్న నేపథ్యంలో బీజేపీ నేతలు చురుగ్గా పావులు కదిపారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగానే మాజీ సీఎం జగదీశ్ షెట్టర్ నేతృత్వంలో బీజేపీ ప్రతినిధి బృందం గవర్నర్ వజూభాయ్‌వాలాను కలుసుకుంది. ముఖ్యమంత్రి కుమారస్వామి ప్రవేశపెట్టిన తీర్మానం ఆధారంగా వెంటనే విశ్వాసపరీక్ష జరిపేలా స్పీకర్ రమేశ్ కుమార్‌ను ఆదేశించాలని వినతిపత్రాన్ని సమర్పించింది. మైనారిటీ ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి అధికార కూటమి కుయుక్తులు పన్నుతుందన్న భయం తమకు ఉందని ఈ సందర్భంగా జగదీశ్ షెట్టర్ అన్నారు. దీంతో 'సీఎం సభలో ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానంపై గురువారంలోగా నిర్ణయం తీసుకోండి' అని వజూభాయ్‌వాలా స్పీకర్‌ను ఆదేశించారు. దీంతో స్పీకర్ రమేశ్ కుమార్ ఈ సందేశాన్ని సభలో చదివి వినిపించారు. మరోవైపు బీఎస్పీ అధినేత్రి మాయావతి నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఆ పార్టీ ఏకైక ఎమ్మెల్యే మహేశ్ బలపరీక్షకు దూరంగా ఉన్నారు.

కుమారస్వామికి గవర్నర్ లేఖ

కర్ణాటక రాష్ట్ర గవర్నర్ వజూభాయ్‌వాలా ముఖ్యమంత్రి కుమారస్వామికి లేఖ రాశారు. శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటల్లోగా అసెంబ్లీలో మెజారిటీని నిరూపించుకోవాలని సీఎంను ఆయన ఆదేశించారు. 'విశ్వాసపరీక్ష తీర్మానాన్ని రాష్ట్ర అసెంబ్లీలో ఇప్పటికే ప్రవేశపెట్టిన నేపథ్యంలో రాష్ట్రానికి అధిపతిగా ఈ వ్యవహారంలో నేను జోక్యం చేసుకోకూడదు. కానీ ఈ తీర్మానంపై ఎలాంటి తుదినిర్ణయం తీసుకోకుండా సభ పదేపదే వాయిదా పడుతోందని నాకు ఫిర్యాదు అందింది. భారత రాజ్యాంగం ప్రకారం ఇలాంటి ఘటనలు చోటుచేసుకునేందుకు వీల్లేదు' అని తెలిపారు. 15 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రాథమికంగా మెజారిటీని కోల్పోయిందని అభిప్రాయపడ్డారు. కాగా, గవర్నర్ ముఖ్యమంత్రి కుమారస్వామికి లేఖరాసిన విషయాన్ని మంత్రి డి.కె.శివకుమార్ ధ్రువీకరించారు.

విప్ అంటే?

చట్టసభల్లో ఏదైనా కీలకాంశం చర్చకు వచ్చిన సందర్భాల్లో, లేదంటే ఫలానా తరహాలోనే ప్రజాప్రతినిధులు వ్యవహరించాల్సి ఉంటుందని రాజకీయ పార్టీలు భావించిన సందర్భాల్లో తమ సభ్యులకు విప్‌లను పార్టీ జారీచేస్తాయి. ఇది ఏకవాక్య విప్, రెండులైన్ల విప్, మూడులైన్ల విప్ అని మూడురకాలుగా ఉంటుంది. సభలో కోరం(కనీస సభ్యులు) ఉండాలని భావించినప్పుడు పార్టీలు ఏకవాక్య విప్‌ను జారీచేస్తాయి. సభలో ఓటింగ్ సందర్భంగా హాజరుకావాలని తమ సభ్యులకు రాజకీయ పార్టీలు రెండు లైన్ల విప్‌ను జారీచేస్తాయి. సభలో ముఖ్యమైన బిల్లుపై రెండోసారి చర్చ జరిగినప్పుడు, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే సందర్భాల్లో సభ్యులు తప్పనిసరిగా తమ ఆదేశాలమేర నడుచుకోవాలని పార్టీలు మూడు లైన్ల విప్‌ను జారీచేస్తాయి. వీటిలో మూడులైన్ల విప్‌ను ఉల్లంఘించే చట్టసభ్యులు ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటును ఎదుర్కొంటారు.

తమిళనాట ప్రమాదాల్లో 16 మంది మృతి

సాక్షి ప్రతినిధి, చెన్నై: తమిళనాడులో గురువారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 16 మంది మృతి చెందారు. కోయంబత్తూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న మినీ బస్సు.. ఉత్తిరమేరూరు నుంచి కాంగేయం వైపు వెళ్తున్న వ్యాన్ తెల్లవారుజామున కల్లకురిచ్చి దగ్గర ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో 10 మంది చనిపోయారు. విరుదునగర్ జిల్లా శివకాశికి చెందిన ఓ కుటుంబం బంధువులతో కలిసి వ్యానులో తిరుచెందూరు ఆలయానికి బయలుదేరింది. అర్ధరాత్రి దాటిన తర్వాత తూత్తుకుడి జిల్లా సెయిందుగనల్లూరు సమీపంలోని వంతెనపై వారి వాహనం అదుపు తప్పి 20 అడుగుల లోతైన లోయలో పడింది. ఈ ఘటనలో ఆరుగురు చనిపోయారు.

రెండేళ్లలో సొంత క్యాంపస్‌కు మార్చాలి

న్యూఢిల్లీ: రాష్ట్రాలకు కేటాయించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)లకు రెండేళ్లలో సొంత భవనాలు కేటాయించకపోతే ఉపేక్షించేది లేదని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) కొత్త నిబంధనల ప్రకారం ఐఐటీ, ఐఐఐటీలకు నిర్దేశించిన గడువులోగా శాశ్వత భూములు కేటాయించాలని పేర్కొంది. లేకపోతే ఆ రాష్ట్రాలకు కేటాయించిన ఐఐటీ, ఐఐఐటీలను వేరే రాష్ట్రాలకు తరలిస్తామని తెలిపింది. శాశ్వత క్యాంపస్ ఏర్పాటు 50 శాతం పూర్తయితే మరో రెండేళ్ల పొడిగింపు ఉంటుందని ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు.

ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ: ప్రజలపై పన్ను భారం తగ్గించడం, మరిన్ని సౌకర్యాలు కల్పించడమే బడ్జెట్ ప్రతిపాదనల లక్ష్యమని ఆర్థిక మంత్రి సీతారామన్ గురువారం లోక్‌సభకు తెలిపారు. అయితే, పెట్రోల్, డీజిల్‌పై సెస్‌తోపాటు, క్యాష్ విత్‌డ్రాయల్స్‌పై 2 శాతం టీడీఎస్ ఎత్తివేయాలంటూ ప్రతిపక్షాలు చేసిన డిమాండ్‌ను మాత్రం ఆమె తిరస్కరించారు. నగదు రహిత ఆర్థిక వ్యవస్థ సాధనకు ఈ బడ్జెట్‌లో పలు ప్రతిపాదనలు చేసినట్లు వివరించారు. కాగా, చట్టపరమైన కార్యక్రమాలు మిగిలి ఉన్న దృష్ట్యా పార్లమెంట్ సమావేశాలను రెండు, మూడు రోజులు పొడిగించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. 'పార్లమెంట్ సమావేశాలను రెండు లేక మూడు రోజులపాటు పొడిగించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ఈ అంశంపై బీజేపీ నేతలు ప్రతిపక్షాలతో చర్చించనున్నారు' అని అధికార వర్గాలు తెలిపాయి. షెడ్యూల్ ప్రకారం జూన్ 17వ తేదీన మొదలైన 17వ లోక్‌సభ సమావేశాలు ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగాల్సి ఉంది.

పాన్పుపై సేదతీరిన పులి!

అస్సాంలోని కజిరంగా జాతీయ పార్కు ప్రాంతంలో ఉన్న చిన్న గ్రామమది. పేరు హర్మోతి. మోతీలాల్ ఎప్పటిలాగే గురువారం ఉదయాన్నే తన పాత సామాను దుకాణంలో కూర్చున్నాడు. అంతలో బయట నుంచి 'పులి పులి' అంటూ పెద్దగా అరుపులు వినిపించాయి. ఎంతో చూద్దామని దుకాణం బయట కొచ్చిన మోతీలాల్‌కు గుండె ఆగినంత పనైంది. ఆయనకు ఎదురుగా కేవలం 20 అడుగుల దూరంలో బెంగాల్ టైగర్ ఉంది. అది మోతీలాల్ వైపే వస్తోంది. గాండ్రిస్తూ పెద్ద పులి తన వైపే వస్తుండటంతో మోతీలాల్ శరీరం భయంతో మొద్దుబారి అక్కడే అలాగే నిల్చుండిపోయాడు. అయితే, బాగా అలిసిపోయినట్టు కనిపిస్తున్న ఆ పులి అతని కళ్లల్లోకి ఓసారి చూసి నెమ్మదిగా.. అతని పక్కనుంచి దుకాణంలో పలికి వెళ్లింది. విశ్రాంతి తీసుకునేందుకు దుకాణంలోపల ఉన్న మంచంపై సెటిలైంది. పులి లోపలికి వెళ్లిపోగానే బతికితే చాలురా బాబు అనుకుంటూ అక్కడి నుంచి పరుగెత్తాడు మోతీలాల్. గ్రామంలోని పశువైద్యుడు శాంశుల్ అలీ అటవీ శాఖ అధికారులకు వెంటనే ఈ విషయం చేరవేశాడు. దీంతో అధికారుల బృందం హుటాహుటిన అక్కడికొచ్చింది. భారీ వర్షాల కారణంగా కజిరంగా జాతీయ పార్కు భూభాగం 95శాతం నీట మునిగిందని, దాంతో ప్రాణాలు కాపాడుకునేందుకు ఇతర వన్యప్రాణుల్లాగే పులి కూడా జనావాసాల్లోకి వచ్చిందని అధికారుల అంచనా. పులికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి మళ్లీ పార్కులోకి తీసుకెళ్లి వదిలేయాలా? లేక తన దారిని అది పోయేదాకా వేచిఉందామా అని అధికారులు ఆలోచిస్తున్నారు.

దుకాణంలోని బెడ్‌పై పులి

హెచ్1బీ ఫీజుతో అమెరికన్లకు శిక్షణ

వాషింగ్టన్: దేశీయ కంపెనీల్లో నిపుణుల కొరత తీర్చేందుకు హెచ్1-బీ వీసా ఫీజు డబ్బుతో అమెరికన్లకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టినట్లు వాణిజ్య మంత్రి విల్బర్ రాస్ తెలిపారు. వివిధ కంపెనీలే అమెరికన్లకు శిక్షణ ఇచ్చేలా ట్రంప్ యంత్రాంగం 'ఇండస్ట్రీ-రికగ్నైజ్డ్ అప్రెంటిస్‌షిప్ సిస్టం' అనే విధానం తెచ్చింది. హెచ్1బీ వీసా ఫీజు డబ్బు సుమారు రూ.688 కోట్లను కార్మిక శాఖ 30 రకాల అప్రెంటిస్ షిప్ గ్రాంట్‌గా అందజేసిందన్నారు. ఈ ఫీజును విదేశీ ఉద్యోగులను నియమించుకున్న కంపెనీలే ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం సైబర్ సెక్యూరిటీ, కృతిమ మేధ రంగాల్లో అమెరికన్ నిపుణులకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

అధికారుల వల్లే 'హెచ్1బీ' జాప్యం

అమెరికా వలస విభాగం విధానాల కారణంగా హెచ్1-బీ జారీ ప్రక్రియ ఆలస్యమవుతోందని అమెరికా కాంగ్రెస్ సభ్యురాలు సుసాన్ ఎలెన్ లోఫ్‌గ్రెన్ ఆందోళన వ్యక్తం చేశారు. దరఖాస్తు దారులు ఒకసారి పంపిన వివరాలనే మళ్లీపంపాలని అడుగుతున్నారని, అనవసరమైన సమాచారం కావాలంటున్నారన్నారు. హెచ్1బీ దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టిన ఘటనలు 2016తో పోలిస్తే 20 శాతం పెరిగాయని అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మర్కెటా చెప్పారు.

'శరవణ' రాజగోపాల్ కన్నుమూత

చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

సాక్షి ప్రతినిధి, చెన్నై: దక్షిణ భారత ఆహారాన్ని అందించడంలో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన శరవణ భవన్ హోటళ్ల గ్రూప్ అధినేత పి.రాజగోపాల్ (73), కోర్టు విధించిన యావజ్జీవ జైలు శిక్షను అనుభవించడానికి ముందే గురువారం కన్నుమూశారు. 2001లో ఓ ఉద్యోగిని హత్య చేసిన కేసులో రాజగోపాల్ యావజ్జీవ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంది. ఇందుకోసం ఆయన పది రోజుల క్రితమే కోర్టులో లొంగిపోయారు కూడా. ఆ వెంటనే అనారోగ్యం కారణంగా రాజగోపాల్ ఆసుపత్రిలో చేరారు. చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం 10 గంటలకు మరణించారు. ఆయన అనారోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలను వైద్యులు వెల్లడించలేదు. జ్యోతిష్యుడు చెప్పాడంటూ తన దగ్గర పనిచేస్తున్న ఓ ఉద్యోగి కూతురిని రాజగోపాల్ మూడో పెళ్లిచేసుకోవాలనుకోగా, అందుకు ఆమె ఒప్పుకోకుండా శరవణ భవన్‌లోనే పనిచేస్తున్న శాంతకుమార్ అనే ఉద్యోగిని వివాహం చేసుకుంది. దీంతో ఎలాగైనా ఆమెను పెళ్లిచేసుకునేందుకు శాంతకుమార్‌ను రాజగోపాల్ హత్య చేయించాడు. ఈ కేసులో రాజగోపాల్‌తోపాటు మరో ఎనిమిది మందికి జైలు శిక్ష పడింది. ఆ శిక్షను అనుభవించకుండానే రాజగోపాల్ గురువారం కన్ను మూశాడు. కాగా, రాజగోపాల్ స్థాపించిన శరవణ భవన్ హోటళ్లు ఇండియాలోని పలు నగరాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా అమెరికా, బ్రిటన్ సహా 20 దేశాల్లో విస్తరించి ఉన్నాయి.

రాజగోపాల్ (ఫైల్)

మాయా సోదరుడి 400 కోట్ల స్థలం అటాచ్

న్యూఢిల్లీ: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్‌పీ) అధినేత్రి మాయావతి సోదరుడికి చెందిన రూ.400 కోట్ల విలువైన ప్లాట్‌ను ఆదాయపన్ను శాఖ(ఐటీ) అటాచ్ చేసింది. దేశ రాజధాని ప్రాంతం(ఎన్‌సీఆర్)లోని నొయిడాలో ఏడెకరాల్లో బినామీ పేరుతో ఉన్న ఈ స్థలం అసలు యజమాని మాయా సోదరుడు ఆనంద్ కుమార్, అతని భార్యకు చెందినట్లుగా ఐటీ అనుమానిస్తోంది. కాగా, కుమార్‌ను బీఎస్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడిగా మాయావతి ఇటీవల నియమించిన విషయం తెలిసిందే. ఢిల్లీ కేంద్రంగా పనిచేసే ఐటీకి చెందిన బినామీ ప్రొహిబిషన్ యూనిట్(బీపీయూ) ఈ మేరకు ఈ నెల 16వ తేదీన అటాచ్‌మెంట్ ఉత్తర్వులు వెలువరించింది. నోయిడాలోని సెక్టర్ 94లో 28వేలకు పైగా చదరపు మీటర్లు అంటే సుమారు ఏడెకరాల వాణిజ్య భూమిలో ఫైవ్‌స్టార్ హోటల్, ఇతర నిర్మాణాలు చేపట్టాలని ఆనంద్‌కుమార్, అతని భార్య విచితర్ లత ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే, ఇది వారి పేరు బదులు మరొకరి పేరుతో ఉంది.

మార్కెట్‌లో ఈ భూమి విలువ రూ.400 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ భూమి కొనుగోలు కోసం ఆరు బినామీ కంపెనీలను సృష్టించి వాటి ద్వారా అక్రమ సంపాదనను హవాలా మార్గంలో మళ్లించినట్లు ఐటీ విభాగం అనుమానిస్తోంది. బినామీ చట్టం-1988ని మోదీ ప్రభుత్వం 2016 నుంచి అమలు చేస్తోంది. ఈ చట్టం కింద దోషిగా తేలిన వారికి కనీసం ఏడేళ్ల జైలు శిక్షతోపాటు సదరు ఆస్తి మార్కెట్ విలువలో 25 శాతం మేర జరిమానాగా చెల్లించాల్సి ఉంటుంది. అవసరమైతే మొత్తం ఆస్తిని స్వాధీనం చేసుకునే అధికారం కూడా ప్రభుత్వానికి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిని ఐటీ చట్టం-1961 ప్రకారం కూడా విచారించే వీలుంటుంది. దేశంలో బినామీ ప్రొహిబిషన్ చట్టం అమలు అధికారం ఐటీ విభాగానికి ఉంది.

యానిమేషన్ స్టూడియోకు నిప్పు

స్టూడియో వద్ద సహాయక చర్యలు

జపాన్‌లో 33 మంది మృతి

- మరో 35 మందికి తీవ్రగాయాలు
- క్యోటో నగరంలో ఘటన
- పోలీసుల అదుపులో నిందితుడు

టోక్యో: జపాన్‌లోని ప్రముఖ యానిమేషన్ స్టూడియోకు ఓ వ్యక్తి నిప్పుపెట్టడంతో మంటల్లో చిక్కుకుని 33 మంది చనిపోగా దాదాపు అంతే సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారు. జపాన్ వాసులను షాక్‌కు గురిచేసిన ఈ ఘటన క్యోటోలో చోటుచేసుకుంది. గురువారం సాయంత్రం ఓ దుండగుడు స్థానిక క్యోటో యానిమేషన్ స్టూడియోలోకి ప్రవేశించాడు. 'మీరు చస్తారు' అని అరుచుకుంటూ ప్రవేశ ద్వారం వద్ద గుర్తు తెలియని ద్రవాన్ని చల్లి, ఆ వెంటనే నిప్పంటించాడు. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఉద్యోగులంతా ప్రాణ భయంతో పైనున్న మూడంతస్తులకు చేరుకునేందుకు ప్రయత్నించారు. అయితే, వారు మంటల తీవ్రత నుంచి తప్పించుకోలేకపోయారు. మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది 33 మృతదేహాలను వెలికి తీశారు. ఇందులో 20 మృతదేహాలు మూడో ఫ్లోర్‌లోనే పడి ఉన్నాయని అధికారులు తెలిపారు. మరో 36 మంది కాలిన గాయాలపాలు కాగా, వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. బాధితుల్లో చాలా మంది కంపెనీ ఉద్యోగులేనని తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన నిందితుడి(41)ని కూడా పోలీసులు ఆస్పత్రికి తరలించారు. అతడు కంపెనీ ఉద్యోగి కాదని మాత్రమే పోలీసులు వెల్లడించారు. తన వస్తువును క్యోటో యానిమేషన్ కంపెనీ దొంగతనం చేసిందని నిందితుడు ఆరోపిస్తున్నట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం. ప్రమాదానికి అతడు గ్యాసోలిన్‌ను వాడి ఉంటాడని భావిస్తున్నారు. ఘటన స్థలి నుంచి పోలీసులు కొన్ని కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే, అవి నిందితుడివేనా కాదా అనేది తెలియరాలేదు. ప్రమాదం సమయంలో ఆ భవనంలో 70 మందికి పైగా ఉన్నట్లు సమాచారం. లకీ స్టార్, కె-ఆన్, హరుహి సుజుమియాతోపాటు పోకెమాన్, విన్నీది పూహ్ వంటి యానిమేషన్ చిత్రాలతో క్యోటో యానిమేషన్ ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకుంది. కాగా, జపాన్‌లో ఇటువంటి విద్రోహ చర్యలు జరగడం చాలా అరుదు. 2001లో టోక్యోలో అనుమానాస్పద పరిస్థితుల్లో జరిగిన అగ్ని ప్రమాదం కారణంగా 44 మంది ప్రాణాలు కోల్పోయారు. 2016లో ఓ వ్యక్తి టోక్యోలోని నర్సింగ్ హోం వద్ద కత్తితో దాడి చేసి 19 మందిని పొట్టనబెట్టుకున్నాడు.

32 ట్రాక్టర్లు.. 200 మంది

- అడ్డొచ్చిన వారిని చంపడానికే నిశ్చయించుకుని వచ్చారు
- అరగంటపాటు తుపాకుల మోత • యూపీ కాల్పుల ఘటనపై ప్రత్యక్ష సాక్షులు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని సోన్‌భద్ర జిల్లా ఘోరవాల్ పట్టణం సమీపంలోని మారుమూల గ్రామం ఉభాలో గ్రామపెద్ద మనుషులు బుధవారం విచక్షణా రహితంగా కాల్పులు జరిపిన ఘటనలో మృతుల సంఖ్య 10కి పెరిగింది. ఈ ఘటనపై ప్రత్యక్ష సాక్షులు మాట్లాడుతూ 'భూమిని స్వాధీనం చేసుకోవడంలో తన దారికి అడ్డొచ్చిన వారిని చంపడానికి ముందుగానే నిశ్చయించుకునే, వందల సంఖ్యలో మనుషులను వెంటబెట్టుకుని గ్రామ పెద్ద యజ్ఞా దత్ వచ్చాడు. 32 ట్రాక్టర్లలో దాదాపు 200 మంది బలగాన్ని, ఆయుధాలను అతను తీసుకొచ్చాడు. 200 మంది యజ్ఞా దత్ మనుషులు వివాదంలో

సాక్షి బిజినెస్

శుక్రవారం
19-7-2019

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
318 ▼	91 ▼
38,897	11,597

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

నాస్‌డాక్	8,163	▼ 22
డోజోన్స్	27,136	▼ 83
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,493	▼ 42
డాక్స్	12,228	▼ 113
షాంఘై	2,901	▼ 31
నికాయ్	21,046	▼ 423

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	67.39	71.00
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	84.13	89.04
€	యూరో	ఎస్‌బీఐ	75.55	80.01
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	61.00	67.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.33	50.41
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.51	52.58
SAR	సౌదీ రియాల్	ధామన్‌కుక్	17.66	19.37
UAE D	యూఏఈ దిర్హామ్	ధామన్‌కుక్	18.08	19.59
¥	చైనా యువాన్	ధామన్‌కుక్	9.40	10.75

తప్పనిసరై జాతీయం తప్పులతో పతనం

బ్యాంకుల జాతీయీకరణకు 50 ఏళ్లు

- వ్యవసాయం, చిన్న సంస్థలకు పెరిగిన రుణాలు
- నలుదిశలా విస్తరించిన బ్యాంకు శాఖలు
- అందరికీ అందుబాటులోకి బ్యాంకింగ్...
- ప్రభుత్వ అజమాయిషీ పెరిగి తప్పడు నిర్ణయాలు
- మొండిబాకీలతో కుదేలవుతున్న పీఎస్‌బీలు
- ప్రైవేటీకరణే సరైన పరిష్కారమంటూ సూచనలు!!

ప్రస్తుతం ఇలా..

ప్రభుత్వ రంగ బ్యాంకులు	18
ప్రైవేట్ బ్యాంకులు	22
విదేశీ బ్యాంకులు	46

సాక్షి, బిజినెస్ విభాగం

బ్యాంకుల జాతీయీకరణ వెనక రాజకీయాలు పక్కనపెడితే ఇతరత్రా కారణాలూ ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన చాన్నాళ్ల దాకా బ్యాంకులు స్పెక్యులేటివ్, వాణిజ్య కార్యకలాపాలకు తప్ప ఎక్కువగా పరిశ్రమకు, వ్యవసాయ రంగానికి రుణాలివ్వటంపై పెద్దగా దృష్టి పెట్టలేదు. అటు నియంత్రణ సంస్థగా రిజర్వ్ బ్యాంక్ కూడా పూర్తి స్థాయిలో పట్టు సాధించలేకపోయింది. దీంతో 300 పైచిలుకు ఉన్న బ్యాంకులను అదుపు చేయడం కష్టంగా మారింది. 1960ల్లో పాలయ్ సెంట్రల్ బ్యాంక్, లక్ష్మి కమర్షియల్ బ్యాంక్ దివాలా తీయడంతో అప్పటి ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ ఒత్తిడితో బ్యాంకుల సంఖ్యను తగ్గించడంపై ఆర్‌బీఐ దృష్టి పెట్టింది.

సాగుకు రుణాల్లేవు. చిన్న సంస్థలను పట్టించుకునే వారే లేరు. అలాంటి దశలో బ్యాంకుల్ని జాతీయీకరించి... వాటి రుణ ప్రాధాన్యాలను పునఃనిర్వచించింది నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం. చాలా వర్గాలు వద్దన్నాయి. ఆర్‌బీఐ కూడా సరికాదని చెప్పింది. అయినాసరే... 50 ఏళ్ల కిందట ఇదే రోజున(1969, జూలై 19) ఇందిర తను అనుకున్నదే చేశారు. ప్రత్యేక ఆర్డినెన్స్‌తో 14 బ్యాంకుల్ని జాతీయం చేశారు. నిజానికి ఈ జాతీయీకరణ ఆశించిన మేర కొన్ని ప్రయోజనాలనైతే ఇచ్చింది. కానీ... ఆ ప్రయాణంలో బ్యాంకులు ప్రభుత్వం చేతిలో ఆటబొమ్మల్లా మారిపోయాయి. చివరికిపుడు శక్తికి మించిన మొండి బాకీల్ని మోస్తూ కుదేలవుతున్నాయి. చివరికి వీటిని ప్రైవేటీకరించాలన్న సలహాలూ వస్తున్నాయి. అంటే... మళ్లీ మొదలెట్టిన చోటికే చేర్చమని!!. అసలు ఈ పరిస్థితి ఎందుకొచ్చింది? జాతీయీకరణ ఎందుకు జరిగింది? ఇపుడు దారేంటి? వీటన్నిటి సమాహారమే ఈ ప్రత్యేక కథనం...

1960లో 328 పైచిలుకు ఉన్న బ్యాంకుల సంఖ్యను విలీనాలు, మూసివేతలుతో 1965 నాటికి 94 స్థాయికి తెచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో 1969 జూలై 19న కనీసం రూ.50 కోట్ల మేర డిపాజిట్లున్న బ్యాంకులను జాతీయం చేస్తున్నట్లు ఇందిరా గాంధీ ప్రభుత్వం ప్రకటించింది. దీంతో అప్పటికే ప్రభుత్వ రంగంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దాని అనుబంధ బ్యాంకులతో పాటు 14 బ్యాంకులు ప్రభుత్వ రంగ పరిధిలోకి వచ్చాయి. అప్పటి బ్యాంకింగ్ రంగంలోని మొత్తం డిపాజిట్లలో వీటి వాటా ఏకంగా 85 శాతం!!. మళ్లీ 1980లో రూ.200 కోట్ల పైగా డిపాజిట్లున్న మరో 6 బ్యాంకులను జాతీయీకరించారు.

ఆర్‌బీఐని తోసిరాజని..

బ్యాంకుల జాతీయీకరణ ప్రక్రియలో ఆర్‌బీఐ గవర్నర్‌ను కూడా ప్రభుత్వం పెద్దగా లెక్కచేయలేదనే చెప్పాలి. ఇందిరా గాంధీతో పాటు ప్రధాని ప్రిన్సిపల్ కార్యదర్శి పీఎన్ హక్సర్, ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎ.బక్షి, డీఎన్ ఘోష్ అనే జూనియర్ స్థాయి అధికారి మాత్రమే ఈ ప్రక్రియలో పాలు పంచుకున్నారు. ఆర్‌బీఐ వర్గాల కథనం ప్రకారం.. బ్యాంకులు అప్పటికే సమగ్రమైన సామాజిక నియంత్రణ పరిధిలో పనిచేస్తున్నాయని, వాటి జాతీయీకరణ వల్ల ఎలాంటి లాభం ఉండకపోగా ప్రభుత్వం, ఆర్‌బీఐపై అనవసర బాధ్యతలు పెరుగుతాయంటూ ఆర్‌బీఐ గవర్నర్ ఎల్‌కే ఝా అప్పటికే ఒక నోట్‌ను సిద్ధం చేసుకుని ప్రధానికి తెలిపేందుకు వెళ్లారు. అయితే, ఆయన్ను చూసిన ప్రధాని ఇందిరాగాంధీ 'మీ చేతిలో భారీ నోట్ ఏదో కనిపిస్తోంది. దాన్ని ఈ పక్కన టేబుల్ మీద ఉంచండి. పక్క గదిలో ప్రైవేట్ బ్యాంకుల జాతీయీకరణ ఆర్డినెన్స్‌పై కసరత్తు చేస్తున్న టీమ్‌కు కాస్త సాయం అందించండి' అని సూచించడంతో ఝా తప్పనిసరై ఆ ప్రక్రియలో భాగమయ్యారు.

బ్యాంకింగ్ విస్తరణకు ఊతం..

జాతీయీకరణకు ముందు బ్యాంకులిచ్చే రుణాల్లో దాదాపు 78 శాతం పెద్ద, మధ్య స్థాయి పరిశ్రమలు, హోల్‌సేల్ వ్యాపారాలకే కాగా... వ్యవసాయం వాటా 2.2 శాతం మాత్రమే. 1969లో రూ.162 కోట్లుగా ఉన్న వ్యవసాయ రుణాలు 2011 నాటికి రూ.4 లక్షల కోట్లకు చేరాయి. చిన్న పరిశ్రమలకు బ్యాంకు రుణాలు కూడా రూ.251 కోట్ల నుంచి రూ. 3.6 లక్షల కోట్లకు చేరాయి. బ్యాంకులిచ్చే మొత్తం రుణాల్లో ప్రాధాన్యతా రంగ రుణాల వాటా 1969లో 15 శాతంగా ఉంటే 2011 నాటికి 41 శాతానికి పెరిగింది. సాధారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు తమకు నిర్దేశించిన లక్ష్యాల సాధనలో మెరుగైన పనితీరే కనపర్చాయి. అందరికీ ఆర్థిక సేవలు అందుబాటులోకి రావాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జన్ ధన్ ఖాతాల్లో 80 శాతం అకౌంట్లు ప్రభుత్వ రంగ బ్యాంకులే (పీఎస్‌బీ) ఇచ్చాయి. వ్యవసాయం, చిన్న తరహా సంస్థలకు ప్రాధాన్యతా రంగ రుణాల్లో 68 శాతం వాటా వీటిదే ఉంది.

మొండిబాకీలతో కుదేలు..

ఇవన్నీ నాణేనికి ఒకవైపు మాత్రమే. తాజా పరిస్థితి చూస్తే మాత్రం ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. మొండిబాకీలతో బ్యాంకులు కుదేలవుతున్నాయి. 2014 మేలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పట్నుంచీ చూస్తే పీఎస్‌బీల విలువ దాదాపు రూ.2.97 లక్షల కోట్ల మేర కరిగిపోయింది. బ్యాంకింగ్ రంగ మార్కెట్ క్యాప్‌లో వీటి వాటా 40 శాతం నుంచి 26కు పడిపోయింది. ఈ ఏడాది మార్చి క్వార్టర్‌లో ప్రైవేట్ బ్యాంకుల రుణ వృద్ధి 21 శాతంగా ఉంటే పీఎస్‌బీలది కేవలం 9.6 శాతమే. ప్రైవేట్ బ్యాంకుల డిపాజిట్లు 17.5 శాతం పెరిగితే పీఎస్‌బీలవి 6.5 శాతమే పెరిగాయి. ప్రైవేట్ బ్యాంకుల్లో ఎన్‌పీఏలు 3.7 శాతం స్థాయిలో ఉంటే పీఎస్‌బీలవి ఏకంగా 12.6 శాతం మేర ఉన్నాయి. దీంతో కేంద్రం దఫదఫాలుగా పీఎస్‌బీలకు అదనపు మూలధనం సమకూరుస్తూ కుప్పకూలకుండా చూస్తోంది.

మోడల్ మార్చాలి...

ప్రభుత్వ రంగ బ్యాంకుల మోడల్ కొన్నాళ్ల పాటు పనిచేసింది. అదనపు మూలధనం రూపంలో పీఎస్‌బీల్లోకి వెడుతున్న ట్యాక్స్‌పేయర్స్ సొమ్ము విలువ ఎంతో కొంత పెరగాలని కోరుకోవడంలో తప్పులేదు. కానీ పెరగడం మాట అటుంచి ఎందుకు తగ్గుతోంది అన్నదే ప్రశ్నార్థకం. ఒకవేళ ప్రస్తుతం అనుసరిస్తున్న విధానమే ఇందుకు కారణమైతే మోడల్‌ను మార్చే అంశాన్ని కచ్చితంగా పరిశీలించాలి.

– అరుంధతి భట్టాచార్య, ఎస్‌బీఐ మాజీ చైర్మన్

మెరుగైన బ్యాంకులకు తోడ్పాటు

అప్పట్లో ప్రైవేట్ బ్యాంకుల రికార్డు అంత బాగాలేకపోవడంతో బ్యాంకుల జాతీయీకరణ సమంజసమైనదే కావచ్చు. ప్రస్తుతం ప్రైవేట్ రంగ బ్యాంకులు మెరుగుపడ్డాయి.. కానీ పీఎస్‌బీల పరిస్థితే సందేహాస్పదంగా ఉంది. ఇలాంటప్పుడు పీఎస్‌బీల అంశాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉంది. కానీ రాజకీయ, ఆర్థికపరమైన అంశాల వల్ల ఈ వ్యవహారం చాలా సంక్లిష్టంగా మారింది. అయితే, అలాగని పీఎస్‌బీలు పూర్తిగా అవసరం లేదని కాదు. బ్యాంకింగ్‌లో నిర్దిష్ట శాతం ప్రభుత్వ రంగంలో ఉండాలని నిర్ణయించాలి. పోటీ ద్వారా ఏ బ్యాంకులు మెరుగ్గా ఉన్నాయో తేల్చి వాటికి తోడ్పాటునివ్వాలి. సరిగ్గా లేని వాటిల్లో షేర్లు అమ్మేసేయాలి. ఏకానమీ అవసరాలను తీర్చేలా ప్రభుత్వ నియంత్రణలో సుమారు 30 శాతం బ్యాంకింగ్ రంగం ఉంటే చాలని అంచనాలు ఉన్నాయి.

– వైవీ రెడ్డి, ఆర్‌బీఐ మాజీ గవర్నర్

తప్పెవరిదంటే..

పీఎస్‌బీల పరిస్థితి ఇంత అధ్వానంగా మారడానికి బాధ్యులెవరంటే.. ఇటు స్వయంగా బ్యాంకులు అటు ప్రభుత్వం కూడానని చెప్పాలి. ప్రత్యేక ఫైనాన్స్ సంస్థల స్థానంలో భారీ ప్రాజెక్టులకు పీఎస్‌బీలు రుణాలివ్వాల్సి వచ్చింది. ఇలాంటి అంశాల్లో అంతగా అవగాహన లేకపోవడంతో ఈ దీర్ఘకాలిక రుణాల విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోలేకపోయాయి. ఇవే నేటి మొండిబాకీలకు మూలకారణం. పీఎస్‌బీల్లో కేంద్రం వాటాలు తగ్గించుకుంది కానీ అజమాయిషీ మాత్రం దాని చేతుల్లోనే ఉంది. బ్యాంకింగ్‌తో సంబంధంలేని పనులకూ ఒకోసారి వాటిని ఉపయోగిస్తోంది. ఇక, పీఎస్‌బీ బ్యాంకర్లకు మార్కెట్ స్థాయిలో జీతభత్యాలు లేకపోవడం, నిరంతరం వారిపై దర్యాప్తు సంస్థల నిఘా ఉండటం వంటి అంశాలు సైతం వారిని సాహసోపేత నిర్ణయాలు తీసుకోనివ్వకుండా చేతులు కట్టేసినట్లుగా ఉంటున్నాయి.

తరుణోపాయం ఏంటి?

జాతీయీకరణ జరిగి 50 సంవత్సరాలవుతున్న ఈ తరుణంలోనైనా పీఎస్‌బీలపై కేంద్రం తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత దివాలా చట్టంతో మొండిబాకీలకు కొంత పరిష్కారం దొరుకుతున్నా, ఊరట అంతంతమాత్రంగానే ఉంటోంది. అవి ఎదగకుండా చేతులు కట్టేసి.. మూలధనాన్ని అందిస్తూ కూర్చోవడమా.. లేక వాటి మానాన వాటిని వదిలేయడమా లేక ప్రైవేటీకరించడమా అన్నది ప్రభుత్వం తేల్చుకోవాలనేది బ్యాంకింగ్ వర్గాల మాట.

జాతీయీకరణ ఇలా

తొలి విడత 1969లో:

అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, దేనా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రెండో విడత 1980లో:

పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్, విజయ బ్యాంక్, ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్, న్యూ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్యాంకులు విస్తరించాయిలా...



పేటీఎమ్ మాల్‌లో ఈబే చేతికి 5.5% వాటా

న్యూఢిల్లీ: భారత ఈ కామర్స్ ప్లాట్‌ఫార్మ్, పేటీఎమ్ మాల్‌లో 5.5 శాతం వాటాను అమెరికా ఈ-టైలర్ ఈబే కొనుగోలు చేసింది. ఈ వాటా కొనుగోలుకు సంబంధించి ఆర్థిక వివరాలు వెల్లడి కాలేదు. ఈ డీల్‌లో భాగంగా పేటీఎమ్ మాల్‌లో ఒక స్టోర్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని ఈబే ప్రెసిడెంట్, సీఈఓ డెవిన్ వెన్ చెప్పారు. భారత ఈ కామర్స్ రంగంలో ఈబేకు ఇది మూడో పెట్టుబడి. గతంలో స్నాప్‌డీల్, ఫ్లిప్‌కార్ట్‌ల్లో ఈబే పెట్టుబడులు పెట్టింది.

సుజుకీ 'జిక్సర్' కొత్త వెర్షన్

ప్రారంభ ధర రూ.1.10 లక్షలు

న్యూఢిల్లీ: సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా తన నూతన 'జిక్సర్ ఎస్ఎఫ్' సిరీస్‌లో 155సీసీ మోటో జీపీ ఎడిషన్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఫోర్ స్ట్రోక్, సింగిల్ సిలిండర్ ఫుయల్ ఇంజెక్షన్ ఇంజిన్‌తో అందుబాటులోకి వచ్చిన ఈ బైక్ ప్రారంభ ధర రూ.1,10,605 (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ)గా కంపెనీ ప్రకటించింది. 249సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన జిక్సర్ ఎస్ఎఫ్ 250 మోటోజీపీ ఎడిషన్‌ను ఆగస్టులో విడుదల చేయనున్నట్లు ఈ సందర్భంగా సంస్థ వైస్ ప్రెసిడెంట్ దేవాశిష్ హండా వెల్లడించారు.

అలహాబాద్ బ్యాంకులో మరో మోసం

రూ. 688 కోట్లు కొల్లగొట్టిన ఎస్ఈఎల్ఎం!

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ అలహాబాద్ బ్యాంక్ కార్యకలాపాల తీరుపై సందేహాలు రేకెత్తించేలా తాజాగా మరో మోసం బైటపడింది. ఎస్ఈఎల్ మాన్యుఫాక్చరింగ్ (ఎస్ఈఎల్ఎం) రూ. 688.27 కోట్ల మేర మోసానికి పాల్పడినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు అలహాబాద్ బ్యాంకు వెల్లడించింది. దీనికి సంబంధించి ప్రొవిజనింగ్ చేసినట్లు, ఫ్రాడ్ గురించి ఆర్‌బీఐకి కూడా తెలియజేసినట్లు పేర్కొంది. ప్రస్తుతం ఎస్ఈఎల్ఎం దివాలా పిటిషన్‌పై ఎన్‌సీఎల్‌టీలో విచారణ జరుగుతున్నట్లు వివరించింది. వారం రోజుల వ్యవధిలో అలహాబాద్ బ్యాంకులో ఇది రెండో ఫ్రాడ్ కేసు కావడం గమనార్హం. భూషణ్ పవర్ అండ్ స్టీల్ (బీపీఎస్ఎల్) రూ. 1,775 కోట్ల మోసానికి పాల్పడినట్లు గత శనివారమే బ్యాంకు వెల్లడించింది.

డుమాంట్.. ప్రీమియం ఐస్‌క్రీమ్స్

- ఏడాదిలో 100 ఔట్‌లెట్లు ఏర్పాటు చేస్తాం...
- కంపెనీ ఎండీ వివేక్ అయినంపూడి వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రీమియం ఐస్‌క్రీమ్ మార్కెట్లోకి కొత్త బ్రాండ్ 'డుమాంట్' ప్రవేశించింది. హైదరాబాద్, బెంగళూరు, విజయవాడలో 10 స్టోర్లను తెరిచిన ఈ కంపెనీ.. ఏడాదిలో దక్షిణాది రాష్ట్రాల్లో 100 ఔట్‌లెట్లను ప్రారంభించాలని కృతనిశ్చయంతో ఉంది. మూడేళ్లలో ఈ రాష్ట్రాలతోపాటు మహారాష్ట్రలోనూ అడుగుపెడతామని డుమాంట్ ఎండీ వివేక్ అయినంపూడి తెలిపారు. గురువారమిక్కడ డుమాంట్ బ్రాండ్‌ను ఆవిష్కరించిన సందర్భంగా బ్రాండ్ డైరెక్టర్ సుమన్ గద్దె, మార్కెటింగ్ డైరెక్టర్ చైతన్య బోయపాటితో కలిసి మీడియాతో మాట్లాడారు. 2022 నాటికి 300 కేంద్రాల స్థాయికి వెళతామన్నారు. సొంత స్టోర్లతోపాటు ఫ్రాంచైజీల ద్వారా కూడా నెలకొల్పుతామని చెప్పారు. ఫ్రాంచైజీ కోసం ఇప్పటికే 40కి పైగా ఎంక్వైరీలు వచ్చాయన్నారు. తొలి ఏడాది రూ.12-15 కోట్ల ఆదాయం ఆశిస్తున్నట్టు వెల్లడించారు. డుమాంట్ ఉత్పత్తుల అభివృద్ధికి రూ.3 కోట్లు వెచ్చించినట్టు తెలిపారు.

భారత్‌లో తొలిసారిగా..

విజయవాడ కేంద్రంగా 20 ఏళ్లుగా ఐస్‌క్రీమ్స్ విపణిలో ఈ కంపెనీ విజయవంతంగా కార్యకలాపాలు సాగిస్తోంది. దక్షిణాదిన వివిధ బ్రాండ్లలో ఫ్రోజెన్ డెసర్ట్‌ను పలు రెస్టారెంట్లు, క్యాటరర్స్‌కు సరఫరా చేస్తోంది. గంటకు 1,900 లీటర్ల ఐస్ క్రీమ్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. విజయవాడ కేంద్రానికి ఇప్పటికే రూ.15 కోట్లు వెచ్చించింది. 10 కోల్డ్ స్టోరేజీలను నిర్వహిస్తోంది. ఒకట్రెండేళ్లలో హైదరాబాద్‌లో ప్లాంటు ఏర్పాటు చేస్తామని వివేక్ తెలిపారు. గంటకు 3,000 లీటర్ల ఐస్‌క్రీమ్ ఉత్పత్తి సామర్థ్యంతో రానున్న ఈ ప్లాంటుకు రూ.15 కోట్ల వరకు వెచ్చిస్తామన్నారు. 'డుమాంట్ బ్రాండ్‌లో 34 రకాల ఐస్ క్రీమ్స్, మిల్స్‌షేక్స్‌ను తీసుకొచ్చాం. అన్నీ స్వచ్ఛమైన పాలతో చేసినవే. భారత్‌తోపాటు పలు దేశాల నుంచి తాజా పండ్లను సేకరించి వీటి తయారీలో వాడుతున్నాం. బ్లూబెర్రీ చీస్‌కేక్, కారామెలైజ్డ్ పైనాపిల్, చాకో ఆరేంజ్, మాపుల్ అండ్ రైసిన్స్, ఖీర్, థాయ్ టీ వంటి వెరైటీలు భారత్‌లో తొలిసారిగా ప్రవేశపెట్టినవే. కొత్త రుచుల అభివృద్ధిలో ప్రత్యేక విభాగం నిమగ్నమైంది' అని వివరించారు.

డుమాంట్ బ్రాండ్‌ను ఆవిష్కరిస్తున్న సుమన్, వివేక్, చైతన్య (ఎడమ నుంచి)

ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్ లాభం 359 కోట్లు

2,485 కోట్లకు ఆదాయం; 15% వృద్ధి

న్యూఢిల్లీ: లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్ అండ్ టీ) గ్రూప్‌నకు చెందిన ఐటీ కంపెనీ ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్(ఎల్‌టీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో రూ.359 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో ఆర్జించిన నికర లాభం(రూ.361 కోట్లు)తో పోల్చితే ఒకటిన్నర శాతం క్షీణత నమోదైందని ఎల్‌టీఐ తెలిపింది. ఆదాయం మాత్రం రూ.2,156 కోట్ల నుంచి 15 శాతం వృద్ధితో రూ.2,485 కోట్లకు పెరిగిందని కంపెనీ సీఈఓ, ఎమ్‌డీ, సంజయ్ జలోన పేర్కొన్నారు. నిలకడ కరెన్సీ రేట్ల మారకం ప్రాతిపదికన ఆదాయంలో 12 శాతం వృద్ధిని సాధించామని తెలిపారు. డిజిటల్ సర్వీస్‌ల విభాగం మంచి వృద్ధిని సాధించిందని, తమ మొత్తం ఆదాయంలో ఈ విభాగం వాటా 39 శాతానికి పెరిగిందని పేర్కొన్నారు. డాలర్ల పరంగా ఆదాయం 12 శాతం వృద్ధితో 36 కోట్ల డాలర్లకు చేరిందని వివరించారు. ఈ ఏడాది జూన్ నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 29,347కు పెరిగిందని, ఆట్రిషన్(ఉద్యోగుల వలస) 18.3 శాతంగా ఉందని వివరించారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్ షేర్ 2 శాతం నష్టంతో రూ.1,578 వద్ద ముగిసింది.

అకౌంట్లతో పనిలేదు.. విత్‌డ్రాలు కోటి దాటితే 2% టీడీఎస్!



న్యూఢిల్లీ: ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ జూలై 5వ తేదీన లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2019-20 వార్షిక బడ్జెట్‌లో ఒక లొసుగును సవరించారు. తన బడ్జెట్ ప్రతిపాదనకు ఒక కీలక సవరణను గురువారం తీసుకువచ్చారు. వివరాల్లోకి వెళితే... ఒక సంవత్సరంలో 'ఒక అకౌంట్' నుంచి కోటి రూపాయలు పైబడిన విత్‌డ్రాయెల్స్ జరిపితే 2 శాతం మూలం వద్ద పన్ను (టీడీఎస్) విధించాలని జూలై 5 బడ్జెట్ ప్రతిపాదించింది. అయితే 'రెండు లేదా అంతకంటే ఎక్కువ అకౌంట్ల నుంచి కోటి పైబడిన విత్‌డ్రాయెల్స్ చేస్తే 2 శాతం టీడీఎస్ ఉండదా' అనే సంశయం పలు వర్గాల నుంచి వ్యక్తమయ్యింది. బడ్జెట్‌లో ఈ లొసుగును సవరిస్తూ ఆర్థిక మంత్రి 2019 ఫైనాన్స్ బిల్లుకు ఒక సవరణను తీసుకువచ్చారు. దీని ప్రకారం .. ఒక వేళ ఒకటికి మించి ఖాతాలు ఉన్న పక్షంలో అన్ని అకౌంట్స్ నుంచి విత్‌డ్రా చేసిన మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుని రూ. 1 కోటి దాటితే 2 శాతం టీడీఎస్ వర్తిస్తుంది. భారీ నగదు లావాదేవీల నిరోధం లక్ష్యంగా బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ఈ ప్రతిపాదనను తీసుకువచ్చారు. 28 ఇతర సవరణలతోపాటు ఈ ప్రతిపాదనకూ లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. మొత్తం పన్ను బకాయిల్లో ఈ టీడీఎస్ కూడా భర్తీ అయ్యే అవకాశాన్నీ తాజా బడ్జెట్ ప్రతిపాదన కల్పిస్తోంది.

పడేసిన ఆర్థిక ఫలితాలు

- 11,600 కిందకు నిఫ్టీ
- నష్టాల్లో ప్రపంచ మార్కెట్లు
- జీడీపీ అంచనాలను తగ్గించిన ఏడీబీ
- 318 పాయింట్ల పతనంతో 38,897కు సెన్సెక్స్
- 91 పాయింట్లు తగ్గి 11,597కు నిఫ్టీ

కంపెనీల తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంతంతమాత్రంగానే ఉండటంతో గురువారం స్టాక్ మార్కెట్ భారీగా నష్టపోయింది. అంతర్జాతీయ సంకేతాలు అంతంత మాత్రంగానే ఉండటం, డాలర్‌తో రూపాయి మారకం విలువ బలహీనపడటం ప్రతికూల ప్రభావం చూపించాయి. దీంతో అంతంత మాత్రం లాభాలతో గత మూడు రోజులుగా నెట్టుకొస్తున్న సెన్సెక్స్, నిఫ్టీలు కీలకమైన స్థాయిల దిగువకు పడిపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 39,000 పాయింట్లు, నిఫ్టీ 11,600 పాయింట్ల దిగువకు పతనమయ్యాయి. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ అంచనాలను 7.2 శాతం నుంచి 7 శాతానికి ఏడీబీ తగ్గించడం, అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతల తగ్గింపు విషయమై అనిశ్చితి నెలకొనడం, వర్షపాత విస్తరణ అంతంతమాత్రంగానే ఉండటం.... ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 318 పాయింట్లు పతనమై 38,897 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 91 పాయింట్లు నష్టపోయి 11,597 పాయింట్ల వద్ద ముగిశాయి. ప్రభుత్వ రంగ బ్యాంక్, లోహ, వాహన షేర్లు నష్టపోయాయి. అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి.

రోజంతా నష్టాలే....

కంపెనీల ఆర్థిక ఫలితాలు నిరాశమయంగా ఉండటంతో ఆర్థిక పరిస్థితులు త్వరగా రికవరీ అయ్యే పరిస్థితులు లేవన్న అంచనాలు పెరిగిపోయాయి. సెన్సెక్స్ నష్టాల్లోనే ఆరంభమైంది. రోజంతా నష్టాలు కొనసాగాయి. చివరి గంటలో నష్టాలు మరింతగా పెరిగాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 354, నిఫ్టీ 105 పాయింట్ల మేర నష్టపోయాయి. నిఫ్టీ వీక్లీ ఆప్షన్ల కాంట్రాక్టుల ముగింపు రోజు కావడంతో తీవ్రమైన ఒడిదుడుకులు చోటు చేసుకున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 12 పైసలు నష్టపోయి 68.95 వద్ద ముగిసింది.

బ్యాంక్ షేర్లు బేర్: మొండి బకాయిల సమస్య మరింత తీవ్రమవుతోందని, ఇటీవల వెలువడిన కొన్ని బ్యాంక్‌ల ఆర్థిక ఫలితాలు ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నాయంటూ అంచనాలు రావడం ఈ షేర్లు పడ్డాయి.

స్టాక్ మార్కెట్ డేటా

టర్నోవర్ (రూ. కోట్లలో)	
బీఎస్ఈ	2,314
ఎన్ఎస్ఈ	33,623
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	19,47,254
ఎఫ్ఐఐ	-1,405
డీఐఐ	329

4 లక్షల కోట్ల క్లబ్‌లోకి హెచ్‌డీఎఫ్‌సీ

హెచ్‌డీఎఫ్‌సీ షేర్ ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హై, 2,357ను తాకింది. చివరకు 2.5 శాతం లాభంతో రూ.2,343 వద్ద ముగిసింది. సెన్సెక్స్ షేర్లలో బాగా లాభపడిన షేర్ ఇదే. షేర్ జోరు కారణంగా ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ భారీగా పెరిగి రూ.4 లక్షల కోట్ల మైలురాయిని దాటేసింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.4,04,385 కోట్లకు పెరిగింది.

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	267.75	3.14
HDFC	2,338.00	2.24
ZEEL	360.75	2.12
BRITANNIA	2,820.00	0.79
HDFCBANK	2,414.75	0.72
IOC	147.45	0.41
EICHERMOT	18,470.00	0.2
KOTAKBANK	1,537.50	0.19
ITC	272.95	0.02

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
YESBANK	85.9	-12.7
ONGC	143.3	-4.4
COALINDIA	219.95	-4.37
TATAMOTORS	161	-4.11
MARUTI	5,875.00	-3.3
VEDL	163.6	-2.99
BAJAJ-AUTO	2,625.90	-2.63
SBIN	364.3	-2.18
GRASIM	906.5	-2.18

సిల్లీ మాంక్స్‌తో ఆరోస్ అవతార్ జట్టు

మీడియా సమావేశంలో అనిల్, సంజయ్ రెడ్డి, శుభ్ మల్హోత్రా, రూపేష్ (ఎడమ నుంచి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ముంబై కేంద్రంగా ఉన్న ప్రొడక్షన్ హౌజ్ ఆరోస్ అవతార్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలుగు చిత్ర నిర్మాణ రంగంలోకి ప్రవేశిస్తోంది. కంటెంట్ ప్రొడక్షన్, మార్కెటింగ్ రంగంలో ఉన్న హైదరాబాద్ కంపెనీ సిల్లీ మాంక్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. 2013లో ప్రారంభమైన ఆరోస్ ఇప్పటివరకు మరాఠి, గుజరాతి, ఇంగ్లీషులో నాలుగు చిత్రాలను నిర్మించింది. ఇరు సంస్థలు కలిసి విభిన్న భాషల్లో చిత్రాలను రూపొందించనున్నాయి. తొలి సినిమా అశ్వమేధం త్వరలో విడుదల కానుంది. ఆరోస్‌తో కలిసి మరో మూడు ప్రాజెక్టులు చేపట్టామని సిల్లీ మాంక్స్ ఫౌండర్ సంజయ్ రెడ్డి తెలిపారు. ఆరోస్ ప్రతినిధులు శుభ్ మల్హోత్రా, రూపేష్ గుగాలే జైన్, సిల్లీ మాంక్స్ సీఈవో అనిల్ పల్లాలతో కలిసి గురువారమిక్కడ మీడియాతో మాట్లాడారు. తెలుగులో దీపావళి, హిందీలో నన్హే ఐన్‌స్టీన్, మరాఠీలో దాదర్ 1992 చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు చెప్పారు.

స్క్వింగ్ స్టెట్టర్ నూతన ఎక్స్‌కావేటర్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ రంగ యంత్రాల తయారీలో ఉన్న స్క్వింగ్ స్టెట్టర్ ఇండియా తాజాగా నూతన తరం క్రాలర్ హైడ్రాలిక్ ఎక్స్‌కావేటర్లను విడుదల చేసింది. మూడు రకాల కొత్త మోడళ్లను కంపెనీ రూపొందించినట్లు కంపెనీ ఎండీ వి.జి.శక్తికుమార్ తెలిపారు. 2011లో మార్కెట్ డిమాండ్ 11,000 యూనిట్లుంటే, 2018లో ఇది 25,000 యూనిట్లకు చేరిందని చెప్పారు.

లోకలైజేషన్ మాత్రమే భరోసానివ్వదు

డేటా భద్రత అంశంపై అమెరికా కాన్సుల్ జనరల్ కేథరిన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డేటాను స్థానికంగా భద్రపర్చడం వల్ల (లోకలైజేషన్) మాత్రమే పూర్తి భద్రత ఉంటుందని భావించడానికి లేదని హైదరాబాద్‌లో అమెరికా కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డా అభిప్రాయపడ్డారు. ఎక్కడికక్కడ లోకలైజేషన్ వల్ల వ్యయాలూ పెరుగుతాయని, ఫలితంగా సేవల నాణ్యత తగ్గవచ్చని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డేటా ఎక్కడ భద్రపర్చినా సురక్షితంగా ఉండేలా కఠిన చట్టాలు, టెక్నాలజీ అవసరమని చెప్పారు. గురువారమిక్కడి ఐఎస్‌బీలో ప్రైవసీ, డేటా భద్రత తదితర అంశాలపై అమెరికా–ఇండియా బిజినెస్ కౌన్సిల్, అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా కేథరిన్ హడ్డా ఈ విషయాలు చెప్పారు.

డేటా చట్టంతో అవకాశాలు: ప్రతిపాదిత డేటా భద్రత చట్టంతో కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, అవకాశాలు కూడా పుష్కలంగా ఉంటాయని ఇదే సదస్సులో పాల్గొన్న తెలంగాణ పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ చెప్పారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో డేటా భద్రత, లోకలైజేషన్‌కు సంబంధించిన బిల్లు ఆమోదం పొందగలదని ఆయన తెలిపారు. అమెరికా, భారత్‌తో పాటు జపాన్, సింగపూర్ తదితర దేశాల నుంచి ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు.

కార్డు చెల్లింపుల్లో హైదరాబాద్ ద్వితీయ స్థానం

న్యూఢిల్లీ: డిజిటల్ యుగానికి అడ్డం పడుతున్న నగరాల్లో బెంగళూరు టాప్ వన్ స్థానంలో నిలిచింది. పేమెంట్స్ సొల్యూషన్స్ సంస్థ రేజర్‌పే నిర్వహించిన తాజా సర్వేలో ఈ నగరం మోస్ట్ డిజిటలైజ్డ్ సిటీల జాబితాలో ప్రథమ స్థానంలో ఉంది. 'ఎరా ఆఫ్ రైజింగ్ ఫిన్‌టెక్' పేరిట గురువారం విడుదలచేసిన సర్వేలో బెంగళూరు తరువాత వరుసగా హైదరాబాద్, ముంబై, పూణే, ఢిల్లీ నగరాలు ఉన్నాయి. రాష్ట్రాల జాబితాలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, న్యూఢిల్లీ టాప్ స్థానాల్లో ఉన్నట్లు వెల్లడించింది.

సైయంట్ లాభంలో 10 శాతం వృద్ధి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీరింగ్ సర్వీసెస్ కంపెనీ సైయంట్ జూన్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే సుమారు 10 శాతం వృద్ధి చెంది రూ.90.5 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.1,097 కోట్ల నుంచి రూ.1,117 కోట్లకు ఎగసింది. అనుబంధ కంపెనీలైన సైయంట్ డీఎల్ఎం, సైయంట్ ఇన్‌సైట్‌లను మాతృ సంస్థలో విలీనానికి బోర్డు సమ్మతించింది. ప్రస్తుతం కంపెనీలో 15,043 మంది ఉద్యోగులున్నారు.

ఏసీసీ లాభం రూ.456 కోట్లు

- 39 శాతం అప్
- 8 శాతం వృద్ధితో రూ.4,150 కోట్లకు మొత్తం ఆదాయం

న్యూఢిల్లీ: సిమెంట్ కంపెనీ, ఏసీసీ ఈ ఏడాది జూన్‌తో ముగిసిన త్రైమాసిక కాలంలో రూ.456 కోట్ల నికర లాభం సాధించింది. గత ఏడాది ఇదే క్వార్టర్‌లో సాధించిన నికర లాభం, రూ.329 కోట్లుతో పోల్చితే 39 శాతం వృద్ధి సాధించామని ఏసీసీ తెలిపింది. అమ్మకాలు, నిర్వహణ పనితీరు మెరుగుపడటంతో నికర లాభంలో ఈ స్థాయి వృద్ధి నమోదైనట్టు ఏసీసీ తెలిపింది. కార్యకలాపాల ఆదాయం రూ.3,848 కోట్ల నుంచి 8 శాతం వృద్ధితో రూ.4,150 కోట్లకు పెరిగిందని పేర్కొంది. ఈ కంపెనీ జనవరి–డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పాటిస్తోంది.

మంచి ఫలితాలు: జూన్ క్వార్టర్‌లో సిమెంట్‌కు డిమాండ్ అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, వినూత్న ఉత్పత్తులు, వినియోగదారులతో పటిష్టమైన సంబంధాల కారణంగా మంచి ఫలితాలు సాధించామని ఎమ్‌డీ, సీఈఓ నీరజ్ అఖౌరీ పేర్కొన్నారు.

స్టెరిలైట్ టెక్నాలజీస్ ఆదాయం 63 శాతం అప్

న్యూఢిల్లీ: బ్రాడ్‌బాండ్ టెక్నాలజీ ఉత్పత్తులు అందజేసే స్టెరిలైట్ టెక్నాలజీస్ కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ క్వార్టర్‌లో 17 శాతం పెరిగింది. గత క్యూ1లో రూ.120 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.141 కోట్లకు పెరిగిందని స్టెరిలైట్ టెక్నాలజీస్ తెలిపింది. ఎగుమతుల్లో వృద్ధి, మార్జిన్లు అధికంఆ ఉండే విలువాధారిత ఉత్పత్తుల అమ్మకాలు పెరగడం వల్ల నికర లాభం ఈ స్థాయిలో పెరిగిందని వివరించింది. ఆదాయం రూ.877 కోట్ల నుంచి 63 శాతం వృద్ధి చెంది రూ.1,432 కోట్లకు ఎగసిందని పేర్కొంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో స్టెరిలైట్ టెక్నాలజీస్ షేర్ 0.7 శాతం నష్టంతో రూ.163 వద్ద ముగిసింది.

మాల్యాను మరింత సీరియస్‌గా తీసుకోవాల్సింది

- యూకే, భారత వ్యాపార కౌన్సిల్ అభిప్రాయం
- ద్వైపాక్షిక వాణిజ్యంపై బ్రెగ్జిట్ ప్రభావం ఉండదని వ్యాఖ్య

ముంబై: పారిశ్రామికవేత్త విజయ్‌మాల్యా విషయాన్ని బ్రిటన్ ప్రధాన మంత్రి థెరెసామే మరింత సీరియస్‌గా తీసుకుని, పరిష్కరించి ఉండాల్సిందని యూకే–భారత వ్యాపార కౌన్సిల్ అభిప్రాయపడింది. పరారీలో ఉన్న విజయ్‌మాల్యాను వెనక్కి రప్పించి, చట్టప్రకారం విచారణ ఎదుర్కొనేలా చేయడం భారతీయులకు ముఖ్యమైన అంశంగా పేర్కొంది. థెరెసా మే స్థానంలో బోరిస్ జాన్సన్ బ్రిటన్ ప్రధానిగా ఈ నెల 23న బాధ్యతలు చేపట్టడం ఖాయమని కౌన్సిల్ భావిస్తోంది. ఒప్పందంతో బ్రెగ్జిట్ జరిగినా, ఒప్పందం లేకుండా జరిగినా కానీ భారత్–బ్రిటన్ ద్వైపాక్షిక వాణిజ్యంపై పెద్ద ప్రభావం చూపదని పేర్కొంది. ''ఆమె ఇంకా సీరియస్‌గా తీసుకోవాల్సింది. ఇది మోదీ సర్కారుకు ఎంతో ముఖ్యమైనది. కోర్టుల్లో ఉన్న అంశమని తేలిగ్గా చెప్పకుండా, ఆమె దీనిని గుర్తించి ఉంటే బాగుండేది'' అని యూకే–భారత వ్యాపార కౌన్సిల్ చైర్మన్ క్రిస్ పార్సన్స్ మీడియాతో అన్నారు. భారత్‌కు తనను అప్పగించడాన్ని సవాలు చేస్తూ మాల్యా వేసిన పిటిషన్‌పై విచారణను బ్రిటిష్ హైకోర్టు వచ్చే ఏడాది ఫిబ్రవరి 11కు వాయిదా వేసిన రోజే పార్సన్స్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మాల్యాను భారత్‌కు అప్పగించినట్టయితే, మోసం, మనీలాండరింగ్ కేసులను (రూ.9,000 కోట్లు) ఆయన ఎదుర్కోవాల్సి ఉంటుంది. మాల్యా ఎంతో తెలివైన వారని, తను ఇంగ్లండ్‌లోనే కొనసాగేందుకు వీలుగా మంచి న్యాయ నిపుణులను నియమించుకున్నట్టు పార్సన్స్ వ్యాఖ్యానించారు.

అమిత్‌షా ఆధ్వర్యంలో 'ఎయిర్‌ఇండియా' కమిటీ

విక్రయానికి మంత్రుల ప్యానెల్

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియాలో ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమాన్ని చూసేందుకు మంత్రుల బృందాన్ని కేంద్రం తిరిగి కొత్తగా ఏర్పాటు చేసింది. ఈ బృందానికి కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా అధ్యక్షత వహించనున్నారు. ఎయిర్ ఇండియా విక్రయానికి సంబంధించిన నమూనాలపై ఈ ప్యానెల్ పనిచేయనుండగా, ఇందులో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, హర్‌దీప్‌సింగ్ పూరి సభ్యులుగా ఉంటారు. ఎయిర్ ఇండియాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 2017లో ఏర్పాటు చేసిన ప్యానెల్‌లో మంత్రులు నితిన్‌గడ్కరీ, అశోక్‌గజపతి రాజు, సురేష్‌ప్రభు, పీయూష్ గోయల్ ఉన్నారు.

బోర్డ్ మీటింగ్స్

రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇండిగో, ఆర్‌బీఎల్ బ్యాంక్, బంధన్ బ్యాంక్, డాబర్ ఇండియా, ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్, ఐసీఐసీఐ లాంబార్డ్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	35,700	▲ 100
బంగారం (22 క్యారెట్లు)	34,000	▲ 100
వెండి (కిలో)	43,800	▲ 1,500
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	34,990	▲ 400
బంగారం (22 క్యారెట్లు)	33,320	▲ 380
వెండి (కిలో)	43,800	▲ 1,500
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	34,990	▲ 400
బంగారం (22 క్యారెట్లు)	33,320	▲ 380
వెండి (కిలో)	43,800	▲ 1,500
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	34,600	▲ 150
బంగారం (22 క్యారెట్లు)	32,100	▲ 210
వెండి (కిలో)	40,000	▲ 800
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	35,750	▲ 260
బంగారం (22 క్యారెట్లు)	33,240	▲ 230
వెండి (కిలో)	41,500	▲ 1000
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	36,020	▲ 400
బంగారం (22 క్యారెట్లు)	33,320	▲ 380
వెండి (కిలో)	43,800	▲ 1,500

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పనిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	55.41 (రాత్రి 11.30కు)	$56.78 (బుధవారం ముగింపు)
బ్రెంట్	62.20 (రాత్రి 11.30కు)	$63.66 (బుధవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 19-07-2019

విశాఖ	370-00
చిత్తూరు	408-00
వరంగల్	378-00
చెన్నై	415-00
ముంబై	430-00
విజయవాడ	355-00
నమక్కల్	405-00
గోదావరి	355-00
18-07-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	375-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.35
బెంగళూరు	395-00
కోల్‌కత్త	395-00
ఢిల్లీ	355-00

సెలవుపై కేర్ రేటింగ్స్ సీఈవో రాజేష్

తాత్కాలిక సీఈవోగా అరుణ్ కుమార్

న్యూఢిల్లీ: రుణాలు డిఫాల్ట్ అయిన ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్‌కి 'ట్రిపుల్ ఎ' రేటింగ్ ఇచ్చిన అంశం ప్రస్తుతం రేటింగ్ ఏజెన్సీల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇక్రా తర్వాత తాజాగా కేర్ రేటింగ్స్ సంస్థ తమ ఎండీ, సీఈవో రాజేష్ మొకాషీని దీర్ఘకాల సెలవులో పంపిస్తున్నట్లు వెల్లడించింది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి అందిన ఓ ఫిర్యాదుపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. తాత్కాలిక సీఈవోగా టీఎన్ అరుణ్ కుమార్‌ను నియమించాలని నిర్ణయించినట్లు తెలిపింది. ప్రస్తుతం ఆయన ఈడీగా పనిచేస్తున్నారు.

ఆడిటర్ల రాజీనామాల నిబంధనలు కఠినం

న్యూఢిల్లీ: కంపెనీల ఆడిటింగ్ బాధ్యతల నుంచి తప్పుకునే ఆడిటర్లు.. రాజీనామాకు దారితీసిన కారణాలను సవివరంగా వెల్లడించేలా నిబంధనలు కఠినతరం చేయాలని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ భావిస్తోంది. ఇటీవల పలు కంపెనీల నుంచి ఆడిటర్లు అర్థాంతరంగా తప్పుకుంటున్న సందర్భాలు పెరుగుతున్న నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. సెబీ ప్రతిపాదనల ప్రకారం.. ఒక వేళ ఆడిటింగ్ అవసరమైన వివరాలను కంపెనీ అందించకపోవడం వల్ల రాజీనామా చేసిన పక్షంలో ఆ విషయాన్ని ఆడిటరు కచ్చితంగా వెల్లడించాల్సి ఉంటుంది. అలాగే, ఒక ఆర్థిక సంవత్సరంలో ఆఖరు త్రైమాసికం తప్ప మిగతా మూడు క్వార్టర్స్ ఫలితాలను ఆడిట్ చేసి ఉంటే.. అర్థాంతరంగా తప్పుకోవడానికి ఉండదు. ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆడిట్ రిపోర్టు పూర్తి చేశాకే రాజీనామా చేయడానికి ఉంటుంది. ఆడిటర్లు హఠాత్తుగా మధ్యలో తప్పుకోవడం వల్ల కంపెనీకి సంబంధించిన వివరాలు తెలిసే వీలు లేక ఇన్వెస్టర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుండటంతో సెబీ తాజా ప్రతిపాదనలు తెరపైకి తెచ్చింది.

నెట్‌ఫ్లిక్స్ రూ.250 ప్లాన్..!

న్యూఢిల్లీ: వీడియో స్ట్రీమింగ్ సర్వీసు లందించే అమెరికన్ సంస్థ నెట్‌ఫ్లిక్స్.. భారత మొబైల్ ఫోన్ యూజర్లకు అతి తక్కువ సబ్‌స్క్రిప్షన్‌కే సేవలందించనుంది. కేవలం రూ.250 నెలవారీ ప్లాన్‌కే సేవలనందించే దిశగా పలు ప్రయత్నాలను చేస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థ కనీస ప్లాన్ రూ.500 నుంచి ఉన్న విషయం తెలిసిందే కాగా, వీలైనంత తక్కువ ధరకు ఈ ప్లాన్‌ను అందించాలని భావిస్తోంది. ఈ ఏడాది మూడో త్రైమాసికం నాటికి చౌక ప్లాన్‌ను అందించేలా ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది.

బీఎస్ఎన్ఎల్‌కు మూలధన నిధుల సాయం!

న్యూఢిల్లీ: టెలికం మార్కెట్లో బీఎస్ఎన్ఎల్ మరింత పోటీ పడే చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. టెక్నాలజీని మెరుగుపరచడం, నిధుల సాయం అందించడం ఇందులో భాగంగా ఉన్నట్టు చెప్పారు. పూర్వపు ప్రభుత్వాల నుంచి వారసత్వంగా సమస్యలు వచ్చాయని, బీఎస్ఎన్ఎల్‌ను మరింత పోటీపడేలా చేస్తున్నట్టు రాజ్యసభకు తెలిపారు. టెలికం మార్కెట్లో స్థిరత్వం కోసం కనీసం ఒక ప్రభుత్వరంగ సంస్థ అయినా ఉండడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రపంచంలో భారత్‌లోనే డేటా, మొబైల్ ధరలు చౌకగా ఉన్నట్టు చెప్పారు. మూలధన నిధులు అందించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి సంజయ్ శ్యామ్‌రావు ధోత్రే సైతం రాజ్యసభకు తెలిపారు.

భారత్ ఆర్థికంపై అంతర్జాతీయ ప్రతికూల ప్రభావం

- ఏడీబీ అంచనా
- 2019-2020 వృద్ధి రేటు అంచనా కోత
- 7.2 శాతం నుంచి 7 శాతానికి కుదింపు
- అయినా, ప్రపంచంలో వేగవంతమైన ఆర్థిక వ్యవస్థ హోదా

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల వృద్ధి మందగమనం... ప్రపంచ వాణిజ్యంపై దీని ప్రభావం వంటి అంశాలు 2019-2020 ఆర్థిక సంవత్సరంలో భారత్‌పై ప్రతికూల ప్రభావం చూపిస్తాయని ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) అంచనావేసింది. దీనివల్ల దేశ వృద్ధి అంచనాలను 20 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) తగ్గిస్తున్నామని తెలిపింది. దీనితో 2019-2020 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏడీబీ వృద్ధి అంచనా 7.2 శాతం నుంచి 7 శాతానికి తగ్గింది. ఈ స్థాయి వృద్ధి సాధించినా.. ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ హోదాను భారత్ కొనసాగిస్తుందని ఏడీబీ పేర్కొంది. 2019లో ఆసియా అభివృద్ధికి సంబంధించి అవుట్‌లుక్ (ఏడీఓ)ను గురువారం ఏడీబీ విడుదల చేసింది. ఇందులో కొన్ని ముఖ్యాంశాలు చూస్తే...

- 2019లో చైనా వృద్ధి రేటు 6.3 శాతంగా నమోదయ్యే అవకాశం ఉంది. 2020లో ఇది మరింతగా 6.1 శాతానికి తగ్గవచ్చు. అమెరికాతో వాణిజ్య యుద్ధ దీనికి ప్రధాన కారణం.
- 2019-20తో పోల్చితే 2020-21లో భారత్ వృద్ధి రేటు స్వల్పంగా 7 శాతం నుంచి 7.2 శాతానికి పెరిగే అవకాశం ఉంది. ఇటీవల తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణలు, దీనితో దేశంలో మెరుగుపడిన వాణిజ్య పరిస్థితులు, బ్యాంకింగ్ పటిష్టత, వ్యవసాయ రంగం పనితీరు బాగుండడం వంటి అంశాలు దీనికి కారణం.
- 2019-20లో భారత్ వృద్ధిని ఏడీబీ తగ్గించడం ఇది రెండవసారి. తొలుత ఈ రేటును 7.6 శాతంగా అంచనావేసింది. అయితే ఏప్రిల్‌లో 7.2 శాతానికి తగ్గించింది. ఇప్పుడు అంచనాలకు మరో 20 బేసిస్ పాయింట్ల కోత పెట్టింది.
- క్రూడ్ ధరల తీవ్రత, కరెన్సీ విలువల్లో అనిశ్చితి వంటి అంశాలు భారత్ వృద్ధి మందగమనానికి కారణాలు.
- 2018-19 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు ఐదేళ్ల కనిష్టస్థాయి 5.8 శాతానికి పరిమితమైన సంగతిని నివేదిక ప్రస్తావిస్తూ, ప్రైవేటు వినియోగం తగ్గడం, పెట్టుబడుల్లో వృద్ధి మందగమనం దీనికి కారణంగా పేర్కొంది.
- వ్యవసాయం, తయారీ రంగాల్లో వృద్ధి నెమ్మదించింది. సేవల రంగం కొంత బాగుంది.
- 2019లో ఆసియా ప్రాంత జీడీపీ 5.7 శాతంగా నమోదయ్యే అవకాశం ఉంది.

పలు అంచనాలు...

6.8 నుంచి 7.2 శాతం వరకూ...

ఫిచ్: భారత్ జీడీపీ వృద్ధి అంచనాలను ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజం- ఫిచ్ వరుసగా రెండవసారి కుదించింది. 2019- 2020లో కేవలం 6.6 శాతమే నమోదవుతుందని ఫిచ్ అంచనా వేసింది. తొలుత 7 శాతంగా ఉన్న ఈ అంచనాలను మార్చిలో 6.8 శాతానికి తగ్గించింది. జూన్‌లో మరో 20 బేసిస్ పాయింట్లు కుదించింది. గత ఏడాది కాలంగా తయారీ, వ్యవసాయ రంగాల పేలవ పనితీరు తమ తాజా అంచనాలకు కారణమని తెలిపింది.

గోల్డ్‌మన్ శాక్స్: దేశ ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకుంటుందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 7.2 శాతంగా నమోదవుతుందని, ఇందుకు.. తగ్గిన ముడి చమురు ధరలు, రాజకీయ స్థిరత్వం, మౌళికరంగంలోని అవరోధాల తొలగిపోతుండడం వంటి సానుకూల అంశాలు ఊతమివ్వనున్నాయని తన తాజా నివేదికలో పేర్కొంది. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గింపు వల్ల ద్రవ్యలభ్యత పెరిగి వృద్ధి ఊపందుకుంటుందని భావిస్తున్నట్లు తెలిపింది.

ప్రపంచబ్యాంక్: ఇక భారత ఎకానమీ వృద్ధిరేటు వచ్చే మూడేళ్ల పాటు

చిన్న అడుగు.. పెద్ద ముందడుగు



చంద్రయాన్‌తో మనకు వచ్చేదేంటంటూ కొందరి వాదన

ఎన్నో కొత్త ప్రయోగాలకు వేదికైన అపోలో-11 సక్సెస్

అంతరిక్ష ప్రయోగాలతో ప్రయోజనం లేదని.. ఆ ప్రయోగాలకయ్యే ఖర్చుతో పేదవారి ఆకలి తీర్చవచ్చని, మౌలిక సదుపాయాలను మెరుగుపరచొచ్చని చాలామంది వాదిస్తుంటారు. కానీ ఇది సరైన వాదన కాదని చరిత్ర చెబుతోంది. మనం వినియోగించే కంప్యూటర్లు మొదలుకొని.. వైద్యం కోసం ఉపయోగిస్తున్న పరికరాల వరకూ అన్నింటికీ మూలాలు మిలటరీ, అంతరిక్ష ప్రయోగాల్లోనే ఉన్నాయి. నాసా.. అపోలో-11 రాకెట్‌ను జాబిల్లిపైకి పంపేముందు.. అందుకోసం బోలెడన్ని టెక్నాలజీలను అభివృద్ధి చేసింది. కచ్చితంగా చెప్పాలంటే.. 6,300 టెక్నాలజీలపై ఆధిపత్యం సాధించిన తరువాతే నాసా అంతరిక్ష ప్రయోగాలకు సిద్ధమైంది. వీటిలో ప్రస్తుతం మన దైనందిన వ్యవహారాలను చాలా సులువు చేసినవి మచ్చుకు కొన్ని..

సీఏటీ స్కానర్

అంతరిక్ష ప్రయోగాల్లో ఉపయోగించే లోహాల్లో ఉండే సూక్ష్మస్థాయి మలినాలను గుర్తించేందుకు అభివృద్ధి చేసిన టెక్నాలజీనే కాలక్రమంలో కంప్యూటరైజ్డ్ ఆక్సియల్ టోమోగ్రఫీ స్కాన్.. క్లుప్తంగా క్యాట్ స్కాన్‌గా మారింది. శరీరం లోపలి అవయవాలను, కేన్సర్ వంటి వ్యాధులను గుర్తించేందుకు ఈ పరికరాన్ని విస్తృతంగా ఉపయోగిస్తున్న సంగతి తెలిసిందే.

మెత్తటి పరుపులు

మీరు మెమరీ ఫోమ్ మ్యాట్రెస్ వాడుతున్నారా? అయితే మీరూ అపోలో-11 రాకెట్ ప్రయోగానికి థ్యాంక్స్ చెప్పాల్సిందే. రాకెట్ జాబిల్లిపై ల్యాండ్ అయ్యేటప్పుడు వ్యోమగాములకు ఇబ్బంది ఎదురు కాకుండా ఉండేందుకు రూపొందించిన ఫోమ్ ఇప్పుడు పరుపుల్లోనూ... కొన్ని షాక్ అబ్జార్బింగ్ హెల్మెట్లలోనూ వాడుతున్నారు.

తీగల్లేని పరికరాలు

వ్యాక్యూమ్ క్లీనర్లు మొదలుకొని అనేక ఇతర ఎలక్ట్రిక్ పరికరాలు తీగల్లేకుండా పనిచేస్తున్నాయంటే అందుకు కారణం అపోలో-11 ప్రయోగమే. జాబిల్లిపై మట్టి నమూనాలను సేకరించేందుకు నాసా తొలిసారి తీగల అవసరం లేని, బ్యాటరీతో పనిచేసే డ్రిల్లింగ్ యంత్రాలను అభివృద్ధి చేసింది.

మైక్రోచిప్

1969లో అపోలో-11 ప్రయోగం జరిగే నాటికి తొలితరం కంప్యూటర్లే అందుబాటులో ఉన్నాయి. మానవసహిత అంతరిక్ష ప్రయోగంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా విలువైన ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉండటంతో నాసా కోసం టెక్సస్ ఇన్‌స్ట్రుమెంట్స్ సంస్థ అపోలో-11 కోసం తొలిసారి ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ లేదా మైక్రోచిప్‌లను తయారు చేసింది. జాక్ కిల్బీ, రాబర్ట్ నోయిస్‌ల కృషి ఫలితంగా తయారైన ఈ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లతోనే అపోలో గైడెన్స్ కంప్యూటర్‌ను తయారు చేశారు. కాలక్రమంలో ఈ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లు లార్జ్, వెరీలార్జ్ స్కేల్ ఐసీలుగా రూపాంతరం చెందాయి. స్మార్ట్‌ఫోన్లు మొదలుకొని ఆధునిక వాహన టెక్నాలజీల వరకూ అన్నింటికీ ఈ మైక్రోచిప్‌లే ప్రాణాధారంగా మారాయి.

గీతలు పడని కళ్లద్దాలు

వ్యోమగాములు వాడే హెల్మెట్ల ముందుండే అద్దంపై గీతలు పడకుండా ఉండేందుకు నాసా అభివృద్ధి చేసిన ప్రత్యేక పదార్థమే ఇప్పుడు మన కళ్లద్దాలు మరింత కాలం మన్నేలా చేస్తోంది.

శాటిలైట్ టెలివిజన్

వ్యోమ నౌకల రేడియో సంకేతాలు స్పష్టంగా ఉండేందుకు అభివృద్ధి చేసిన టెక్నాలజీ ఇప్పుడు మన టెలివిజన్ చిత్రాలు గజిబిజిగా మారకుండా.. ధ్వని స్పష్టంగా ఉండేందుకూ ఉపయోగపడుతున్నాయి.

శీతలీకరించిన ఆహారం

దేశవిదేశాలకు చెందిన పండ్లు, కాయగూరలు దీర్ఘకాలం పాటు తాజాగా ఉండేందుకు ఉపయోగించే ఫ్రీజ్ డ్రైయింగ్ టెక్నాలజీ అపోలో-11 కోసమే తయారైంది. ఆహారం బరువు తగ్గించేందుకు.. అదే సమయంలో పౌష్టిక విలువలు నష్టపోకుండా ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు దీన్ని అభివృద్ధి చేశారు.

నీటిలోని బ్యాక్టీరియాను చంపేందుకు అభివృద్ధి చేసిన పద్ధతి ఇప్పటికీ మన వాటర్ ఫిల్టర్లలో వాడకంలో ఉండగా.. ఇళ్లల్లో, విమానాశ్రయాల్లాంటి బహిరంగ ప్రదేశాల్లో పొగలను గుర్తించేందుకు ఉపయోగించే స్మోక్ డిటెక్టర్స్, స్ప్రింగ్‌లాంటి నిర్మాణముండే కాలిజోడు అడుగు భాగాలు, కొన్నేళ్ల క్రితం వరకూ కంప్యూటర్ గేమ్స్ కోసం మనం వాడిన జాయ్‌స్టిక్‌లతోపాటు మరికొన్ని ఇతర టెక్నాలజీలకూ నాసా అంతరిక్ష ప్రయోగ పరిశోధనలే కారణం.

సాక్షి నాలెడ్జ్ సెంటర్

అపోలో -11 ప్రస్థానం ఇలా...

1969 జూలై 16: మధ్యాహ్నం 1.32 గంటలకు కేప్ కేనర్‌వాల్ అంతరిక్ష కేంద్రం నుంచి శాటర్న్-5 రాకెట్ ద్వారా నింగికి ఎగసిన అపోలో-11.

1969 జూలై 20: ప్రయోగం జరిగిన 109 గంటల 24 నిమిషాల 15 సెకన్ల తర్వాత జాబిల్లిపై నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ తొలి అడుగు.

1969 జూలై 22: లూనార్ మాడ్యూల్‌ను విడుదల చేసిన తరువాత భూమివైపు పయనం

1969 జూలై 24: పసిఫిక్ మహాసముద్రంలో ప్యారాచూట్ల సాయంతో దిగిన కమాండ్ మాడ్యూల్..

1969 జూలై 19: 75 గంటల 45 నిమిషాల 50 సెకన్ల తర్వాత జూలై 19వ తేదీన జాబిల్లి కక్ష్యలోకి అపోలో-11 ప్రవేశం

1969 జూలై 21: జాబిల్లిపై గడిపిన 21 గం. 38 నిమిషాల్లో వ్యోమగాములు 21.7 కిలోల మట్టి, రాతి నమూనాలను సేకరించారు.

ద డిష్

జాబిల్లిపై మనిషి కాలుపెట్టిన అపోలో-11 ప్రయోగం జరిగి యాభై ఏళ్లవుతోంది. అయితే ఇప్పటికీ ఈ ప్రయోగపు అవశేషమొకటి ఆస్ట్రేలియా గ్రామీణ ప్రాంతంలో ఉంది. 'ద డిష్'అని పిలుస్తున్న ఈ అవశేషం ఆషామాషీదేమీ కాదు. జాబిల్లిపై నీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్ మోపిన తొలి అడుగును భూమ్మీద కొన్ని కోట్ల మంది కళ్లారా వీక్షించేందుకు అవకాశం కల్పించిన రేడియో టెలిస్కోపు! సిడ్నీకి సుమారు 360 కిలోమీటర్ల దూరంలోని పార్క్స్ వేధశాలలో ఈ టెలిస్కోపు ఉంది. అపోలో-11 ప్రయోగ దృశ్యాలను ఈ టెలిస్కోపుతోపాటు కాలిఫోర్నియాలోని గోల్డ్‌స్టోన్ టెలిస్కోపు, ఆస్ట్రేలియా రాజధాని కాన్‌బెర్రాలోని హనీసకల్ క్రీక్‌లో ఉన్న ఇంకో టెలిస్కోపు ప్రత్యక్ష ప్రసారం చేశాయి. రేడియో టెలిస్కోపు 'ద డిష్'210 అడుగుల వ్యాసంతో ఇప్పటికీ ప్రపంచంలోనే అతిపెద్ద టెలిస్కోపుల్లో ఒకటిగా కొనసాగుతోంది.



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న కస్తూరి రంగన్

జాతీయ విద్యావిధానంతో సమూల మార్పులు

- యూజీసీ స్థానంలో భారత ఉన్నత విద్యా కమిషన్
- భారతీయ భాషల ప్రోత్సాహానికి ప్రత్యేక ప్రాధాన్యత
- ఎన్ఈపీ చైర్మన్ కె.కస్తూరి రంగన్ వెల్లడి

హైదరాబాద్: జాతీయ నూతన విద్యావిధానంతో సమూల మార్పులు వస్తాయని నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఈపీ) కమిటీ చైర్మన్, పద్మవిభూషణ్ డాక్టర్ కె.కస్తూరి రంగన్ పేర్కొన్నారు. దీని సాయంతో ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య (ఈసీసీఈ) నుంచి వయోజన విద్య వరకు పర్యవేక్షించే అవకాశం ప్రభుత్వానికి లభిస్తుందని తెలిపారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని సావిత్రి బాయిపూలే డీఎస్‌టీ ఆడిటోరియంలో హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ పొదిలె అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 'డ్రాఫ్ట్ నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ: కీ ఫీచర్స్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్'పై ఆయన ప్రత్యేక ఉపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా మాధ్యమిక విద్య వరకు విద్యాహక్కును అమలు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. జ్ఞాన సృష్టి కోసం ఉన్నత విద్యపై దృష్టి కేంద్రీకరించాలని, తద్వారా ఇది జాతీయ ఆదాయానికి సహాయపడుతుందని పేర్కొన్నారు.

కొత్త మార్పులు ఇవే..

జాతీయ నూతన విద్యావిధానం ద్వారా భారతీయ భాషల ప్రోత్సాహానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ విధానం ద్వారా 2030 నాటికి 100 శాతం వయోజన విద్యను సాధించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకుల స్థానంలో దశలవారీగా రెగ్యులర్ ఉద్యోగుల నియామకం జరుగుతుందని పేర్కొన్నారు. పార్లమెంటు చట్టం ద్వారా స్వయంప్రతిపత్తి గల సంస్థగా నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పడుతుందని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) స్థానంలో కొత్తగా భారత ఉన్నత విద్యా కమిషన్ ఏర్పడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ వీసీ-2 ప్రొఫెసర్ రాజశేఖర్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులకు చెందిన యూనివర్సిటీలు, అటానమస్ కళాశాలల ప్రముఖ విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలు పాటించాల్సిందే

- ఎన్‌కౌంటర్ల దర్యాప్తుపై సుప్రీం కోర్టు
- పోలీస్ అధికారుల సంఘం పిటిషన్‌పై ధర్మాసనం ఉత్తర్వులు

సాక్షి, న్యూఢిల్లీ: పోలీస్ ఎన్‌కౌంటర్లపై దర్యాప్తు జరిపేటప్పుడు గతంలో జస్టిస్ ఆర్.ఎం.లోధా నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన తీర్పులోని మార్గదర్శకాలను పాటించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2006లో నాటి మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి మాధవ్ అలియాస్ బుర్రా చిన్నయ్యసహా ఎనిమిది మంది నక్సలైట్లు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. కె.రాధ అనే వ్యక్తి ఈ ఘటనలో గాయపడ్డారు. ఈ ఘటనపై ఏపీ సివిల్ లిబర్టీస్ కమిటీ (ఏపీసీఎల్స్) హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. అది ఎన్‌కౌంటర్ కాదని, అక్రమంగా నిర్బంధించి తెచ్చి అడవుల్లో చంపేశారని పిటిషన్‌లో పేర్కొంది. జస్టిస్ గోడ రఘురాం, జస్టిస్ వీవీఎస్ రావు, జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి, జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జి.భవానీప్రసాద్‌లతో కూడిన ఫుల్ బెంచ్ విచారణ జరిపి ఫిబ్రవరి 6, 2009న తీర్పు ప్రకటించింది. 'ఒక పోలీస్ అధికారి ఒక వ్యక్తి మరణానికి కారణమైతే, అధికార విధుల్లో భాగమైనా, ఆత్మరక్షణ కోసమైనా, సంబంధిత ఘటనకు దారితీసిన కారణాలను నిక్షిప్తం చేస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి' అని ఆ తీర్పులో పేర్కొంది. అయితే, పోలీసులను బాధ్యులుగా చేయడాన్ని వ్యతిరేకిస్తూ, ఈ తీర్పును సవాలు చేస్తూ ఏపీ పోలీసు అధికారుల సంఘం సుప్రీంకోర్టులో 2009లో స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్పీ) దాఖలు చేసింది. పోలీసుల వివరాలు కూడా ప్రకటించాలన్న అభ్యర్థనను పక్కనపెట్టిన అంశాన్ని సవాలు చేస్తూ.. సదరు ఘటనలో గాయపడిన కె.రాధ కూడా మరో పిటిషన్ దాఖలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరొక ఎస్ఎల్పీ దాఖలు చేసింది. పదేళ్లపాటు సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తాజాగా ఈ కేసు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం వద్దకు విచారణకు వచ్చింది. విచారణలో సివిల్ లిబర్టీస్ సంస్థ తరపున సీనియర్ న్యాయవాది కొలిన్ గొన్‌సాల్వేస్, కె.రాధ తరపున అల్లంకి రమేశ్, సత్యంరెడ్డి, పోలీస్ అధికారుల సంఘం తరపున హరేన్ రావల్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఆదినారాయణ, మహ్‌ఫూజ్ నజ్కీ పాల్గొన్నారు. సివిల్ లిబర్టీస్ సంస్థ తరపున కొలిన్ గొన్‌సాల్వేస్ వాదనలు వినిపిస్తూ పోలీసులు అక్రమంగా నిర్బంధించి బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారని నివేదించారు. ఆత్మరక్షణ పేరుతో చంపాల్సి వచ్చిందని కేసులు మూసివేస్తున్నారని పేర్కొన్నారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం తరపున హరేన్ రావల్ వాదనలు వినిపిస్తూ తమపై కేసులు చుట్టుకుంటాయన్న భయంతో పోలీసు అధికారుల్లో మనోధైర్యం లోపిస్తోందన్నారు.

ఎఫ్ఐఆర్ నమోదులో తప్పేముంది?

ఎన్‌కౌంటర్ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో తప్పేముందని ఈ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. 'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర' కేసులో జస్టిస్ లోధా నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన తీర్పులో కూడా ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని స్పష్టం చేసిందని ధర్మాసనం గుర్తుచేసింది. ఆ తీర్పులోని 16 మార్గదర్శకాలు అన్ని సందర్భాల్లోనూ వర్తిస్తాయని స్పష్టం చేసింది. సెక్షన్ 157 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఇతర పోలీస్‌స్టేషన్ అధికారులతో దర్యాప్తు జరిపించి, ఆ నివేదికను కోర్టుకు సమర్పించాలని జస్టిస్ లోధా తీర్పు స్పష్టం చేసింది. ఆ తీర్పులోని మార్గదర్శకాలే ఈ కేసులోనూ వర్తిస్తాయని తాజాగా జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

డ్రోన్ల ద్వారా ఔషధ పంపిణీ!

సాక్షి, హైదరాబాద్: ఆకాశమార్గంలో డ్రోన్ల ద్వారా ఔషధాలు, రక్తం, వ్యాక్సిన్లు, వైద్య పరీక్షలకోసం నమూనాలు ఇచ్చేలా అధ్యయనం జరిపేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరం, హెల్త్‌నెట్ గ్లోబల్ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం గురువారం పరస్పర అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకుంది. రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, వరల్డ్ ఎకనామిక్ ఫోరంకు సంబంధించిన నాలుగో పారిశ్రామిక విభాగం ఎండీ మురత్ సోమేజ్, హెల్త్‌నెట్ గ్లోబల్ సంస్థ ప్రతినిధి కె.హరిప్రసాద్ సమక్షంలో గురువారం సచివాలయంలో ఈ ఒప్పందం జరిగింది. మారుమూల ప్రాంతాలకు అత్యవసరంగా వైద్య సహాయం అందించేందుకు ఈ టెక్నాలజీ ఉపయోగపడనుందని జయేశ్ రంజన్ ఈ సందర్భంగా తెలిపారు.

'బీసీ జనాభా లెక్కలు వెల్లడించాలి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ జనాభా లెక్కలు వెల్లడించాలని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గణాంకాల ఆధారంగా వార్డులు విభజించి రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈ మేరకు సీఎం కె.చంద్రశేఖర్‌రావుకు లేఖ రాశారు. కాకి లెక్కలతో పలు మున్సిపాలిటీల్లో వార్డుల విభజన, ఓటర్ల జాబితా తయారీ, రిజర్వేషన్ల కేటాయింపులు జరిపినట్లు ఆయన ఆరోపించారు. ప్రభుత్వ యంత్రాంగం హడావుడి ప్రక్రియతో పలు చోట్ల ఎన్నికలు నిలిపివేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. అధికారులు స్పష్టతతో సరైన వివరాలను ప్రకటిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన అవసరం వచ్చేది కాదన్నారు. బీసీ ఓటర్ల లెక్కలు తేల్చాలంటే శాస్త్రీయ పద్ధతిని పాటించి సర్వే నిర్వహించాలని, బీసీ జనాభా ఎంతుందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంటింటా తిరిగి వివరాలు సేకరించాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీసీ జనాభా 27 శాతంగా ఉందని ప్రభుత్వం ప్రకటించిందని, ఇది పూర్తిగా అవాస్తవమని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో గ్రేటర్‌లో బీసీ జనాభా 45 శాతం ఉన్నట్లు ప్రకటించిందని గుర్తు చేశారు.

'అంతర్ జిల్లా బదిలీలకు షెడ్యూల్ విడుదల చేయాలి'

సాక్షి, హైదరాబాద్: ఏడేళ్లుగా అంతర్‌జిల్లా బదిలీలు జరగకపోవడంతో వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, భార్యాభర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) పేర్కొంది. దీంతో అంతర్‌జిల్లా బదిలీలకు షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని గురువారం డిమాండ్ చేసింది. సీఎం కేసీఆర్ గతంలో ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన సమావేశంలో దూర ప్రాంతాల్లో పనిచేస్తున్న భార్యా భర్తలైన టీచర్లను సమీప ప్రాంతాలకు, వీలైతే ఒకే పాఠశాలకు బదిలీ చేస్తామని ప్రకటించారని జాక్టో స్టీరింగ్ కమిటీ సభ్యులు గుర్తుచేశారు. సీఎంవో సిఫార్సుతో పలుకుబడి బదిలీలు చేయడం అన్యాయమని వాపోయారు. టీఆర్టీ, ఎస్జీటీ నియామకాలు తక్షణం చేపట్టాలని కోరారు. సమావేశంలో జాక్టో స్టీరింగ్ కమిటీ సభ్యులు సదానందంగౌడ్(ఎస్టీయూ), రఘునందన్, రమణ (టీటీఎఫ్), సోమయ్య (టీయూటీఎఫ్), కృష్ణుడు (బీసీటీఏ), లక్ష్మణ్‌నాయక్ (టీఎస్‌టీటీఎఫ్), రాములు (టీఎస్‌టీడబ్ల్యూటీయూ), మల్లీశ్వరీ (టీడబ్ల్యూటీఎఫ్) పాల్గొన్నారు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792